www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 226 | సోమవారం | 5 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ఇ-రికార్డులను సాక్ష్యాలుగా స్వీకరించవచ్చు

• ప్రత్యేక సర్టిఫికెట్ అవసరం లేదు: సుప్రీం 10

Scoops ICE CREAM
LOW INVESTMENT HIGH RETURNS
Scoops ice cream who is pioneer in ice cream industry is looking for PARLOUR FRANCHISES. Scoops is known for the quality and range of flavors with affordable prices. For setting up parlor the investment will range from 1 to 2 laks depending upon the location & size of the shop.
Interested parties can contact on this on. 9676735000
SRI SRINIVASA DAIRY PRODUCTS PVT. Ltd.,
Esamia Bazar, Koti, Hyderabad - 500027

ముందస్తు లేనట్టే!

అసెంబ్లీ సీట్లూ పెరగవు

ఎన్నికల ప్రచార శంఖారావానికి నవంబర్‌లో 20 లక్షల మందితో భారీ బహిరంగ సభ

ఎంపిలతో సిఎం వ్యాఖ్యల్లో వెల్లడయిన టిఆర్ఎస్ మనోభావాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే ఎన్నికల ప్రచారాన్ని భారీ బహిరంగ సభతో ప్రారంభించాలని టిఆర్ఎస్ భావిస్తోంది. సుమారు 20 లక్షల మందిని ఈ సభకు సమీకరించాలనుకుంటోంది. ముందస్తు ఎన్నికలు వస్తాయని తొలుత భావించినా కేంద్రం కదలికలు ఆ దిశగా లేనందున యధావిధిగా షెడ్యూలు ప్రకారమే ఉంటాయన్న ఉద్దేశంతో ఈ బహిరంగసభను నవంబరులోనే నిర్వహించాలనుకుంటోంది. అన్ని జిల్లాల నుంచి విస్తృతంగా ప్రజలను సమీకరించి పార్టీ బలాన్ని తెలియజేయాలన్నది ఈ సభ ఉద్దేశం. శాసనసభ స్థానాల సంఖ్య కూడా దాదాపు పెరగవనే టిఆర్ఎస్ ఇప్పుడు భావిస్తోంది. 'పెరిగితే మంచిది... పెరగకుంటే మన ప్లాన్‌లో మనముందాం' అని ఎంపిలతో కెసిఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభల్లో వ్యవహరించాల్సిన తీరును, ప్రస్తావించాల్సిన అంశాలను, కేంద్రంపై తరువాయి 6లో



నేర వివరాలు చెప్పాల్సిందే

• పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు కొత్త నిబంధనలు

• ఉత్తర్వులు సిద్ధం చేస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్

మన తెలంగాణ/ హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలకు కొత్త నిబంధనలు వస్తున్నాయి. ఇప్పటి వరకు శాసనసభ, కౌన్సిల్, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికలకు మాత్రమే వర్తింపచేస్తున్న నియమావళి ఇక నుంచి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకూ వర్తించనుంది. ఈ నిబంధనలు 'స్థానిక' అభ్యర్థులకు టెన్షన్ పుట్టిస్తున్నాయి. పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు వారికి సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పేర్కొని సమర్పించాల్సి ఉంటుంది. అందులో పేర్కొన్న ఏ ఒక్క విషయం తప్పని తేలినా సంబంధిత రిటర్నింగ్ అధికారి అభ్యర్థిపై ఎన్నికల నియమావళి ప్రకారం తరువాయి 6లో

ఎంఎల్‌ఎల వేతనాలు పెంపు

• ఫైలుపై సిఎం సంతకం

• త్వరలో పెరగనున్న రెండో ఎంఎల్‌ఎల జీతాలు 6

హరిత హైద్రాబాద్

రాజధాని నగరం చుట్టూ ఫారెస్టు బ్లాక్‌ల అభివృద్ధి

మూసీ పొడవునా పట్టణ అడవులు

కెబిఆర్ పార్కు వద్ద మాదిరిగా నడకబాటలు

భౌగోళికంగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ పరిసరాల్లో పర్యావరణాన్ని కాపాడుకోవాలి

'సేవ్ హైదరాబాద్' సమీక్షలో ముఖ్యమంత్రి కెసిఆర్

బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీ బిల్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని నగరానికి అన్ని దిక్కులా 60 కి.మీ. వ్యాసంలో (రేడియస్) ఒకటిన్నర లక్షల ఎకరాలకుపైగా అటవీ భూములు ఉన్నాయని, ఆ పచ్చదనాన్ని కాపాడుకుంటూ స్వచ్ఛమైన గాలిని పీల్చుకునేలా హరిత నగరాన్ని నిర్మించాలని, 'ఫారెస్టు బ్లాక్'లను అభివృద్ధిపర్చాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ భౌగోళికంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను అన్ని విధాలుగా సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నగరంలోని కాసు బ్రహ్మానంద రెడ్డి పార్కులో ఉన్నట్లుగా మూసీ రివర్ ఫ్రంట్ ప్రణాళికలో 'వాక్ వే'ను రూపొందించాలని, అర్బన్ ఫారెస్ట్రీని వృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులను వెచ్చించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. ప్రగతి భవన్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన అంశాలతోపాటు 'సేవ్ హైదరాబాద్'పై ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. నగరాన్ని తరువాయి 6లో

'థైరాయిడ్' విసిగిస్తోందా?
కాన్‌స్టిట్యూషనల్ హోమియోపతితో పరిష్కారం సులభం.
• హైపోథైరాయిడ్
• హైపర్‌థైరాయిడ్
• గాయిటర్
హోమియోకేర్ ఇంటర్నేషనల్
టోల్ ఫ్రీ 1800 108 1212
కన్సల్టేషన్ ఉచితం
955 000 1199



మోడీ భ్రమల పాలన

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ప్రధాని ఈ బడ్జెట్‌తో మరోసారి భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నారు : సిపిఐ(ఎం) రాష్ట్ర 2వ మహాసభల్లో ఏచూరి

నల్లగొండ నుంచి ఇ.చంద్రశేఖర్ / మన తెలంగాణ

భ్రమలు సృష్టించి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తాజా బడ్జెట్‌లో పది కోట్ల కుటుంబాలకు వైద్య సదుపాయం, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంపు ప్రకటనలతో మరోసారి భ్రమలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నాస్తున్నారని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి అన్నారు. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో ఓటమి ద్వారా బిజెపి ఎదుర్కొంటున్న ప్రజావ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకు 'ఒకే దేశం ఒకే సారి ఎన్నికలు' అనే నినాదాన్ని ముందుకు తెస్తోందని అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర 2వ మహాసభలు నల్లగొండలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియం నుంచి హైదరాబాద్ రోడ్‌లోని లక్ష్మీ గార్డెన్స్ వరకు పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించాయి. నల్లగొండ పురవీధుల్లో సుమారు 4 కి.మీ. పొడవునా సాగిన రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లక్ష్మీ గార్డెన్స్ వద్ద జరిగిన బహిరంగ సభకు సిపిఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తదితరులు ప్రసంగించారు. ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జె.జానకిరాములు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండా సురేందర్‌రెడ్డి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజేశ్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. మురహరి హాజరై సౌహార్ద తరువాయి 6లో

నేడు మావోయిస్టుల ఏజెన్సీ బంద్

• దండకారణ్య ప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్

మన తెలంగాణ/ భద్రాచలం: మావోయిస్టు పార్టీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. దండకారణ్యంలో బంద్‌ను విజయవంతం చేయాలంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీలు ఇప్పటికే లేఖలు విడుదల చేసిన సంగతి విధితమే. ఈ మేరకు ఆయా గ్రామాల్లో సైతం మావోయిస్టులు బంద్ విజయవంతానికి లేఖలను వదిలారు. దీంతో అప్రమత్తమైన పోలీసు బలగాలు అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. రంగంలోనికి దిగిన పోలీస్ బలగాలు, యాక్షన్ టీమ్‌లు అడవులను జల్లెడ పడుతున్నారు. గ్రామగ్రామాన పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. అనుమానితులను ప్రశ్నిస్తుండటంతో ఆయా గిరిజన గ్రామాల్లో భయానక వాతావరణం చోటు చేసుకుంది. మావోయిస్టులు బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసులు,స్పెషల్ పార్టీ బలగాలు, సిఆర్‌పిఎఫ్ జవాన్లు అప్రమత్తమయ్యారు. పెద్ద ఎత్తున అడవుల బాట పట్టిన భద్రతా తరువాయి 6లో





2లో

శ్రీనివాస్ హత్యపై సిబిఐకి సిద్ధమేనా?

• సిఎం కెసిఆర్‌కు కుంటియా సవాల్



త్వరలోనే పార్టీ

• అనేక పోరాటాలు చేసిన మాకు రాజకీయాలూ తెలుసు

• అందుకే ఇక తేల్చుకుంటాం, ఉద్యమ ఆకాంక్షల సాధనకు ప్రజలను కదిలిస్తాం : కోదండరామ్ 6లో

An ISO 9001 - 2000 Certified
పాజిటివ్ హోమియోపతి
www.drpositivehomeopathy.com
వెన్నునొప్పికి చక్కని పరిష్కారం
• స్పాండిలైటిస్ • వెర్టిగో
• సర్వికల్ స్పాండిలైటిస్
• నరాల బలహీనత
• డిస్క్ ప్రొలాప్స్ • సయాటికా
• లంబర్ స్పాండిలైటిస్
డాక్టర్ కన్సల్టేషన్ ఉచితం
కాల్: 903 067 1177
హైదరాబాద్ | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం

కుంచెపోటు



సోషల్ మీడియాని గుడ్డిగా నమ్మడమేనా.., 30 రూపాయల పిండికి 70 రూపాయల ప్లాస్టిక్ ఎలా కల్తీ చేస్తాం..?



ఐదేళ్ల బాలుడు ఇరిగేషన్ సమాచార ఖని

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్ర సాగునీటి ముఖచిత్రాన్ని కంఠతా చెప్పడం మహామహులైన ఇంజినీర్లకు కూడా సాధ్యం కాని పని. కానీ నిహాల్ ఇందుకు మినహాయింపు. అలాగని నిహాల్ ఇంజినీరో, ఉద్యోగో అసలే కాదు. పట్టుమని ఐదేళ్లు కూడా లేని నిహాల్ యుకెజి చదువుతున్నాడు. ప్రాజెక్టుల గురించి ఆశువుగా చెబితే మహామహులే నివ్వెరపోయారు. బాలుడి తెలివితేటల గురించి ఒక టిఆర్ఎస్ నేత ద్వారా తెలుసుకున్న మంత్రి హరీశ్ తరువాయి 6లో

కువైట్ బాధితులకు కెటిఆర్ అభయం

అక్కడి ప్రభుత్వం క్షమాభిక్షను ఉపయోగించుకొని వెనక్కి రప్పించేందుకు అన్ని రకాలుగా యత్నిస్తున్నాం : మంత్రి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఏడు సంవత్సరాల తర్వాత కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష (ఆమ్నెస్టి) ప్రకటించిన నేపథ్యంలో సరైన పాస్‌పోర్టు, వీసా లేకుండా చిక్కుకు పోయిన తెలంగాణ వారిని తిరిగి వెనక్కి రప్పించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నామని తెలంగాణ ఎన్ఆర్ఐ శాఖమంత్రి కె. తారక రామారావు చెప్పారు. కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష అవకాశం ఇచ్చిందని, దీన్ని ఉపయోగించుకోవాలని తెలంగాణ నుండి వెళ్లి అక్కడ పనిచేస్తున్న వారికి విజ్ఞప్తి చేశామన్నారు. సహాయ సహకారాల కోసం ఎన్ఆర్ఐ శాఖ అధికారులను మొబైల్ నెంబర్ 9440854433 ద్వారా లేదా so_nri@telangana.gov.in ఇ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తరువాయి 6లో

11

అణు పరీక్షకు అమెరికా మళ్లీ సన్నాహాలు

• రెండున్నర దశాబ్దాల విరామం తరువాత

పాక్ రేంజర్ల కాల్పుల్లో నలుగురు జవాన్లు మృతి

2

బిజెపితోనే సామాజిక న్యాయం : లక్ష్మణ్



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో సామాజిక న్యాయం తమ పార్టీ వల్లనే సాధ్యమవుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. లక్ష్మణ్ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని, ముందస్తు ఎన్నికలకు అవకాశమే లేదన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో డా. లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణలో పొత్తుపై అమిత్ షా స్పష్టత ఇచ్చారన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ఉండదని తేల్చి చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీయే ప్రధాన టార్గెట్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు చేస్తున్న ప్రకటనలు అమిత్ షా దృష్టికి వెళ్లాయని, అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారన్నారు. ముందస్తు ఎన్నికలంటూ వస్తున్న వార్తలు వట్టి పుకార్లేనన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జూన్ నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. నాయకులు కూడా అధికార పార్టీ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలని, స్థానికంగా ఉన్న కార్యకర్తలను అన్నింటా కలుపుకొని ముందుకు సాగాలని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈసారి రాష్ట్రంలో బిజెపి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సిబిఐకి సిద్ధమేనా?

సిఎం కెసిఆర్‌కు కుంతియా సవాల్



మన తెలంగాణ/నల్లగొండ: 'బొద్దుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ఎంఎల్‌ఎ పాత్ర లేదని చెప్పగలరా? లేదంటే సిబిఐ విచారణకు కెసిఆర్ సిద్ధమేనా' అంటూ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం నల్లగొండలో జరిగిన బొద్దుపల్లి శ్రీనివాస్ సంతాప సభలో పాల్గొని, శ్రీనివాస్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో కుంతియా మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉందన్నారు. కాంగ్రెస్ నేతలంతా గాంధేయ మార్గంలో వెళ్తుంటే దాన్ని టిఆర్ఎస్ నేతలు అలుసుగా తీసుకొని భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వమంతా జిల్లాలోనే ఉందన్నారు. శ్రీనివాస్ హత్య కేసును కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు రాహుల్‌గాంధీకి తెలిపి పార్లమెంట్‌లో కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

హత్యలో టిఆర్ఎస్‌కు భాగస్వామ్యం..

బొద్దుపల్లి శ్రీనివాస్ హత్యలో టిఆర్ఎస్ పార్టీకి భాగస్వామ్యం ఉందని పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శ్రీనివాస్ హత్యకు ముందే పార్టీ మారాలనే ఆయనను తుపాకులతో బెదిరించారు. శ్రీనివాస్‌కు భద్రత కల్పించాలని డిజిపి, సిఎంను కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. శ్రీనివాస్ హత్యకు ప్రభుత్వం, పోలీసులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతల కాల్‌డేటాను ట్రాప్ చేస్తున్న ప్రభుత్వం శ్రీనివాస్ హత్య కేసు నిందితుల కాల్‌డేటాను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. కేసును దర్యాప్తు చేపట్టిన ఎస్‌పిని సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం సిఎల్‌పి నేత జానారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ హత్యపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను నిలదీస్తామన్నారు. కుట్ర, కుతంత్రాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారన్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. హత్య వెనుక ఉన్న కుట్రదారులకు శిక్ష పడేలా కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పోలీసులు అధికార పార్టీ నేతలకు కాపలా కుక్కలుగా మారారని విమర్శించారు. టిఆర్ఎస్‌పై పోరాటం చేసినందుకే శ్రీనివాస్‌ను హత్య చేశారని అన్నారు. వేముల రంజిత్, సుధీర్‌ల కాల్‌డేటా బయటపెడితే ఎంఎల్‌ఎ వీరేశం కుట్ర బయటపడుతుందన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంఎల్‌ఎ వీరేశంది మొదటి నుంచి నేర చరిత్రేనని దుయ్యబట్టారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి హోంగార్డుకు ఎక్కువ, కానిస్టేబుల్‌కు తక్కువ అని ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకే అధికార పార్టీ నేతలు హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శ్రీనివాస్ హత్యను సిబిఐతో విచారణ జరిపించాలని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు బట్టి విక్రమార్క, సీనియర్ నేతలు వి.హనుమంతరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, మధుయాష్కిగౌడ్, షబ్బీర్ అలీ, మల్లు రవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రీనివాస్ అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

టిఆర్ఎస్ నాయకుల మొండాలన్నీ మోరీలో..



మేం హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తే టిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల మొండాలన్నీ నల్లగొండ మోరీల్లో తేలుతాయని సిఎల్‌పి ఉపనేత, నల్లగొండ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు. కెసిఆర్ రౌడీ రాజకీయాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం కిరాయి హంతకుడిగా మారాడన్నారు. శ్రీనివాస్ హత్య సినీఫక్కీలో జరిగిందని, శ్రీనివాస్ లేడనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ దొంగ దీక్షతో తెలంగాణ రాలేదని, సబ్బండవర్గాల ప్రజలు ఉద్యమిస్తేనే తెలంగాణ వచ్చిందన్నారు. కెసిఆర్‌కు దమ్ముంటే నల్లగొండలో నాపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. దేశం కోసం ప్రాణాలర్పించే పార్టీ కాంగ్రెస్సేనన్నారు. శ్రీనివాస్ హత్య కేసులో న్యాయస్థానంపై మాకు నమ్మకం ఉందని, అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లి న్యాయం సాధిస్తామన్నారు.

నేటి నుంచి బ్యాచ్‌ల వారీగా ఎంఆర్‌ఒలకు రిజిస్ట్రేషన్‌లో శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల కార్యాలయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మార్చాలని ప్రభుత్వం భావించడంతో భూముల రిజిస్ట్రేషన్, స్టాంపుల వ్యవహారానికి సంబంధించి ఎంఆర్‌ఒలందరికీ ఈ నెలాఖరు వరకు శిక్షణ లభించనుంది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం నుంచి బ్యాచ్‌ల వారీగా ఈ శిక్షణా తరగతుల్ని నిర్వహించడానికి సిసిఎల్‌ఎ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 75 మంది ఎమ్మార్వోల చొప్పున రాష్ట్రంలోని మొత్తం 443 మంది ఎంఆర్‌ఒలకు ఈ నెలాఖరు వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు సిసిఎల్‌ఎ అధికారులు వ్యాఖ్యానించారు. ఒక్కో బ్యాచ్‌కు మొత్తం పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఇందులో మూడు రోజులు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితరాలకు సంబంధించిన అంశాలపై విధివిధానాలను వివరిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఆరు రోజుల పాటు ఎమ్మార్వోలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అవగాహన, ప్రాక్టికల్స్ కోసం పంపిస్తామని తెలిపారు. ఆ తర్వాత జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక రోజు పాటు ప్రాక్టికల్స్‌ను అందిస్తామని పేర్కొన్నారు. మొత్తం ఆరు బ్యాచ్‌లుగా 443 మంది ఎంఆర్‌ఒలను విభజించే ప్రక్రియ పూర్తయిందని, వంతులవారీగా శిక్షణ కల్పిస్తామని తెలిపారు. తొలి మూడు రోజుల విధివిధానాల శిక్షణలో రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ సబ్ రిజిస్ట్రార్‌లు 1989 నాటి ఇండియన్ స్టాంప్స్ చట్టం గురించి, 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టం గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ఎదురయ్యే సవాళ్లు, వివాదాల్లోని భూముల విషయంలో వ్యవహరించాల్సిన విధానం, ఇటీవలి కాలంలో వస్తున్న సంస్కరణలు తదితరాలన్నింటిపై ఈ శిక్షణా తరగతుల్లో ఉన్నతాధికారులు వివరిస్తారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ తరగతులు ఉంటాయన్నారు.

నేటి నుంచి జిల్లాల్లో పిసిసి ఓటర్ల జాబితా పరిశీలన కమిటీ పర్యటన

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని 83 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మర్రి శశిధర్ రెడ్డి నేతృత్వంలోని పిసిసి ఎన్నికల విభాగం కో ఆర్డినేషన్ కమిటి నేటి నుంచి 10 వరకు జిల్లాల్లో పర్యటించనుంది. 5వ తేదీన నిజామాబాద్, 6న కరీంనగర్, 7న వరంగల్, ఖమ్మం, 8న నల్గొండ, రంగారెడ్డి, 8న వరంగల్, ఖమ్మం, 9న మెదక్, 10న మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటన సాగనుంది. జిల్లా కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో జరిగే ఓటర్ల జాబితా సవరణల అవగాహన సమావేశంలో మర్రి శశిధర్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు జి. నిరంజన్, బి. కమలాకర్ రావు, శ్యాంమోహన్, రసూల్ ఖాన్, వినోద్ రెడ్డి తదితరులుంటారు.

EVEREST ORGANICS LIMITED
CIN: L24230TG1993PLC015426
Aroor Village, Sadasivpet Mandal, Sanga Reddy (Medak) District, Telangana-502291, India
Website: www.everestorganicsltd.com Email ID: eolcs0405@gmail.com,
Phone No.040-23115956, Fax No. 040-23115954

NOTICE

Pursuant to Regulation 29(1) read with Regulation 47 of the SEBI (Listing Obligations & Disclosure Requirements) Regulations 2015, Notice is hereby given that a meeting of Board of Directors of the Company, will be held on Monday the 12th February 2018 at 12.00 p.m., at its Corporate Office at Plot no. 127 & 128, 1st Floor, Lakeview Plaza, Amar Co-Op. Society, opp. of Madhapur Police Station Road, Near Durgam Cheruvu, Madhapur, Hyderabad – 500 033, Telangana, India, inter-alia to consider and approve the, Un-audited Financial Results of the Company for the quarter ended 31st December 2017 together with Limited Review Report.

Further as per the code of Fair Disclosure and Code of Conduct pursuant to SEBI (Prohibition of Insider Trading) Regulations, 2015, the trading window for dealing in securities of the Company will remain closed from February 3, 2018 to February 14, 2018 (both days inclusive) for the directors / officers / designated employees of the Company.

Further we inform, that option is available to the Board members to participate in the meeting, through electronic mode. To avail the said facility, we request to intimate Ms. Nisha Jain, Company Secretary on email id eolcs0405@gmail.com, at least two working days prior to the scheduled Board meeting.

This intimation is also available at Company's website www.everestorganicsltd.com and BSE website www.bseindia.com

For Everest Organics Limited
Sd/-
Nisha Jain
Company Secretary & Compliance Officer

Dated : 03.02.2018
Place : Hyderabad

NCC
NCC LIMITED
(CIN: L72200TG1990PLC011146)
Regd Off: NCC House, Madhapur, Hyderabad – 500 081.

ప్రకటన

SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 లోని రెగ్యులేషన్ 47తో చదువబడు రెగ్యులేషన్ 29ను పరిశీలిస్తూ కంపెనీ యొక్క బోర్డు డైరెక్టర్ల సమావేశమును 14 ఫిబ్రవరి, 2018న కంపెనీ యొక్క నమోదిత కార్యాలయమైన NCC హౌస్, మాదాపూర్, హైదరాబాద్-500 081 వద్ద నిర్వహించి 31 డిసెంబర్, 2017 నాటి త్రైమాసికపు మరియు తొమ్మిది నెలల ముగింపు అయిన కంపెనీ యొక్క ఆడిట్‌కాని (స్టాండ్ఎలోన్) వ్యాపార సంబంధింత ఆర్థిక ఫలితాలను పరిశీలించి మరియు ఆమోదించెదరు.

సదరు నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా http://ncclimited.com మరియు స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లు: http://www.bseindia.com మరియు http://nseindia.com వద్ద కూడా లభించును.

NCC లిమిటెడ్ కొరకు
యం వి శ్రీనివాస మూర్తి
కంపెనీ సెక్రెటరీ & ఇ వి పి (లీగల్)

తేది: హైదరాబాద్
తేది: 03-02-2018

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్
హైదరాబాద్-ఆర్ఆర్ఎల్ క్లస్టర్-హైదరాబాద్ : 103, 8-2-248-ఎ, మహర్షి హౌస్, రోడ్ నెం.3, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.

రూల్ 8(1) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 3 తో చదువబడు సెక్షన్-13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు తేది : 05.08.2017 నాటి దినపత్రికల ప్రచురణలతోపాటు జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం ఋణగ్రహీతలను నోటీసులో తెలిపిన మొత్తములను నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా కోరడమైనది.

ఋణగ్రహీత సదరు మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడు సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు క్రింద తెలిపిన క్ర.సం.1 ఆస్తిని తేది : 01.02.2018న మరియు క్ర.సం.2 ఆస్తిని తేది : 02.02.2018న ఈ క్రింది సంతకందారు స్వాధీనము చేసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ వారికి చెందవలసిన బకాయి మొత్తమును మరియు వడ్డీ, ప్రచురణ ఛార్జీలు మరియు ఇతర చట్టబద్ధ వ్యయములు మరియు అనుషంగిక ఖర్చుల క్రింద వర్తించును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను వినియోగించుకొనుచు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు ఇదియే సరియైన సమయమని భావించమని ఋణగ్రహీతల అప్రమత్తతను ఆహ్వానిస్తున్నాము.

1	ఋణగ్రహీత పేరు & ఖాతా : మెస్సర్స్ [illegible], ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీ [illegible] శ్రీహరి డిమాండ్ నోటీసు తేది : 28.02.2017 బకాయి మొత్తము : రూ.12,90,546.40 మరియు తేది : 28.02.2017 నుండి వడ్డీ, ప్రచురణ ఛార్జీలు మరియు ఇతర చట్టబద్ధ వ్యయములు మరియు అనుషంగిక ఖర్చులు స్థిరాస్తి వివరణ : రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం & మున్సిపాలిటీ మియాపూర్ గ్రామంలోని సర్వే నెం.41లో 100 చ.గ.ల విస్తీర్ణం కలిగిన ప్లాట్ నెం.59/బి యొక్క ఆస్తి. శ్రీ [illegible] శ్రీహరి పేరున కలిగియున్నది. సరిహద్దులు : ఉత్తరం : 20' అ.వె. రోడ్, దక్షిణం : ప్లాట్ నెం.54, తూర్పు : ప్లాట్ నెం.58, పడమర : శ్రీమతి [illegible] ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్ నెం.59/ఎ.
2	ఋణగ్రహీత పేరు & ఖాతా : మెస్సర్స్ ఆర్ఆర్ [illegible] ఫార్మా ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీ [illegible] వెంకటేశ్వర రావు డిమాండ్ నోటీసు తేది : 19.07.2017 బకాయి మొత్తము : రూ.52,63,047.00 మరియు తేది : 01.03.2017 నుండి వడ్డీ, ప్రచురణ ఛార్జీలు మరియు ఇతర చట్టబద్ధ వ్యయములు మరియు అనుషంగిక ఖర్చులు స్థిరాస్తి వివరణ :1) హైదరాబాద్ - 500040, మౌలాలి, ఎంజె కాలనీ, స్ట్రీట్ నెం.4 [illegible] మున్సిపల్ ఇం.నెం.42-598/1&2లో 1150 చ.అ.ల కట్టబడిన ప్రదేశంతో నిర్మించిన యూనివర్సల్ గార్డెన్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.405 యొక్క ఆస్తి శ్రీమతి [illegible] పేరున కలిగియున్నది. సరిహద్దులు : తూర్పు : కారిడార్, పడమర : ఖాళీ ప్రదేశం, దక్షిణం : ఖాళీ ప్రదేశం, ఉత్తరం : ఖాళీ ప్రదేశం. 2) రంగారెడ్డి జిల్లా ఉప్పల్, నాచారం భవానీనగర్ వద్ద ప్లాట్ నెం.7 & 8లో 16 చ.గ.ల అవిభాజ్య భూమి గల వాటాతో 600 చ.అ.ల ప్రదేశంతో సాయిదర్శన్ అపార్ట్‌మెంట్‌లోని బి-బ్లాక్, 3వ అంతస్తు, రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.303 యొక్క ఆస్తి శ్రీ బి. అశోక్ పేరున కలిగియున్నది. సరిహద్దులు : తూర్పు : ఫ్లాట్ నెం.304 మరియు లాబీ, పడమర : ఖాళీ ప్రదేశం, దక్షిణం : ఫ్లాట్ నెం.302, ఉత్తరం : రోడ్‌పైపు.

తేది : 03.02.2018
ప్రదేశం : హైదరాబాద్
సం/- అధీకృత అధికారి
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్

పర్యాటక క్షేత్రాలుగా ప్రాజెక్టు సైట్లు

- కాళేశ్వరం పనుల వీక్షణకు ప్రముఖుల ఆసక్తి

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త పర్యాటక క్షేత్రం ఆవిర్భవించింది. డిల్లీ నుంచి గల్లీ దాకా రాష్ట్రానికి వచ్చే అధికార, అనధికార ప్రముఖులంతా అక్కడికి వెళ్లడానికి ఉబలాటపడుతున్నారు. అత్యాధునిక 'సాగు' దేవాలయమది. దాని పేరు కాళేశ్వరం ప్రాజెక్టు. మేడిగడ్డ మొదలు మిడ్ మానేరు వరకు జరుగుతున్న కాళేశ్వరం పనులు చూడడానికి వివిఐపి, విఐపిలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా పర్యాటక క్షేత్రంగా మారింది. రాష్ట్రం సచివాలయంలో పని చేసే అధికారులు మొదలుకొని, కేంద్రంలో కీలక మంత్రిత్వ శాఖల అధికారుల వరకు వరుసగా మేడిగడ్డకు క్యూ కట్టారు. ఆ తర్వాత ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా ప్యాకేజీ 6, ప్యాకేజీ 8లలో నిర్మిస్తున్న భూగర్భ పంపు హౌస్‌లను సందర్శిస్తున్నారు. 'బాహుబలి' పంపు సెట్లుగా పిలుచుకునే ఇవి అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ పంపుహౌస్‌లు ఇంజినీరింగ్ నైపుణ్యానికి కలికితురాళ్లుగా మారాయన్న అభిప్రాయాలను సుప్రసిద్ధ ఇంజినీర్లే వ్యక్తం చేస్తున్నారు. 16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, మరో 16 లక్షల ఎకరాల స్థిరీకరణతో ఏకంగా 32 లక్షల ఎకరాలకు మేలు చేసే బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 80 వేల కోట్లకు పైగా అంచనా వ్యయంతో ప్రభుత్వం చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడంలో కేంద్ర జలసంఘం అధికారులు తొలుత కొర్రీలేసినా, దాని విశిష్టతను తెలుసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను వేగంగా పూర్తిచేసి రైతులకు తొందరగా నీరు ఇవ్వాలని వ్యాఖ్యానించి ప్రభుత్వ కృషికి మద్దతు పలికారు. గవర్నర్ నరసింహన్ సైతం పర్యటించి, ముఖ్యమంత్రి ఇంటిపేరు, మంత్రి హరీశ్‌రావు పేరును మార్చేశారు. రాష్ట్రంలోని ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులంతా కలిసి రెండు, మూడు బృందాలుగా వెళ్ళి పనులు చూసి వచ్చారు. ఇరిగేషన్ శాఖలోనే కీలకంగా పనిచేస్తూ ఇతర ప్రాజెక్టుల్లో నిమగ్నమైన వాళ్లు ప్రత్యేకంగా వెళ్లి, పనుల తీరు చూసి అబ్బురపోయారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ఆధునిక దేవాలయాల నిర్మాణంలో పాల్గొనలేదు, చూడలేదు. కానీ భగీరథుడు దివి నుంచి భువికి నీటిని ఎట్లా తెచ్చాడో తెలీకపోయినా, కాళేశ్వరం నీటిని హైదరాబాద్ వరకు ఎలా తీసుకువస్తారో తెలుసుకునే అవకాశాన్ని వదలుకోవద్దని ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. నదినే రివర్స్‌లో మళ్లించేట్లుగా బ్యారేజీలపై రివర్స్ పంపింగ్, సాహస యాత్ర చేస్తున్నామా అని తలపించే భూగర్భ టన్నెళ్లు, లోలోతుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా జరుగుతున్న పనులన్నీ అడ్వెంచర్ టూర్‌ని తలపిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పర్యాటక క్షేత్రంగా మార్చాయి.

రైల్వేశాఖ మొదటిసారిగా కాంట్రాక్టు కూలీల వివరాల సేకరణ


- మొదటిసారిగా డిజిటల్ కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ డేటాబేస్

న్యూఢిల్లీ: కార్మిక హక్కుల ఉల్లంఘన జరగకుండా చూసేందుకు హౌస్ కీపింగ్, శుభ్రత, కన్సల్టెన్సీ, శిక్షణ వంటి సేవలందించే కూలీల వివరాల (డేటాబేస్)ను రైల్వేశాఖ మొదటిసారిగా సేకరించనుంది. సేవలకు సంబంధించి జనరల్ కండీషన్ కాంట్రాక్టు (జిసిసి) కింద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ కొత్తగా రూపొందించిన నిబంధనలను రైల్వే బోర్డు, ఆమోదించింది. కాంట్రాక్టు పనుల్లో వంతెనల నిర్మాణం, భవనాలు, గేజ్ మార్పిడి ప్రాజెక్టుల కార్మికులు వర్తించే నిబంధనల నుంచి ఇతర సేవా రంగాలలో పనిచేసే కూలీలకు వర్తించే నిబంధనలను వేరు పరిచారు. రైల్వేలలో సేవలందించే వారికి మొదటిసారిగా డిజిటల్ కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ డేటా బేస్‌ను రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా కార్మికుల వ్యక్తిగత వివరాలు, పోలీసుల తనిఖీ, మెడికల్ ఇన్సూరెన్సూ, ప్రావిడెంట్ ఫండ్ రిజిస్ట్రేషన్ వంటి ధ్రువ పత్రాలను ప్రభుత్వం జారీ చేయనుంది. కార్మికుల హాజరు, భద్రత, వేతన వివరాలు సేకరించనుంది. కాంట్రాక్టర్లు తమ దగ్గర పని చేసే కార్మికుల వివరాలను వెల్లడించి, పారదర్శకంగా ఉండే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విలేకరుల సమావేశంలో పేర్కొన్న విషయం తెలిసిందే.

నేడు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై సమీక్ష

- బిల్డర్లతో చర్చించనున్న మంత్రులు

మన తెలంగాణ/హైదరాబాద్: డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి వినియోగిస్తున్న ఇనుము ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని బిల్డర్లు చేసిన విజ్ఞప్తి మేరకు మంత్రులు కెటిఆర్, ఇంద్రకరణ్‌రెడ్డిలు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. బిల్డర్లతో పాటు వివిధ స్టీల్ కంపెనీల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను, సిమెంటును ప్రభుత్వమే సమకూరుస్తున్నా ఇనుమును మాత్రం టన్నుకు రూ. 30వేల చొప్పున సమకూర్చుకోవాల్సిందిగా ప్రభుత్వం బిల్డర్లకే అప్పజెప్పింది. అయితే ఇటీవలి కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇనుము ధరలు పెరగడంతో డబుల్ బెడ్‌రూమ్‌లకు అవసరమైన మోతాదును కొనడం ఆర్థికంగా భారంగా మారిందని, ప్రభుత్వం అదనపు ధర కల్పించడం లేదా ఇనుమును సమకూరిస్తే తప్ప నిర్మాణం చేపట్టలేమని బిల్డర్లు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.6 లక్షల ఇళ్ళను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే రెండు లక్షల ఇళ్లకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరయ్యాయి. లక్ష ఇళ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. అయితే వివిధ కారణాలతో కొన్ని వేల ఇళ్ళ నిర్మాణం కూడా పూర్తికాలేదు. ఇదే సమయంలో ఇనుము ధరలు కూడా టన్నుకు ఇరవై వేల రూపాయల చొప్పున పెరిగి రూ. 50వేలకు చేరుకోవడంతో బిల్డర్లకు ఆర్థిక భారం ఏర్పడింది. ప్రభుత్వం చేసిన ఒప్పందం ప్రకారం పెరిగిన ధరను ప్రభుత్వం చెల్లించాలని బిల్డర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సుగుణాకర రావు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదని, తప్పుకుంటామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రులు చొరవ తీసుకుని ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు బిల్డర్లతో పాటు ఇనుము తయారీ సంస్థల ప్రతినిధులను కూడా సమావేశానికి ఆహ్వానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద తక్కువ ధరకు ఇనుమును సరఫరా చేసేలా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సంవత్సరం చివరి వరకు లక్ష ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఎట్టి పరిస్థితిల్లోనూ ఇనుము సమస్యకు ఈ సమావేశంలో పరిష్కారం లభించనుంది.



ఆంధ్రదేశంలో పేరంటాళ్లు చారిత్రక అధ్యయన గ్రంథ ఆవిష్కరణ ఆదివారం జరిగింది. తెలుగువిశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ, చరిత్ర విభాగం డీన్ , బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.చిన్నారెడ్డి, రచయిత డాక్టర్ కోనేరు లక్ష్మి ప్రమీల ఆవిష్కరించారు.

\- మన తెలంగాణ/హైదరాబాద్

'డబుల్'పై శ్వేతపత్రం విడుదల చేయాలి : దత్తాత్రేయ

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేస్తోందని బిజెపి ఎంపి బండారు దత్తాత్రేయ విమర్శించారు. గృహనిర్మాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తున్నప్పటికీ డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, జిహెచ్‌ఎంసిలో లక్ష గృహాలను నిర్మిస్తామన్న మంత్రి కెటిఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నేతలు సాంబమూర్తి, ప్రకాశ్‌రెడ్డి, సుధకర్‌శర్మతో కలిసి దత్తాత్రేయ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, కేంద్ర పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రం లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. బడ్జెట్‌పై ముఖ్యమంత్రి కెసిఆర్, టిఆర్ఎస్ ఎంపిలు వేర్వేరుగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరిగిందనడంలో వాస్తవం లేదని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడే ఉన్నదన్నారు. ప్రధానప్రతిపక్ష పాత్ర పోషించాలనే ఉద్దేశంతోనే టిడిపి, టిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నట్టుగా కనిపించిందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి రావాల్సిన పన్నులలో తెలంగాణ రాష్ట్రానికి 2017–18లో రూ. 16,420కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా రూ. 19,207కోట్లు, ఎన్‌టిపిసి ప్రాజెక్ట్ నిమిత్తం మొత్తంగా రూ.3877కోట్లు కేటాయించిందని, దక్షిణ మధ్య రైల్వేకు గత బడ్జెట్‌లో రూ. 17వందల కోట్లు కేటాయిస్తు, ప్రస్తుతం రూ. 1850 కోట్లను కేటాయించిందని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిపథకం, కార్యక్రమాల్లో ఆయా రాష్ట్రాల వాటా కూడా ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.24.47 కోట్లను ప్రవేశపెడితే, ఇందులో పూర్తిగా రూ. 25.వేల కోట్ల వరకు ఖర్చు చేసిందని, తమది ప్రజల బడ్జెట్ అని అన్నారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌ను గొరంతను కొండంత చేసి చూపాయని, కేటాయింపులు, ఖర్చులకు వ్యత్యాసం ఉన్నదని తెలిపారు. తమ రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని భావిస్తే, ప్రధానిని కలిసి చర్చించాలని సూచించారు.

పాక్ కాల్పుల్లో ఆఫీసర్ సహా నలుగురు జవాన్లు మృతి

జమ్మూ: జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వద్ద పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో ఆఫీసర్ సహా నలుగురు జవాన్లు అమరులయ్యారు. ఇద్దరు టీనేజర్లు సహా నలుగురు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం పూంచ్, రాజౌరి జిల్లా భింబర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి సైనిక స్థావరాలు, గ్రామాలపై పాక్ ఆటోమేటిక్ ఆయుధాలు, మోర్టార్లతో విచక్షణా రహితంగా కాల్పులకు పాల్పడినట్లు సీనియర్ సైన్యాధికారి తెలిపారు. ఈ కాల్పుల్లో గాయపడిన ఆర్మీ ఆఫీసర్ మృతి చెందారని తెలిపారు. పాక్ కాల్పులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయని ఆయన తెలిపారు. ఉదయం పూంచ్ జిల్లా షాహాపూర్ సెక్టార్‌లో పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు టీనేజర్లు గాయ పడ్డారన్నారు. మధ్యాహ్నం మంజాకోట్ సెక్టార్‌లోని నీకా పంజాగ్రెయిన్, తార్కుండి గ్రామాల సమీపంలో పాక్ ఆరు మోర్టార్లను పేల్చింది. ఇరు దేశాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని సైనిక అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖకు ఐదు కిలో మీటర్ల పరిధిలోని పాఠశాలలకు ప్రభుత్వం మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించింది.

జెఎసి శ్రేణుల్లో ఫుల్ జోష్

మన తెలంగాణ/హైదరాబాద్: నిరుద్యోగ, రైతు, భూనిర్వాసితుల సమస్యలపై నిత్యం పోరుబాట పట్టిన తెలంగాణ జెఎసి త్వరలోనే రాజకీయ పార్టీకి పురుడుపోయనుంది. పార్టీ ఏర్పాటుపై ఇంత కాలం వచ్చిన అనుమానాలకు ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ విస్తృత స్థాయి సమావేశంలో సమాధానం చెప్పారు. పార్టీ విధి విధానాలు, జెండా, ఎజెండా అంశాలపై జెఎసిలో కొంత చర్చ జరిగినప్పటికీ ముఖ్యనేతలు మరోసారి చర్చించిన తర్వాత తుది నిర్ణయం జరగనుంది. రాజకీయ పార్టీ పేరు, నిర్మాణంపై రెండు, మూడ్రోజుల్లో ముఖ్యనేతలతో కోదండరామ్ సమావేశం కానున్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి ఢిల్లీకి వెళ్ళనున్నారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, ఉద్యమ ఆకాంక్షల అమలు అంశాలు రాజకీయ పార్టీలో ప్రధాన ఏజెండా కానున్నాయి. రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను సత్వరం ముగించి రైతులు, నిరుద్యోగుల సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమించాలని జెఎసి నిర్ణయించింది. ఇదిలాఉంటే రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తు న్నట్లు కోదండరామ్ ప్రకటించడం జెఎసి శ్రేణుల్లో జోష్ నింపింది. పార్టీ పెడుతున్నట్లు ప్రకటన వెలువడగానే జెఎసి శ్రేణులు బాణాసంచా కాల్చారు. రాజకీయ ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయని భావించి హైదరాబాద్ శివారులో ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో జెఎసి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాజకీయ పార్టీ పెడుతున్నందుకు దారి తీసిన అంశాలను, ప్రస్తుత టిఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలను వివరించారు.



రైల్వేలో 26,502 పోస్టుల భర్తీకి ప్రకటన జారీ

మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగ ప్రకటనల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు నెరవేరనున్నాయి. రైల్వేశాఖ భారీగా అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఈ పోస్టులకు ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు జరగనున్నాయి. యువత పట్టుబడితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అందుకోవచ్చు. కేంద్రప్రభుత్వం విడుదల చేసే ప్రకటనల కోసం యువత ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న 21 రైల్వే రీజియన్లలో ఖాళీగా ఉన్న మొత్తం 26,502 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. వీటిలో అసిస్టెంట్ లోకోపైలెట్ల పోస్టులు 17,673, టెక్నీషియన్లు 8,829 ఉన్నాయి. అత్యధికంగా అలహాబాద్ రీజియన్‌లో 4,694, సికింద్రాబాద్ రీజియన్‌లో 3,262 పోస్టులు ఉన్నాయి. మార్చి 5లోగా అభ్యర్థులు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలి. అసిస్టెంట్ లోకోపైలెట్ల పోస్టులకు పదోతరగతి పూర్తిచేశాక ఐటీఐ, డిప్లొమో, ఇంజినీరింగ్‌లో సంబంధించి ట్రేడ్లలో కోర్సులు పూర్తిచేసి ఉండాలి. టెక్నీషియన్ల విభాగంలో కొన్ని పోస్టులకు ఎస్‌ఎస్‌సితో పాటు సంబంధిత ట్రేడ్లలో ఐటీఐ, మరి కొన్ని పోస్టులకు పది తరువాత ఇంటర్‌లో గణిత, భౌతికశాస్త్రం సబ్జెక్టులు చదివి ఉండాలి. బీ అభ్యర్థులకు వయసు 18 నుంచి 28 ఏళ్ల లోపు ఉండాలి. బిసిలకు మూడు, ఎస్‌సి, ఎస్‌టిలకు ఐదేళ్లు మినహాయింపు.



మఖ్దూం మొహియుద్దీన్‌కు సురవరం, చాడ నివాళి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తిన యోధుడు మఖ్దూం మొహియుద్దీన్ అని, ఆయన జీవితాన్ని నేటి యువ కమ్యూనిస్టులు స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మిక నాయకుడు, ప్రముఖ ఉర్దూ కవి మఖ్దూం మొహియుద్దీన్ 110వ జయంతి సందర్భంగా సిపిఐ హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి ఇటి. నరసింహ అధ్యక్షతన ట్యాంక్‌బండ్‌పై జరిగిన కార్యక్రమంలో సురవరం సుధాకర రెడ్డి , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట రెడ్డి ప్రభృతులు మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ పేద, సామాన్య కుటుంబంలో పుట్టిన మఖ్దూం మొహియుద్దీన్ హైదరాబాద్ సంస్థానంలో నిజాం నియంతృత్వ పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయడానికి అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఒక ఎంఎల్‌ఏగా, ఎంఎల్‌సిగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. సమసమాజ స్థాపన కోసం క్రియాశీల రాజకీయాల్లో పాల్గొన్న మహోన్నత వ్యక్తి మఖ్దూం మొహియుద్దీన్ అని కొనియాడారు. చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ మొహియోద్దీన్ సిపిఐ నాయకుడిగానే కాకుండా కవిగా, నాటక రచయితగాను పేరు సంపాయించుకున్నారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిఎస్. బోస్, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశం, ఎం.నర్సింహా రాష్ట్ర ప్రజా నాణ్యమండలి నాయకులు పల్లె నర్సింహా పాల్గొన్నారు.

11 జిల్లాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో 11 జిల్లాల్లోని 20 గ్రామ పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు వెంటనే అధికారులను నియమించాలని, అయితే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కన్నా తక్కువ స్థాయి అధికారిని నియమించవద్దని సూచించింది. ఉప సర్పంచులు ఖాళీగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక(పిఎన్), చంద్రుగూడెం, గుండెపూడి గ్రామ పంచాయతీలకు, జనగాం జిల్లాలోని గుమ్మడవెల్లి, కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్, మహబూబాబాద్ జిల్లాలోని తీగలవేణి, మహబూబ్‌నగర్ జిల్లాలోని వేపూర్, గౌతపూర్, బూర్గుపల్లి, మెదక్ జిల్లాలోని ముస్లాపూర్, అసులపల్లి, నాగర్ కర్నూల్ జిల్లాలోని సిద్ధాపూర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రామచంద్రాపూర్, రంగారెడ్డి జిల్లాలోని నక్కలపల్లి, పాల్మకల్, పెద్దషాపూర్, సంగారెడ్డి జిల్లాలోని క్యాసారం, సిద్దాపూర్, సిహెచ్.గోపులారం, యాదగిరిబోనగిర్ జిల్లాలోని గూడూర్ గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

8న విద్యుత్ నియంత్రణ కమిషన్ బహిరంగ విచారణ

మన తెలంగాణ/హైదరాబాద్: 2018–19 ఆర్థిక సంవత్సరం విద్యుత్ వార్షిక వ్యయంపై ఫిబ్రవరి 8వ తేదీన కామారెడ్డిలో విద్యుత్ నియంత్రణ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించనుంది. టిఎస్ ఎన్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో జరిగే ఈ విచారణ కామారెడ్డి జిల్లా, దేవన్‌పల్లిలోని లక్ష్మీ దేవి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. టిఎస్ ఎన్‌పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ విచారణలో పాల్గొనాలని సిఎండి గోపాల్‌రావు ఒక ప్రకటనలో కోరారు. 12వ తేదీన హైదరాబాద్‌లోని ఫ్యాప్సీ భవన్ లో ఎస్‌పిడిసిఎల్ పరిధిలో బహిరంగ విచారణ జరుగుతుంది.

ఇంటర్ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

- జిజెఎల్‌ఎ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ ఇంటర్ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జిజెఎల్‌ఎ)రాష్ట్ర అధ్యక్షులు పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నా ఇంటర్ విద్య బలోపేతమవుతోందని అన్నారు. రాష్ట్ర ఆర్‌జెడి కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేశోద్ధారక భవన్‌లో జరిగిన 'ప్రగతి పథంలో ఇంటర్ విద్య సదస్సు'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బతికించడంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు కీలకపాత్ర పోషించారన్నారు. ఉచిత ఇంటర్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు లెక్చరర్లు చేసిన కృషి వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు 97 వేలకు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారమే ఆర్‌జెడి కాంట్రాక్ట్ లెక్చరర్లు నియమితులయ్యారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా కాంట్రాక్ట్ లెక్చరర్లను తొలగించి రెగ్యులర్ లెక్చరర్లను భర్తీ చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ. 62వేల వేతనం రాబోతుందని చెప్పారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల తర్వాత నెలనెలా రెగ్యులర్‌గా వేతనాలు వస్తాయని తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12నెలల వేతనం, డిఎ, సిఎల్, ప్రసూతి సెలవుల సౌకర్యం వంటి డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, భవిష్యత్తులో అవి నెరవేరుతాయన్నారు. సంఘం అధ్యక్షులు గాదె వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అయిలయ్య, సురేశ్, రాజశేఖర్, కడారి శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం క్యాలెండర్‌ను పి.మధుసూదన్‌రెడ్డి తదితరులు కలిసి ఆవిష్కరించారు.

ఏడాదికి 6000



- పెరుగుతున్న క్యాన్సర్ కేసులు
- బాధితుల్లో మహిళలే అధికం

మన తెలంగాణ/హైదరాబాద్:

క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో తగిన అవగాహన లేకపోవడంతో ఏటేటా బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రాథమిక స్థాయిలోనే దీనిని గుర్తించడంపై తగిన అవగాహన లేకపోవడంతో వ్యాధి తారాస్థాయికి చేరుకున్న తర్వాత వెలుగులోకి వస్తోంది. అవగాహన కల్పించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో ఆ మేరకు చైతన్యాన్ని తీసుకురాలేకపోతున్నాయి. భారత్‌తో సహా ఆగ్నేయాసియా దేశాల్లో ఏడాదికి సగటున 14 లక్షల మంది ఈ వ్యాధితో మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రతీ ఏడాది 6వేల కొత్త కేసులు నమోదవుతున్నట్లు తేలింది. బాధితుల్లో మహిళల సంఖ్య గణనీయంగా ఉంది. ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యానర్స్ కేసులే ఉన్నట్లు ఆరోగ్యశ్రీ విభాగం ద్వారా వెల్లడవుతోంది. బాల్య వివాహాలు, 35 ఏళ్ల పైబడిన వయసులో గర్భం దాల్చడం కూడా ఇందుకు కారణమని వైద్యులు నిర్ధారిస్తున్నారు. రాష్ట్రంలో 81,361 మంది గర్భాశయ క్యాన్సర్‌తో, 55,965 మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ గణాంకాల ద్వారా స్పష్టమైంది. అండాశయం, జీర్ణకోశం, ఎముకలు, కండరాలు, ఊపిరితిత్తులు తదిరత క్యాన్సర్ సోకిన మహిళల సంఖ్య 10వేలకు వరకు ఉంది. వ్యాధిపై అవగాహన లేక, తీవ్రస్థాయికి చేరుకున్న తర్వాత ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, అప్పటికే నివారణ దశ దాటిపోయినట్లుగా వైద్యులు పేర్కొంటున్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించకపోవడం తో తీరని నష్టం వాటిల్లుతుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రాజెక్టు పనుల నాణ్యతలో రాజీవొద్దు

- నిజాయతీగా పనిచేసే సిబ్బందికి ప్రోత్సాహం
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/హైదరాబాద్: నిబద్ధతతో నిజాయతీగా, ఎక్కువ సమయం పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. వీరికి తగిన గుర్తింపునివ్వాలని సూచించారు. ప్రాజెక్టు పనుల్లో వేగాన్ని పెంచడంతో పాటు నిర్మాణాల్లో నాణ్యతపై రాజీ పడొద్దని స్పష్టం చేశారు. జల సౌధలో క్వాలిటీ కంట్రోల్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో మంత్రి ఆదివారం మేధోమథనం జరిపారు. ఈ సందర్భంగా పలువురు ఇంజినీర్లు చేసిన సూచనలపై సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఇకపై క్వాలిటీ కంట్రోల్ విభాగం పర్యవేక్షణ బాధ్యతలు ఇఎన్‌సి (అడ్మిన్) నాగేందర్‌కు మంత్రి అప్పగించారు. దాదాపుగా రాష్ట్రంలో 40కి పైగా భారీ, మధ్యతరహా పథకాలు నిర్మాణంలో ఉన్నాయని, రాబోయే ఏడాది కాలం క్వాలిటీ కంట్రోల్ విభాగానికి అత్యంత కీలకమని అన్నారు. కాలంతో పోటీపడి మరీ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా చేస్తున్నామని, ఇదే సందర్భంలో నాణ్యతపై రాజీపడేది లేదని స్పష్టం చేశారు. సమైక్య పాలనలో శిథిలమైపోయిన సాగునీటి వ్యవస్థల ఆధునీకరణే లక్ష్యంగా చేస్తున్న భగీరథ యజ్ఞంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఇంజినీర్లు భాగస్వాములు కావడం గర్వంగా ఉందన్నారు. కాళేశ్వరం పనులను చూసి దేశమే అబ్బురపడుతోందని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. కాకతీయులు తవ్వించిన చెరువులు వందల ఏళ్లైనా ఇంకా సేవలు అందిస్తూ నాణ్యతకు మారుపేరుగా నిలిచాయని, రాష్ట్రంలోని ప్రాజెక్టుల నాణ్యతలో కాకతీయుల స్ఫూర్తితో క్వాలిటీ కంట్రోల్ విభాగం పనిచేయాలని ఆదేశించారు. బిల్లులు చెల్లించే ముందు క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు తప్పనిసరిగా సైట్లకు వెళ్లి పరీక్షించాలని, సంతృప్తి చెందాకే సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. వివిధ సందర్భాల్లో పత్రికల్లో, ఇతరత్రా ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఇఎన్‌సిలు మురళీధరరావు, నాగేందర్ రావు, సిఇలు సునీల్, హరిరాం, ఖగేందర్‌రావు, సురేశ్, శ్యాం సుందర్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ కాకతీయ – సుస్థిర గ్రామీణాభివృద్ధి' ఆవిష్కరణ



రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా సాగునీటి రంగంలో జరుగుతున్న కార్యక్రమాలు, విజయాలను అధ్యయనం చేయాలని రాష్ట్రంలోని యూనివర్శిటీల, సామాజిక శాస్త్రాల ప్రొఫెసర్లు, టీచర్లను పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి కోరారు. 'మిషన్ కాకతీయ – సుస్థిర గ్రామీణాభివృద్ధి' రచనల సంకలనాన్ని ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా జల సౌధలో ఆవిష్కరించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొ. టి.శ్రీనివాస్ సంపాదకత్వంలో ఈ రచనల సంకలనం రూపొందించారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ 'వ్యవస్థలు సక్రమంగా పనిచేయడంతో పాటు ఆ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాలి' అన్న అంబేద్కర్ మాటల్ని గుర్తు చేశారు. మిషన్ కాకతీయతో గ్రామీణ తెలంగాణలో సామాజిక, ఆర్థిక రంగాల్లో ఇప్పటికే అనూహ్యమైన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మూడు దశల మిషన్ కాకతీయ అనంతరం గ్రామీణ ప్రాంతాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వచ్చాయన్నారు. మిషన్ కాకతీయపై 2016 నవంబరులో కాకతీయ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం జాతీయ సదస్సు ఏర్పాటు చేసిందని, ఆ సెమినార్‌లో సమర్పించిన కొన్ని పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించడాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ఇఎన్‌సిలు మురళీధర్, నాగేందర్‌రావు, చిన్న నీటిపారుదల చీఫ్ ఇంజినీర్లు సురేశ్‌కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పిఎంకెస్‌వై ప్రాజెక్టులపై సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: పిఎంకెఎస్‌వై ప్రాజెక్టులపై భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 6వ తేదీన ఢిల్లీలో సమావేశం జరగనుంది. ఇప్పటివరకు విడుదల చేసిన నిధులు, విడుదల కాకుండా బకాయిగా ఉన్న మొత్తం తదితరాలపై రాష్ట్ర ప్రతినిధులు ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరించనున్నారు. దీంతో పాటు తాజా బడ్జెట్‌లో పిఎంకెఎస్‌వై నిధుల కేటాయింపు పెంచినందువల్ల పథకాల వారీగా రాష్ట్రానికి ఎంత మేర కేటాయిస్తారో ఆ సమావేశంలో కేంద్ర అధికారుల నుంచి వివరాలు తీసుకుని దానికి అనుగుణంగా రా ష్ట్ర ప్రభుత్వ అవసరాల గురించి వివరించనున్నారు. పిఎంకెఎస్‌వై పథ కానికి మొత్తం మీద కేంద్రం రూ.9,000 కోట్లు కేటాయించింది. ఇందులో హర్ కేత్‌కు పానీ, ఎఐబిపి, ఆర్‌ఆర్‌ఆర్, మైక్రో ఇరిగేషన్ తదితర విభాగాల కింద రాష్ట్రానికి వచ్చే వాటాపై అధికారులు చర్చించి, నిర్ణయం తీసుకుంటారు.

ఆన్‌లైన్‌లో టెట్?



మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి) సహా పలు ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించడంలోని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. తెలంగాణలో సైతం ఆన్‌లైన్‌లో నిర్వహించడమే మేలని ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ తొలిసారిగా గత విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డి.ఎడ్)లో ప్రవేశాల కోసం డిఇఇసెట్–2017ను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. 55 కేంద్రాల్లో సుమారు 40 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే టెట్‌కు సుమారు 1.5 లక్షల మంది హాజరు అవుతారు కాబట్టి అభ్యర్థులందరికీ ఒకేసారి పరీక్ష నిర్వహించడానికి కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు ఉన్న కళాశాలలపై దృష్టి పెట్టింది. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గతంలో నిర్వహించిన టెట్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే ఒక్కో పరీక్షా కేంద్రంలో ఒకసారి ఎంతమంది పరీక్షకు హాజరు కావచ్చు, కంప్యూటర్‌ల అందుబాటునుబట్టి సెషన్లుగా నిర్వహించడంలోని సాధకబాధకాల గురించి అధికారులు పరిశీలించనున్నారు.

త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఆన్‌లైన్ టెట్ నిర్వహణపై పాఠశాల శాఖ త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి) నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో టెట్ నిర్వహణ తేదీ, ఏ విధానంలో పరీక్ష నిర్వహించాలనే దానిపై స్పష్టత వస్తుంది.

బియ్యం అక్రమ వ్యాపారిపై పిడి యాక్టు



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజాపంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టించిన నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన రావిరాల రామలింగ(42)పై ఆదివారం జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ పిడి కేసు నమోదు చేశారు. మిర్యాలగూడ కేంద్రంగా కొన్నాళ్లుగా పిడిఎస్ బియ్యాన్ని సేకరించి రామలింగం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఆయనపై 2016, ఫిబ్రవరి 10న మొదటిసారి కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు అక్రమ రవాణాకు సంబంధించి ఆయనపై 6ఎ కేసులు 9, క్రిమినల్ కేసులు 6 నమోదయ్యాయి. అయినా రామలింగం రేషన్ బియ్యం అక్రమ రవాణాను కొనసాగిస్తూనే ఉన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాల ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగం రామలింగం కదలికలపై నిఘా పెట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనై పిడి కేసు నమోదు చేశారు.

త్వరలో మరికొంతమందిపై..

కొంతమంది వివిధ ప్రాంతాల నుంచి రేషన్ కార్డుదారులు, డీలర్లు, ఇతర వ్యాపారస్తుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కమిషనర్ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. దీనిపై సమాచారం అందడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలను అప్రమత్తం చేసి, ఈ బృందాలు రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల కదలికలపై నిఘా వేసి పట్టుకున్నామన్నారు. వీరిపై 6ఎ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గతేడాదిలో ముగ్గురి పై పిడి కేసులు నమోదు చేసి జైలుకు తరలించామని, తాజాగా మరో కేసు నమోదైంది అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై నిఘా పెట్టాం. మరికొంత మందిపై కూడా పిడియాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కీలక సూత్రదారులను అరెస్ట్ చేస్తామన్నారు.

శాఖాపరమైన కమిటీతోనే పశు వైద్యుల నియామకం

- పశువైద్య, పట్టభద్రుల సంఘం డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: ఆరోగ్యశాఖలో చేపడుతున్న విధంగానే పశువైద్య పోస్టుల భర్తీని కూడా శాఖాపరమైన కమిటీ ద్వారానే చేపట్టాలని తెలంగాణ పశువైద్య పట్టభద్రుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సఘం రాష్ట్ర అధ్యక్షులు కాటం శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో 1,463 మంది వైద్యుల నియామకాలను డిపార్టుమెంటల్ సెలక్షన్ కమిటీ ద్వారా చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని తమ సంఘం స్వాగతిస్తోందని, ఇదే విధానాన్ని పశుసంవర్ధక శాఖలోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐదున్నర సంవత్సరాలుగా ఉండే ఈ కోర్సులో 400కు పైగా రాత పరీక్షలు, ప్రాక్టికల్స్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్ల చేత 'వైవా'ను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిద్వారా దేశంలో ఎక్కడైనా పశువైద్య ఆసుపత్రిలో చికిత్స చేయడానికి అర్హత ఉంటుందన్నారు. ఇలాంటి వృత్తి విద్యా కోర్సు చదివిన వారికి టిఎస్‌పిఎస్‌సి ద్వారా రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాత పరీక్ష ద్వారానే పశువైద్యుడికి ఉద్యోగమనిస్తామనే విధానం వల్ల పశు వైద్య యూనివర్శిటీ విద్యా ప్రమాణాలు పడిపోయే ప్రమాదముందన్నారు. ఈ విధానం వల్ల పశువైద్య డిగ్రీ చదివే విద్యార్థులు కోర్సు పట్ల పెద్దగా ఆసక్తిని చూపడం లేదన్నారు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్‌లో నాణ్యమైన పశు వైద్యుల కొరత ఏర్పడే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం విజయవంతంగా సాగాలంటే రాష్ట్రంలో నాణ్యమైన పశు వైద్యుల అవసరాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో టిఎస్‌పిఎస్‌సి నిర్వహించిన రాత పరీక్ష ప్రశ్నపత్రంలో దొర్లిన తప్పులతో పాటు 'కీ' విషయంలో జరిగిన తీవ్ర జాప్యాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వెటర్నరీ పారా సిబ్బందికి సంబంధించి 541 పోస్టులకు గతేడాది జులై పరీక్ష నిర్వహించినా ఇప్పటికీ ఫలితాలు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో పశు వైద్యులు, కాంపౌండర్ల నియామకాలను టిఎస్‌పిఎస్‌సి ద్వారా మినహాయించాలన్నారు.

కృష్ణా, గోదావరి బోర్డులతో 15న ఢిల్లీలో సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖల అధికారులతో ఫిబ్రవరి 15న ఢిల్లీలో కేంద్రం సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శిగా యుపి సింగ్ నియామకం తర్వాత జరుగుతున్న తొలి సమావేశమిది. అంతకు ముందు కార్యదర్శిగా ఉన్న అమర్‌జిత్ సింగ్ నెల రోజుల క్రితం పదవీ విరమణ చేశారు. దీంతో జాతీయ స్థాయిలో స్థితిగతులు తెలుసుకునే క్రమంలో కొత్త కార్యదర్శి యుపి సింగ్ అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇదే వరుసలో ఫిబ్రవరి 15న కృష్ణా, గోదావరి బోర్డులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధికారులతో సమావేశం కానున్నారు. బోర్డులకు ఉన్న సమస్యలు, చర్చనీయాంశాలు ఉంటే సమాచారం ముందస్తుగా తెలపాలని కేంద్రం నుంచి ఇరు రాష్ట్రాలకు, బోర్డులకు లేఖ వచ్చింది. దీంతో చర్చనీయాంశాలు ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వర్కింగ్ మాన్యువల్, తెలంగాణ వాటా, ఇతరత్రా కీలక విషయాల్లో ఎటువంటి నిర్ణయాలు ఉండకపోవచ్చని, కేవలం చర్చకే పరిమితమయ్యే అవకాశం ఉందని ఇరు రాష్ట్రాల అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కలం

వెంపర్లాటలో కవులు



యస్.తిర్మల్
9441864514

మానవ శరీరంలో అవాంఛనీయంగా పెరిగే శరీర భాగాన్ని వైద్య పరిభాషలో కణితి అని పిలుస్తారు. అది క్రమంగా వ్రణంగా మారి 'క్యాన్సర్' లాంటి ప్రమాదకర రూపం తీసుకుని శరీరాన్ని వికృతంగా తయారు చేయడమే కాక ఒక్కోసారి ప్రాణాంతకమే అవుతుంది. సరిగ్గా అలాంటి భావపరమైన అవాంఛనీయ 'జబ్బు' ఒకటి తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని పట్టి పీడిస్తుంది. దాని పేరే కీర్తి 'కండూతి'. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కవితాక్షరాలకు పట్టిన కొత్త తెగులుగా ఇది ముందుకొచ్చింది. దీనిని ప్రస్తుతం శస్త్ర చికిత్స తప్ప మామూలు 'కాయకల్పచికిత్సలు' సరిపడవు అనే స్థితికి ఎదిగిపోయింది. తెలుగు భాషా అభివృద్ధిలో, విస్తృతిలో కవిత్వానికి విశిష్ట ప్రాధాన్యత ఉంది. పురాతన కాలం నుండి ఆధునిక కవుల వరకు తాము సృష్టించిన భావాల, పదాల అక్షర సంపద అద్భుతమైనది. అది తెలుగు భాషా, సాహిత్యాలను పరిపూర్ణం చేసింది. అందులో కవిత్వానిది సింహభాగం. ఆహారసేకరణ దశ. ఉత్పత్తి దశ, నిల్వ దశ వరకు శ్రమైక జీవన మానవ నాగరికతా పయనం లాగానే భాష, అక్షర చైతన్యం సైతం ఎదుగుతూ వచ్చింది. పురాతన సాహిత్య పదకోశాలు నుండి జనజీవన సామాన్యం నుండి పుట్టుకొచ్చిన అశేష పదసంపద సృష్టించిన జానపథ సాహిత్యం వరకు మన కవిత్వం భావావేశం ఎదిగిన క్రమం మనం చూస్తాం. అచ్చు యంత్రం కనుగొన్న తర్వాత విప్లవాత్మకమైన భావవ్యాప్తి ద్వారా ప్రపంచ సాహిత్యం, అక్షరం మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది.జ్ఞానం,'పుస్తకం' ద్వారా నిక్షిప్తం అయి విస్తృత రూపం తీసుకొంది. ప్రపంచ వ్యాప్తంగా, జాతీయంగా వచ్చిన ఉద్యమాల్లో అనేక సాహిత్య ప్రక్రియలు పురుడు పోసుకున్నాయి. అందులో భాగంగా కవిత్వం ఒక భావావేశ రూపంగా, నూతన పదసృష్టి ప్రబంధంగా, వినూత్న భావ విప్లవ రూప ప్రక్రియ గా ముందుకొచ్చింది. అది ప్రజా ఉద్యమాలు, అస్తిత్వ ఉద్యమాల ద్వారా దాని ఉనికి నిలుపుకుంటూ నేటి గ్లోబల్ యుగానికి ఓ విశిష్ట ప్రక్రియగా కవిత్వం ముందుకొచ్చింది. ఈ దశలో కాలం తెచ్చిన కొన్ని మార్పులు, అవి మోసుకొచ్చిన 'వైరస్' కవిత్వ ఉద్యమాలను చుట్టుముట్టి కొత్త జబ్బుల్ని సైతం కొనితెచ్చింది. భూస్వామ్య సమాజంలో భూస్వామ్య అనుకూల భావజాలం, పెట్టుబడిదారీ సమాజంలో అమ్మకపు సరుకు లాంటి ఓ రూపంలో, నేటి ప్రపంచీకరణ వేగవంతమౌతున్న దశలో కార్పొరేట్ శక్తులు, బహుళజాతి సంస్థల భాషా, కళాదప్పిక తీర్చే 'ఒయాసిస్సు'గా అక్షర ఉద్యమాలు మారిపోయాయి. పద్యరూపంలో మన తెలుగు సాహిత్యంలో కవిత్వం పుట్టినా పాశ్చాత్య సొబగులు నింపుకొని వచనకవిత్వం పురుడు పోసుకుంది.మహాకవి శ్రీశ్రీ అన్నట్లు ఛందోబందోబస్తులు తెంచేసుకొని వచన కవిత్వం భూమార్గం పట్టింది. ఆధునిక మానవుని చుట్టూ అల్లుకుపోయిన లతలా తెలుగు కవిత్వం పెనవేసుకు పోయింది. తెలుగునాట కవిత్వోద్యమాన్ని పరిశీలిస్తే ప్రజా ఉద్యమాల నుండి పుట్టిన అభ్యుదయ కవిత్వోద్యమం అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావం, అటు తరువాత సినిమా రంగం సృష్టించిన భాషావ్యాప్తి, 1960 దశకం తర్వాత తెలుగు సాహిత్యంలో వినిపించిన నిరసన కవిత్వం దిగంబరం, పైగంబరం, తిరగబడు కవులు ఇలా రాసుకుంటూ పోతే 'నక్సల్బరీ'ఉద్యమం తర్వాత విప్లవోద్యమ సుస్వరంగా విప్లవ రచయితల సంఘం దాని నుండి శాఖోప శాఖలుగా పలు ప్రజారచయితల సంఘాలు బయటకొచ్చాయి. 1980వ దశకం తర్వాత స్త్రీవాద, దళిత ఉద్యమ అస్తిత్వస్వరాలు, 21వ శతాబ్దంలో ప్రాంతీయ అస్తిత్వ స్వరాలు కవిత్వరూపంలో బయటకొచ్చాయి. వీటి నుండి తెలుగు కవిత్వం తమ ఉనికిని నిలబెట్టుకుంది. అయితే ఇటీవలి కాలంలో కొందరు వ్యక్తుల అవసరాలైతేనేం, అస్తిత్వ ఉద్యమాల వెర్రి రూపాలైతేనేం కులసంఘాల పేరుతో కవిత్వ గుంపులు తయారవుతున్నాయి. తమకు తాము 'అస్తిత్వం' పేరుతో ముద్రలు వేసుకునే 'కుల' ప్రాతిపదికన గిరిగీసుకొని తెలుగు సాహిత్యంలో విభజన, విచ్ఛిన్నతకు బీజాలు వేస్తున్నారు . నేడు ప్రసార మాధ్యమాల వెర్రితలలు సైతం ఈ వేలంవెర్రిని ప్రోత్సహించేది గా ఉంది.ఇది ఒక విధమైన ప్రక్కదారి తెలుగు కవిత్వ ఉద్యమంలో కనిపిస్తుండగా నేటి 'గ్లోబలైజేషన్' మరికొన్ని అంటురోగాల్ని తెలుగు కవిత్వంలోకి ప్రవేశపెట్టింది. అదే 'కీర్తి కండూతి 'అనబడే కొత్త జబ్బు. తెలుగు కవిత్వంలో లబ్ధప్రతిష్ఠులైన కవులు శ్రీశ్రీ (మహాప్రస్థానం), సోమసుందర్ (వజ్రాయుధం), బాలగంగాధర్ తిలక్ (అమృతం కురిసిన రాత్రి), ఆరుద్ర (త్వమేవాహం),దాశరథి (రుద్రవీణ) ఇలా చెప్పుకుంటూపోతే వీరికి ఈ కీర్తి తెచ్చిన కవిత్వం వస్తువుగా ప్రజలకు సన్నిహితం గా కావడం ద్వారా 'రూపం'గా ప్రజలను ఆకట్టుకునేలా చెప్పడం ద్వారా ఉన్నత స్థితిని పొందగలిగారు. వీరెప్పుడూ అవార్డుల కోసం వెంపర్లాడలేదు. నిరంతరం కవిత్వం నే తపనగా జీవించారు. తెలుగు సాహిత్యంలో విమర్శలో పతాకస్థాయి నెదిగిన ముప్పాళ్ళ రంగనాయకమ్మ, చలం లాంటి వాళ్ళు ఏ అవార్డుల కోసం ప్రయత్నించలేదు. తమ కలాన్ని సమాజానికి అంకితం చేశారు. వారికి వచ్చిన లబ్ద ప్రతిష్టతలు

తెలుగు కవిత్వంలో లబ్ధప్రతిష్ఠులైన కవులు శ్రీశ్రీ (మహాప్రస్థానం), సోమసుందర్ (వజ్రాయుధం), బాలగంగాధర్ తిలక్ (అమృతం కురిసిన రాత్రి), ఆరుద్ర (త్వమేవాహం),దాశరథి (రుద్రవీణ) ఇలా చెప్పుకుంటూపోతే వీరికి ఈ కీర్తి తెచ్చిన కవిత్వం వస్తువుగా ప్రజలకు సన్నిహితం గా కావడం ద్వారా 'రూపం'గా ప్రజలను ఆకట్టుకునేలా చెప్పడం ద్వారా ఉన్నత స్థితిని పొందగలిగారు. వీరెప్పుడూ అవార్డుల కోసం వెంపర్లాడలేదు. నిరంతరం కవిత్వం నే తపనగా జీవించారు.

కేవలం రచనా శక్తి ఆధారంగా లభించిన గుర్తింపులే. కానీ నేటికీ తెలుగు కవిత్వంలో కొన్ని ప్లాస్టిక్ నవ్వుల్ని, అక్షరాల్ని అరువు తెచ్చుకుని వాటిని కాసుల చుట్టూ కమనీయ అక్షరాలుగా మలిచి అమ్ముకుంటున్న స్థితి, మునుపెన్నడూ లేనివిధంగా పాలకవర్గాల ప్రాపకంకై పాకులాడుతున్న దుస్థితి తెలుగు కవిత్వ ఉద్యమంలో కనిపిస్తుంది. ఈ భ్రమా పూరిత గ్లోబల్ సమాజం సృష్టించిన విషపు చక్రంలోనికి కవులు, కవిత్వోద్యమం లాగబడుతుంది. అందుకు ఒకానొక రూపంగా 'సన్మానాలు అవార్డులు' అనే రూపంలో అది వ్యక్తమవుతూ వచ్చింది. తమ భావ పొందిక కు కేంద్ర బిందువైన ప్రజలను వదిలి అది 'కీర్తి కండూతి' అనే కొత్త జబ్బుతో పతనం అంచుల్లోకి పరిగెడుతుంది. 1980 దశకంలో ప్రభుత్వం ఇచ్చే కేంద్ర సాహిత్య అకాడమీ , రాష్ట్ర సాహిత్య పరిషత్తు అవార్డులు, ప్రైవేట్ గా ఉత్తమ కవిత్వానికి అందజేసిన 'కుందుర్తి'లాంటి కవుల పేరిట ఇచ్చిన అవార్డులు ఉండేవి. అవి కొంత చెప్పుకోవడానికి కొన్ని ప్రామాణికాలు, ఎంపికకు ఒక ప్రాతిపదికను పాదుకొల్పాయి.కానీ నేడు ఆ ఒరవడికి తిలోదకాలిచ్చి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వందలాది అవార్డులు, రివార్డులు ,సన్మాన వేదికలు కవిత్వ రంగంలో రూపుదిద్దుకున్నాయి. కొందరు ప్రజలకు దూరమైన కవులు, కవిత్వ ఉద్యమాల్లో కలుపు మొక్కలు, అక్షరం ఉడిగిన మాజీలు, కొత్తగా పేరుకోసం సాహిత్య వ్యాపారంలో ప్రవేశించిన గ్లోబల్ వ్యాపారులు, విద్యా వ్యాపారులు ఈ జబ్బును విస్తృతం చేశారు. ఎలాంటి సాహిత్యం లేని వ్యక్తుల పేరుతో ,తల్లిదండ్రుల పేరుతో లేక తమ ఊర్ల పేరుతో అవార్డులు ప్రకటించి తామేదో వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు భ్రమింప చేస్తున్నారు. మరికొందరు సహస్ర కవి సమ్మేళనాలను, గిన్నిస్ బుక్ నమోదులని ఉన్మాదస్థితి కి కవిత్వ స్థాయిని దిగజార్చుతున్నారు. ఎక్కడ చూసిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 'సన్మానాలు అవార్డులు' పేరుతో కవిత్వ ప్రయాణం మార్గాన్ని అపసవ్యత వైపు మల్లిస్తున్నారు. రాబోయే తరం నేటి మీడియా కవిత్వ ఉద్యమం అంటే 'అవార్డులుసన్మానాలేమో!' అని భ్రమించేస్థితి కి ఈ ఉన్మాదం ముదిరింది. ఇప్పటికే తెలుగు సాహిత్యంలో కవిత్వం లో ప్రభుత్వ అవార్డుల ప్రమాణాలు దిగజారి పైరవీల స్థాయికి చేరిపోయింది. తమకు సన్నిహితమైన మార్గాల ద్వారా ప్రభుత్వాలను ప్రసన్నం చేసుకునే దుస్థితి, ఎంపిక సంఘాల్ని బుట్టలో వేసుకునే స్థాయికి తెలుగు సాహిత్యం దిగజారింది. ఇక ప్రైవేటు 'అవార్డు'ల పేరుతో మొదలైన జాతర తమ గుంపేదో తాము ముద్ర వేసుకొని తమ అవార్డు తమ గుంపు కిచ్చి 'గుర్తింపు',' రాణింపు 'క్రీడలకు కొత్త రాగాలు సమకూర్చుతున్నారు. ఎంపిక ప్రమాణాలు వ్యక్తిగత స్థాయికి దిగజార్చి 'అవార్డులు సన్మానాలు' ఓ సరిచేయలేని జబ్బుగా మార్చి వేశారు. ఈ వ్యక్తివాద ధోరణులు తెలుగు కవిత్వాలలో ప్రబలడం వలన సాహిత్య ప్రమాణాలు అడుగంటి పోతున్నాయి. ఫలితంగా నాసిరకం కవిత్వం ఉత్పత్తి అవుతుంది. ఎవరికివారు కవిసమ్మేళనాలు పెట్టుకొని దాన్నే చదువుకుని ఆనందిస్తున్నారు. వాటినే ఎవరికి వారు పుస్తకాలు అచ్చు వేసుకొని పంచుకుంటున్నారు. కొన్ని కుల ముఠాలు అస్తిత్వం పేరుతో పాలక వర్గాలకు ఉపయోగపడేలా ఆధునిక మనువాదులు గా మారి శ్రామిక వర్గాన్ని చైతన్యం చేయడానికి బదులు కులం పునాదుల్ని పటిష్టం చేసే పనిలో ఉన్నారు. మరి కొందరు తాము అచ్చు వేసుకున్న పుస్తకాన్ని తామే అమ్ముకునే స్టాల్స్ , మొబైలింగ్ వ్యాపారం పేరుతో యాగీ చేస్తున్నారు. నిజంగా ప్రజల వస్తువుగా, రూపంగా , సారంగా ప్రభావితం చేసే కవిత్వానికి ఇన్ని కుప్పిగంతులు అవసరం లేదు. పెడదారి పట్టినదేదైనా అంతిమంగా పాలకవర్గానికి సేవ చేసేదే. పైరవీలతో బ్రతుకు వెళ్లదీసేదే కానీ ప్రజలకు చేరువయ్యేది కాదు, ఉపయోగపడేది కాదు. దీనితో యువ కవులు తమ లక్ష్యాల్ని మరచి భాషా పటుత్వం పెంచుకోవడం, వస్తు శైలిని అభివృద్ధి చేసుకోవడానికి బదులు భ్రమల లోకంలో విహరిస్తూ అవార్డులు సన్మానాలు వైపు పరుగులు తీసే తప్పుడు వాతావరణం తెలుగునాట కనిపిస్తోంది. ఇది ఇలా కొనసాగితే తెలుగు కవిత్వ ద్వారంలో కుక్కమూతి పిందెలు మరిన్ని పూసి భ్రష్టత్వం దిశగా పయనించే ప్రమాదం ఉంది. ఇట్లాంటి వాతావరణం తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ప్రవేశించడానికి ప్రధాన కారణం ఒకటి ప్రజా ఉద్యమాల వైఫల్యం, ఉత్తమ సాహిత్యం వెనుకపట్టు కాగా కవిత్వం, సాహిత్య విమర్శలలో పదును కోల్పోవడం సైతం ఒక కారణంగా ఉంది. నేటి తెలుగు సాహిత్యంలో సాహిత్య విమర్శ 'గుంపుల'ముఠాల స్థాయికి దిగజారింది. ఒక ఏనుగు గుడ్డివాడు కథను గుర్తుకు తెచ్చేలా పాదాలు, తొండం,తోక, దంతాలు పట్టుకొని ఏనుగు స్వరూపం అలాగే ఉందని వర్ణించినట్లు , భావించినట్లు ఎవరి గుంపుకు అనువైన ప్రమాణాలు ఆ పీఠాధిపతులైన విమర్శకులు ప్రమాణాలు రూపొందించుకొని ఉన్న దిగజారిన సాహిత్య వాతావరణాన్ని సరి చేయడానికి బదులు మరింత దిగజార్చుతున్నారు.

తెలుగు సాహిత్యం, కవిత్వం లో నెలకొంటున్న పెడ ధోరణుల పట్ల భాషా, సాహిత్య అభిమానులు అప్రమత్తం కావలసి ఉన్నది. అవార్డులు సన్మానాలకు వెంపర్లాడే సరికొత్త జబ్బు నుండి యువ తరం రచయితలు కవులు సన్మార్గం వైపు నడిపించే కృషి ప్రస్తుతం అవసరం. ప్రపంచం గ్లోబలీకరణ దిశగా పరిణతి చెందిన దశలో అనేక మానవ వైవిధ్యాలు వైరుధ్యాలు చోటుచేసుకుంటున్నాయి. వీటి అద్భుత పరిణామాల గుట్టును ప్రజలకు విప్పిచెప్పే దిశగా కవిత్వం , సాహిత్యం ప్రయాణించాలి. మానవ మనుగడను ప్రమాదకరం వైపు నడిపిస్తున్న వైషమ్యాలు, పర్యావరణ సమస్యలు ,ముంపు సమస్యలు, బహుళజాతి సంస్థల దుర్మార్గాల నుండి ప్రజలకు ఉత్పన్నమవుతున్న సమస్యలు, ఆధునిక మీడియా , సమాజం మనిషికి విసురుతున్న సవాళ్లు సాహిత్యరంగంలో ప్రస్ఫుటం అవుతున్నాయి. మనిషి చుట్టూ పొంచి ఉన్న ప్రమాదం పట్ల అక్షరాలు అప్రమత్తం కావాలి. సమాజం విస్తృతం విశాలం అవుతున్నకొద్దీ సాహిత్య ప్రయోజనం ,కొలమానాలు అందుకనుగుణంగా సరైన దిశలో కర్తవ్యాలు నిర్వర్తించాలి. ప్రజాసమస్యలు , ప్రజలు చుట్టే అల్లుకున్న కవిత్వం , సాహిత్యం మాత్రమే రూపంలో , సారంలో సజీవ సాహిత్యంగా చరిత్రలో మనగలిగింది. నిజంగా కవులకు రచయితలకు గుర్తింపు ఇచ్చింది అదే! దుశ్శాలువల క్రింద దాగిన దుర్నీతి, అవార్డులు ఎప్పుడూ కవుల్నీ కవిత్వాన్నీ ఉన్నతంగా నిలపలేవు. కనీసం అవి ప్రోత్సాహకాలుగా కూడా ప్రస్తుతం లేవని ఘంటాపథంగా చెప్పవచ్చును. ఆ దిశగా భాషా, కవిత్వ , సాహిత్య ఉద్యమాలు నిలవాలని ,నడవాలని ఆశిద్దాం.

ఉప సంహరణ!

నేను నిష్క్రమించే సమయం సమీపించింది
దానికన్నా ముందు
నా ఆఖరి కోరికను మీకు విన్నవించాలి
దయగల సాహితీ ప్రేమికుడా
ఈ గ్రంథాన్ని దగ్ధం చెయ్యి
దీన్ని నేను ఎన్నో యుగాల పాటు
రక్తాక్షరాలను మేళవించి రాసి ఉండవచ్చు
అలా అని,
ఇందులో ఉన్నవన్నీ
నేను చెప్పాలనుకున్నవనుకోకు



నా నీడతో నేనే ఓడించ బడిన వాణ్ని
నాకన్నా విగత జీవి ఎవరూ ఉండరు కదా
నా పదాల ప్రతీకారానికి బలైన వాణ్ని
నాకన్నా దుఃఖితుడు మరెవరూ ఉండరు కదా

సహృదయ పాఠకుడా, నన్ను మన్నించు
నేనెప్పుడు ఒక వెచ్చని కౌగిలింతతో
నీకు వీడ్కోలు పలకక పోవచ్చు
కానీ,
ఒక ఉద్విగ్న విషాద హాసంతో మాత్రం
నిన్ను వదిలిపోగలను

బహుశా, నేనంతేనేమో
అయినా నా చివరి పలుకులు వినండి
నేను చెప్పిన మాటలన్నిటిని
ఇప్పుడు ఉపసంహరించుకుంటున్నాను
లోకంలోకెల్లా
అత్యంత చేదైన బాధను దిగమింగుకుంటూ
నేను చెప్పిన ప్రతీ మాటనీ
ఈ క్షణమే ఉపసంహరించుకుంటున్నాను !

నికనోర్ పారా
అనువాదం: మామిడి హరికృష్ణ 8008005231

మత్తు

బిరడా తీస్తే
పరిమళం గుప్పుమంటుంది
వొలికిపోతే
మెత్తగా సువాసన పారుతుంది
జారిపోయి పగిలిపోతే
గాలినిండా కమ్మదనం నిండుతుంది
అత్తరు సీసా ఎట్లా వున్నా
కవిత్వంలానే వుంటుంది



ఆశారాజు
9392302245


వైతాళికుడు వట్టికోట



కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

జాతిని జాగృత పరిచి నూతన సమాజ ఆవిర్భావానికి కారకులైన బుద్ధి జీవులను, సామాజిక కార్యకర్తలను 'వైతాళికులు' అని అంటారు. అటువంటి వైతాళికులలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒకరు. తెలంగాణ జాతిని జాగృత పరచడానికి ఒక చేతిలో గన్ను, మరో చేతిలో పెన్ను పట్టి మట్టి గడ్డపై పోరు విత్తనాలు చల్లి ఉద్యమ సుమాలను విరబూయించిన మహోన్నత వ్యక్తి వట్టికోట ఆళ్వారుస్వామి. నాటి తెలంగాణ సమాజం ఒక వైపు వలస వాదం కింద, మరో వైపు భూస్వామ్యం కింద నలిగింది. ఈ స్థితిలో తన సామాజిక బాధ్యత నెరవేర్చడమే గాక బహుముఖ రంగాలలో తన మార్గదర్శకత్వాన్ని అందించిన నవయుగ తెలంగాణ వైతాళికుడు, అక్షర శిల్పి మన వట్టికోట ఆళ్వారుస్వామి.

1915 నవంబరు 1న నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ సమీపంలోని చెర్వు మాధవరం గ్రామంలో జన్మించిన వట్టికోట చిన్న తనంలోనే తల్లి సింహాద్రమ్మ, తండ్రి రామచంద్రాచార్యులను పోగొట్టుకున్నారు. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినప్పటికీ కడుపేదరికాన్ని అనుభవించిన మట్టి బిడ్డ ఆళ్వారుస్వామి తల్లిదండ్రుల మరణానంతరం పరాయి ఇండ్లలో వంటపని చేసి శ్రామిక వృత్తిలో జీవనం సాగించాడు. హోటల్‌లో సర్వర్‌గా నాలుగు రూపాయల జీతంతో పనికి కుదిరాడు. నకిరేకల్‌లోని కాంచనపల్లి సీతారామరావు అనే ఉపాధ్యాయుడి దగ్గర ఇంట్లో వండిపెడుతూ అక్షరాలు దిద్దినాడు. తదనంతరం సూర్యాపేటకు నివాసం మార్చిన తర్వాత కోదాటి నారాయణరావు గ్రంథాలయానికి వెళ్ళడం అలవాటైంది. అక్కడే పత్రికలు, గ్రంథాలు అధ్యయనం చేయడం ప్రారంభించాడు. విజయవాడలో కొద్ది కాలం పాటు హోటల్ కార్మికుడిగా పనిచేస్తూ నాటి స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపాడు. 1933లో హైదరాబాద్ వచ్చి 'గోల్కొండ' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేశాడు. 1938లో 'దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి దాని ద్వారా ప్రముఖ రచయిత, కవులు రాసిన పుస్తకాలు ప్రచురించి ఊరూర గ్రంథాలు పంచుతూ లోకాన్ని చైతన్యం గావించాడు.



వట్టికోట ఆళ్వారుస్వామి

1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభలో పాల్గొని ఆళ్వారుస్వామి అతివాదుల పక్షాన నిలిచాడు. 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో సత్యాగ్రహం చేసి సికింద్రాబాద్‌లో జైలు జీవితం గడిపాడు. స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం వంటి సామాజిక సాహిత్య సంస్థలన్నింటిలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి లతో కలిసి నడిచారు. స్వాతంత్ర్య, సాహిత్య రంగాలలో చురుకుగా పని చేస్తూ ప్రజాహిత ప్రభుత్వానికై డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టిన మహనీయుడు. 1946లో నిజామాబాద్ జైలులో ఉన్నప్పుడే ..''ఓ నిజాము పిశాచమా? కానరాడు/ నిన్ను పోలినరాజు మాకెన్నడేని / తీగలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ కోటి రతనాల వీణ'' అనే వాక్యాలను జైలు గోడల మీద దాశరథితో కలిసి బొగ్గుతో రాశాడు. జైలు అధికారులు ఎన్నిసార్లు చెరిపినా తిరిగిరాస్తూ పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాడు. ఆళ్వారుస్వామి జైలులో ఉన్నప్పుడే అక్కడి ఖైదీలతో ఏర్పడ్డ సంబంధాలతో ''జైలు లోపల'' పేరిట కథలు రాశాడు. వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన ''ప్రజల మనిషి'' నవల తొలి తెలంగాణ నవలగా ప్రసిద్ధి గాంచింది. తెలంగాణ ప్రాంతంలో నాటి పట్వారీలు, ప్రభుత్వాధికారులు చేస్తున్న దోపిడికి, దౌర్జన్యాన్ని ఎలుగెత్తిన నవల, సమస్యల పరిష్కారం కోసం పోరాటమే తీర్పు వేరే మార్గం లేదని ప్రబోధించిన నవల... ప్రజల మనిషి. ఈ నవలలో ప్రజల మనిషి 'కంఠీరవం' పాత్ర వట్టికోట ఆళ్వారుస్వామితో పోల్చదగింది. ఇక రెండో నవల 'గంగు' అసంపూర్తి రచన అయినప్పటికీ నాటి తెలంగాణ సాయుధపోరాటం స్థితిగతులను వివరించి నూతన చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. స్వాతంత్ర్యానంతరం పరిణామాలతో నిరాశ చెందిన ఆళ్వారుస్వామి నాటి రాజకీయ నాయకులపై, సామాజిక స్థితిగతులపై వ్యంగ్యంగా సంధించిన అస్త్రమే, 'రామప్ప రభస' వ్యాసాలు.

1951లో 'గుమస్తా' అనే పత్రిక స్థాపించి వారి హక్కుల కోసం పోరాడినాడు. తాను జీవించిన 46 సం॥రాలలో 22 సం॥రాలు నిరంతరం ప్రజల కోసం ప్రజల మధ్య గడిపినాడు. 1953 వరకు జైలులోనే ఉన్న ఆళ్వారు తదనంతరం రాజకీయాల కతీతంగా కొంత కాలం గడిపి తర్వాత కమ్యూనిస్టుగా మారాడు. దాశరథి చేత ''అబద్ధ అసురుల పాలిట తల్వార్ ఆళ్వార్'' అని, 12 మంది ఆళ్వారులలో ఒకరు అయ్యారని కాళోజీ చేత పిలువబడ్డ నిఖార్సైన వ్యక్తి. ఆళ్వారుస్వామి 1961 ఫిబ్రవరి 5న తుదిశ్వాస విడిచినాడు. ఆయన మన మధ్య భౌతికంగా లేక పోయినా ఆయన స్ఫూర్తి మనకు మార్గదర్శనం అవుతుంది.

తెలంగాణ ప్రజల జీవితాన్ని, సంస్కృతి, తిరుగుబాటు తత్వాన్ని పోరాట నేపథ్యాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకుని ప్రజలలో చైతన్యం గావించిన గొప్ప రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి.

గ్రంథ పఠనం వల్ల లోక జ్ఞానం కలుగుతుందని, సమాజాన్ని అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని ఊరూర గ్రంథాలయోద్యమం నిర్వహించి ప్రచారం గావించిన మట్టి మనిషి వట్టి కోట. నిబద్ధత కలిగిన వ్యక్తే గాకుండా చెప్పింది జీవితంలో ఆచరించిన మహనీయుడు ఆయన. ఆయన జీవితంపై ప్రజలలో మరింత అవగాహన కలిగే విధంగా కృషి చేయడమే మనం ఆయనకిచ్చే ఘనమైన నివాళి కాగలదని ఆశిద్దాం.

ఒక్కడు

ఒక్కడుగా జన్మించి
పదుల సంఖ్యలో విద్యార్హతలు పొంది
వందల్లో ఉద్యమాలు నడిపి
వేల వేదికల్లో ఉపన్యసించి
లక్ష అక్షరాల పుస్తకమై
పదిలక్షల మందికి ప్రజాప్రతినిధై
కోటిలో ఒక్కడై
పదికోట్ల మందికి బాసటై
వందకోట్ల జనానికి ఆదర్శమై
ఒడవని ముచ్చటై, ఓర్పుకు తీర్పై
ఔన్నత్యానికి అద్దమై
మరువని చరితనై, మాయని గురుతై
ఆరుపదుల వయసులో అలసి సొలసి
మృత్యుఒడిజేరి సేదతీరిన యుగ పురుషుడు
డా.బాబాసాహెబ్ బీమ్ రావు అంబేడ్కర్.



పల్లెర్ల నిరంజన్‌రెడ్డి, 9493123129

విద్యార్థులకు కవితల పోటీలు

తెలంగాణ రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొనువారు పదవతరగతి లోపు విద్యార్థులై ఉండాలి.తెలంగాణసంస్కృతి అనే అంశంపై 20 లైన్లకు మించని వచన కవితలను విద్యార్థిని విద్యార్థుల నుండి ఆశిస్తున్నారు. కవిత తమ స్వంతమనే హామీ పత్రంతో పాటు, పాస్‌పోర్ట్‌సైజ్ పోటో జతచేసి ఏ4 పేపరుకు ఒకవైపు మాత్రమే రాసికానీ, డిటిపి చేసి కానీ పంపవచ్చు. కవిత పంపేవారు ఏ పాఠశాలలో చదువుతున్నారో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ తప్పనిసరి. లేనిచో కవితను పోటీకి స్వీకరించరు. వచ్చిన కవితల్లో ఐదు ఉత్తమ కవితలను ఎంపికచేసి వారికి సమాన బహుమతులు అందజేస్తారు. కవితలు పంపాల్సిన చిరునామా సి.హెచ్. వెంకటరెడ్డి, అధ్యక్షులు, వసుంధర విజ్ఞాన వికాస మండలి ఇంటినెం161238, శివాజీనగర్, గోదావరిఖని505209, పెద్దపల్లి జిల్లా. సంప్రదించాల్సినవి 9182777409, 9989078568

గేయకవితలకు ఆహ్వానం

ఉత్తమ గేయ కవితలతో సంకలనాన్ని ప్రచురిస్తామని శ్రీకాకుళం, పాలకొండ నుండి సీరపాణి తెలిపారు. గేయం ఒక పేజీలో 5 చరణాలకు మించకుండా ఉండాలి. రచయిత బయోడేటా, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోతో ఫిబ్రవరి 10 వరకు సీరపాణి పాలకొండ 532440,శ్రీకాకుళం (ఆం.ప్ర.) కు పోస్టు ద్వారా కానీ, లేదా seerapani49@gmail.comకు మెయిల్ ద్వారా కాని పంపాలి. వివరాలకు సెల్ : 6281319940 సంప్రదించవచ్చు.

సహస్రకవి సమ్మేళనం

'తెలుగు లోగిలి' స్వచ్ఛంద సేవా సంస్థ పక్షాన , కృష్ణా జిల్లా అవనిగడ్డలో సహస్త్ర కవి సమ్మేళనం ఫిబ్రవరి 25,26,&27 తేదీల్లో నిర్వహిస్తున్నారు. పాల్గొనదలచిన కవులు ఫిబ్రవరి 5లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వివరాలకు 8332909156 సెల్ నెంబర్లో సంప్రదించవచ్చునని ఆహ్వాన సంఘం సమనయకర్త కలిమి శ్రీ తెలిపారు.

సాహితీ పురస్కారాల ఎంపిక

రామదాసి రాజారాం మహారాజ్ స్మారక సాహితీ పురస్కారాలను ప్రకటించారు. అయాచితం నటేశ్వరశర్మ, ఏనుగు నర్సింహారెడ్డి, దాస్యంసేనాధిపతి, వి.పి. చందన్‌రావు శ్రీచరణ్, పాయల్‌కు ఈ పురస్కారాలకై ఎంపిక చేశారు.

సమాజానికి ఎక్స్-రే కవిత్వం... తిరునగరీయం




బైరపాక స్వామి
9951828781

ఆధునిక కవులల్లో ఆలేరుకు వన్నె తెచ్చిన కవి తిలకుడు, భారత్ భాషాభూషణుడు డాక్టర్ తిరునగరి. తిక్కన తరువాత పద్యానికి అంత పటిమనిచ్చి రాసే ఆధునిక కవులల్లో అగ్రగణ్యుడు. బహుశ జాషువా శిష్యుడైనందుకేమో పద్యానికంతా పటిమొచ్చింది. ఆయన రాసే కవిత్వానికి వెలుగొచ్చింది. కవిత్వం అంటే కాలక్షేపం కోసం రాసే వ్యసనం కాదని సమాజాన్ని మార్చే యజ్ఞమని ఆయన మాటల్లో, కవిత్వంలో రుజువుచేసిన సందర్భాలెన్నో. ఎంతసేపైనా మాట్లాడగలవాడు. అంతకుమించి ఎదుటివారు మాట్లాడుతుంటే వినగలవాడు. పూర్వ సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు ఏ పద్యమైన చెప్పగలడు. ఏ మాటైనా విప్పగలడు. ఆ కవికి చీకటి బతుకులేకావాలి. నడిరోడ్లపై పడివున్న ఆనాథలే కావాలి. భ్రష్టుపట్టిన రాజకీయమే కావాలి. రైతన్నల శ్రమ కావాలి. కార్మిక బతుకుల కష్టాలే కావాలి. వస్తువు ఏదైనా సమ సమాజ నిర్మాణమే ఆయన కవిత్వంగా మల్చుకున్నడు. నలభైకి పైగా గ్రంథాలను ముద్రించుకున్నడు. సమాజం గుండెలో ఆవిష్కరించుకున్నడు. కవిత్వాన్ని రాసేటప్పుడు చెడును ధిక్కరించాలి. మంచిని ప్రోత్సహించాలని అంటాడు. ఈ కవికి దాశరథి కృష్ణమాచార్య అంటే చాలా అభిమానం. ఆయన కవితొక్కటి చెప్పనిదే మాటలు పొంగిపొర్లనివ్వడు. జలపాతం వలె జాలు వారనివ్వడు. ఎంతటి కవితా ధారణ శక్తినో ఈకవికి. ఈయన జాతి గురించి తిరునగరీయంలో

''జాతి జరుపుకొనెను స్వాతంత్ర్య సర్ణోత్సవాలు/ మారలేదు బడుగు బ్రతుకుతిండి /దొరుకునాడు నిండు స్వాతంత్ర్యమ్ము/ తిరునగరిది మాట తిరుగులేదు'' అంటున్న ఈ కవి ఆవేదన బడుగు బతుకుల కోసమే, సమాజ శ్రేయస్సు కోసమే కవిత్వం రాస్తాడు. ఈ కవి కలం రోజు ఏదైనా రాయనిదే ఆయన హృదయం విశ్రాంతి తీసుకోదు. 'చదువు పెరిగె కాని సంస్కారమే లేదు/ నరులలోన దురుసు పెరిగిపోయె/ దురుసువారికి ప్పుడు పరపతి మెండురా/ తిరునగరిది మాట తిరుగు లేదు' అని కలమెత్తి చదువెంతుంటే ఏమి లాభం సంస్కారమే లేదని సమాజాన్ని ధిక్కరిస్తాడు ఈ కవి. కానీ నేటి సమాజమంతా కుసంస్కారంతో విచ్చలవిడిగా నాగరికథను మరచి అనాగరికులుగా బ్రతుకుతున్నారని ఆవేదన చెందుతున్నాడు. సమాజం బాగుండాలంటే నేతలల్లో మార్పు రావాలి అంటూ ''పాడు రాజకీయ పంకిలమందున/ విలువల్ని కలిసి మలినమయ్యె /మురికి పాలిటిక్సు ముంచునో తేల్చునో/తిరునగరిది మాట తిరుగులేదు'' అంటూ నిలువెళ్ళా జాతి మార్పుకోసం తన పద్యం ద్వారా గొంతెత్తుతున్న కవి తిరునగరి. అనాథల కోసం అలమటిస్తాడు. తిండి ఎక్కువైన వాడు పారెస్తాడు, తప్ప అనాథలను పిలిచి అరపిడికిలి అన్నం పెట్టని దౌర్భగ్య సమాజంగా వక్రీకరించిందని ఆవేదన చెందుతూ ''తిండి లేక ఒకడు తిప్పలు పడుచుండు/ తిండిపారవైచు చుండునొకడు /తిండి విలువ జనము తెలియుట ఎన్నడో/ తిరునగరిది మాట తిరుగులే''దంటాడు.

పద్యాన్ని ప్రాచీన ఛందస్సులో కాకుండా నవీన భావాలు అద్ది పద్యాన్ని హృద్యంగా చెప్పుతాడు. మనిషికి ఒకింత మానవత్వం ఉండాలంటాడు. ఈ సమాజం రైతురాజ్యం కావాలి అంటాడు. ''పొలము దున్నువాడు పూజ్యుడు జాతికి /బురద మేను చూచి పోకు తొలగి / బురద చేతికంట పెరుగు నోటికి అందు / తిరునగరిది మాట తిరుగులేదు'' అని బురదను చూచి తొలగిపోయేవాడు కూడా తినేది అన్నమే కదా. దేశానికి వెన్నెముక రైతు అనడం తప్ప రైతు కష్టాల గురించి ఆలోచించే నాధుడే కురువైపోయాడని తన కలంతో యావత్‌జాతికి సందేశమిచ్చాడు. ఆయన ఇప్పటి వరకు రాసిన రచనలు శృంగార నాయికలు, బాలవీర, కొవ్వొత్తి, తల్లిప్రేగు, వానావాడు, తిరునగరీయం రెండు సంపుటాలు,మనిషి నా పద్యం, వసంతం కోసం, అక్షరధార, గుండెలో నుంచి, ముక్తకాలు, మా పల్లె, మనిషి కోసం, ఈ భూమి, నీరాజనం, ప్రవాహిని, ఉషోగీత, జీవధార, ఒకింత మానవత కోసం, కిటికిలోంచి, యాత్ర, సముద్రమథనంతో పాటు ఇంకా అనేక రచనలు చేశాడు. వెయ్యికి పైగా వివిధ పత్రికల్లో వ్యాసాలు, రాశాడు. ఆయనకు కవితిలక, భారత్ భాషాభూషణ్ బిరుదులతో పాటు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్కారం, అందుకున్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ సత్కారం, వివిధ విశ్వవిద్యాలయాలల్లో జాతీయ సదస్సులో పత్ర సమర్పణలు చేసిన తిరునగరి ఎన్నో కవి సమ్మేళన వేదికలల్లో సభాధ్యక్షులుగా అబాల గోపాలాన్ని అలలారించిన కవి ఆయన. అటు ప్రాచీనం, ఇటు ఆధునికం అన్ని అపోశనం పట్టిన కవి తిరునగరి. ఆయన రాసిన తిరునగరీయం సమాజాన్ని విశ్లేషిస్తూ వచ్చిన ఎక్స్ రే కవిత్వం.



డా. తిరునగరి



విజేత

సక్సెస్ ఫార్ములా




తన్మయ్ భక్షి

డిజిటల్ తన్మయం

ఏదైనా పని ఇష్టంతో చేసినప్పుడు దానికి వయసు ఏమాత్రం అడ్డుకాదని నిరూపించాడు 14 ఏళ్ల తన్మయ్ భక్షి. ప్రపంచంలోనే అతి పిన్నవయస్కుడైన ఐబిఎమ్ వాట్సన్ పోగ్రామర్. ప్రస్తుతం అమెరికాలోని గూగుల్ కంపెనీలో నెలకు రూ.66 లక్షల జీతంతో పనిచేస్తున్నాడు. భవిష్యత్తులో ప్రతి ఉద్యోగం డిజిటల్ స్కిల్స్ పైనే ఆధారపడి ఉంటాయని చెబుతున్నాడు భక్షి. అంతేకాదు తన్మయ్ కీనోట్, టెడ్ఎక్స్ స్పీకర్. అల్గారిథమిస్ట్. రచయిత. వాట్సన్, కాగ్నిటివ్ డెవలపర్. ఎడ్యుకేషనల్ యూట్యూబర్. ఐబిఎమ్ క్లౌడ్ గౌరవ సలహాదారుడు. తన్మయ్ భక్షి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కి సిఇవో, హెడ్ డెవలపర్...ఇలా చెప్పకుంటూ పోతే తన్మయ్ గురించి తెల్సుకోవాల్సింది చాలానే ఉంది.

తన్మయ్ కుటుంబం ఉద్యోగరీత్యా 2004లో కెనడాలోని బ్రాంప్టన్‌లో సెటిల యింది. తన్మయ్ భక్షి 2003 లో ఇండియాలోనే పుట్టాడు. తండ్రి పునీత్ ఎ ట్రక్కింగ్ కంపెనీలో కంప్యూటర్ ప్రోగ్రామర్. వారాంతంలో పునీత్ సైన్స్, లెక్కల సబ్జెక్టులను నైట్ ట్యూషన్లు చెబుతాడు. తల్లి సుమిత గృహిణి. అక్క కెనడా యూనివర్సిటీలో చదువుతోంది. తన్మయ్ తన తండ్రి దగ్గర ఐదేళ్లకే కంప్యూటర్ కోడింగ్ నేర్చుకున్నాడు. తొమ్మిదేళ్లకు మొదటి ఐవోఎస్ యాప్‌ను తయారుచేశాడు. 12 ఏళ్లకు ప్రపంచంలోనే అతిపిన్న వయసులో ఉన్న ఐబిఎమ్ వాట్సన్ ప్రోగ్రామర్‌గా అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. చిన్నవయసులోనే తన్మయ్ భక్షి సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నాడు. యాప్స్‌ను తయారుచేశాడు. దాదాపు లక్షమంది కోల్డర్స్‌ను ఎడ్యుకేట్ చేయడం తన లక్ష్యమని చెబుతుంటాడు. 2016లో జరిగిన ఐబిఎమ్ డెవలపర్ కనెక్ట్ ప్రోగ్రాంలో తన కొత్త ఆల్గారిథమ్ గురించి చెప్పాడు. తను రూపొందించిన 'ఆస్క్ తన్మయ్' అనే తన వెబ్‌సైట్‌ను అక్కడ అందరికీ పరిచయం చేశాడు.

తన్మయ్ తన 5ఏళ్ల వయసులోనే స్విఫ్ట్, విబి, జావా, సి ప్లస్ లాంటి మిగతా లాంగ్వేజస్‌లో కోడింగ్ చేయడం మొదలుపెట్టాడు. 9ఏళ్లప్పుడు ఐఫోన్‌లో టిటేబుల్స్ అంటూ ఓ యాప్‌ను తయారుచేశాడు. తన్మయ్ టీచస్ అంటూ యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేశాడు. ఆస్క్ తన్మయ్ అనేది వరల్డ్ ఫస్ట్ వెబ్ బేస్డ్ ఎన్ఎల్‌క్యూఏ సిస్టమ్‌గా పేరుతెచ్చుకుంది. తన్మయ్ ఇంటి దగ్గర ఉండే చదువును కొనసాగిస్తున్నాడు. ఫ్రెండ్స్‌తో కలిసి టెన్నిస్ ఆడటం అంటే చాలా ఇష్టమని అంటున్నాడు. తను రాసిన 'హల్లో స్విఫ్ట్' అనే పుస్తకంలో ఐవోఎస్ ప్రోగ్రామింగ్ టెక్నిక్స్‌ను కిడ్స్, డెవలపర్స్ కోసం రాశాడు. ప్రపంచం మరింత మంది డెవలపర్స్‌ను కోరుకుంటుంది అంటాడు తన్మయ్. 15 ఏళ్ల నుంచి 40ఏళ్ల వరకు అందరూ తన్మయ్ స్పీచస్ యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లుగా ఉన్నారు. వారు అది విని తమ సందేహాలను తీర్చుకుంటున్నారు. తను రాసిన పుస్తకానికి అబితాబ్‌బచ్చన్ సంతకం పెట్టడం చాలా ఆనందాన్ని కలిగించిందంటాడు.



2016లో లాస్‌వెగాస్‌లో ఐబిఎమ్ ఇంటర్నెట్ కార్యక్రమంలో కీనోట్‌పై ప్రసంగించాడు. అక్కడే ఆస్క్ తన్మయ్ అనే వెబ్‌ను ప్రదర్శించాడు. అదే ఏడాది జూన్‌లో బెంగళూరులోని ఐబిఎమ్ డెవలపర్ కనెక్షన్‌కి కీనోట్‌పై ప్రసంగించాడు. ఇటీవల నయాగరాలో జరిగిన ఎన్ఎలసీ (నేషనల్ లీడర్‌షిప్ కాన్ఫెడన్స్) లో ప్రసంగించాడు.ఐవోటి ఎనేబుల్ పరికరాలను రూపొందించడానికి ఐబిఎమ్ వాల్మాట్ నుంచి తన సలహాదారులతో కల్సి పనిచేస్తున్నాడు. ప్రస్తుతం గూగుల్‌లో పనిచేస్తున్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎక్స్‌పర్ట్‌గా ప్రపంచంలో గుర్తింపు పొందాడు. ఫిన్‌లాండ్, న్యూజిలాండ్, డెన్మార్క్, ఆస్ట్రేలియాల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రసంగించాడు. చిన్నప్పటి నుంచే ఇంటర్‌నెట్‌ను సొంతంగా ఉపయోగించడం నేర్చుకున్నాడు. కోడింగ్ తెలుసుకున్నాడు. పుస్తకాలను చదివేవాడు. ప్రోగ్రామింగ్ చేసేవాడు. తన యూట్యూబ్‌లకు దాదాపు రెండు లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 2017లో దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దుబాయ్ రాజు నుంచి నాలెడ్జ్ అంబాసిడర్ అనే అవార్డును అందుకున్నాడు. గూగుల్‌లో 1.2 మిలియన్స్ జీతంతో పనిచేస్తున్నాడు. తన్మయ్ గూగుల్ ఇంటర్వ్యూ వాట్సాప్‌లో చక్కర్లు కొడుతూండటం గమనార్హం.



తల్లిదండ్రులతో...



సుమనోహర సువిగ్య చిత్రాలు

వ్యాపార దిగ్గజాల నుండి సినిమా సెలబ్రిటీల వరకు తమ వర్ణ చిత్రాలు వేయమని సువిగ్యశర్మ వెంటపడతారు. సహజత్వం ప్రతిబింబించే సువిగ్య చిత్రాలు మనసును కట్టిపడేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కళ్ళు ఆర్పకుండా తమ ప్రతి రూపాలను చూసుకుంటూ మురిసిపోతారు. అందుకే ఆసియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించారు.



కాన్వాస్ మీద అంతఃసౌందర్యాన్ని చూపించడంలోనే కళాకారుడి ప్రతిభ బయటపడుతుంది. ఈ విషయంలో సువిగ్యశర్మకు తిరుగులేదు. జైపూర్‌కి చెందిన 34 ఏళ్ల సువిగ్య పేరు బాలీవుడ్‌లో సుపరిచితం. ఎందరో బాలీవుడ్ తారలు సువిగ్యతో బొమ్మ గీయించుకున్నవారే. ఇక వ్యాపార రంగానికి చెందిన సెలబ్రిటీలు బిర్లాలు, అంబానీలు, సింఘానియాలు, బజాజ్‌లు, మిట్టల్ లాంటి దిగ్గజాలు సువిగ్య క్లయింట్ల జాబితాలో వున్నారు. త్రీడి పెయింటింగ్స్ వేయడంలో సువిగ్య శర్మ దిట్ట. గంటల కొద్దీ పెయింటింగ్ రూంలో చిత్రాలు గీస్తూంటాడు. ముంబయిలోని సిద్ధివినాయక దేవాలయంలోని మూలమూర్తి చిత్రాన్ని నాలుగు డైమన్షన్‌లో చిత్రించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డుకెక్కాడు.ఆ బొమ్మ కోసం ఏడాదిన్నరపాటు పనిచేశాడు. సువిగ్య చిరు ప్రాయం నుంచే బొమ్మలు వేయడం ఆరంభించాడు. తాతయ్య, నాన్న కూడా ప్రసిద్ధ చిత్రాకారులే. 80 ఏళ్ళ కుటుంబ వారసత్వాన్ని కొనసాగించడమే కాకుండా.. బంగారం, ఖరీదైన రాళ్ళు, రత్నాలను పెయింటింగ్స్‌లో పొదగడం సువిగ్య ప్రత్యేకత. తంజావూర్, మొఘల్, వర్ణచిత్రాలు పద్ధతులను మేళమించి నూతన ప్రక్రియను రూపొందించడంలో విజయం సాధించాడు. ఇటీవల సువిగ్య శర్మ వేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టెండూల్కర్ అంజలి దంపతుల వర్ణ చిత్రాలు ఆయన ప్రతిభకు పట్టం కట్టాయి. 'భగవంతుడి ప్రతి సృష్టిలోనూ ఏదో ఒక గొప్పతనం ఉంటుంది. అదేమిటో గుర్తించడమే కాకుండా, దాన్ని హైలెట్ చేయడమే నా విజయ రహస్యం' అంటారు సువిగ్య శర్మ.



ఖర్చు విషయంలో ప్రణాళిక ముఖ్యం

స్నేహితుల దగ్గర డబ్బుల విషయంలో అస్సలు వెనుకాముందూ చూడని మనస్తత్వం చాలా మందికుంటుంది. ఎడాపెడా ఖర్చుపెట్టేస్తుంటారు. వన్‌వే ట్రాఫిక్‌లా ...అవతలి వాళ్లు కూడా అలాగే ఉంటారేమో అనుకుంటారు..ఉండకుంటే నొచ్చుకుంటారుగానీ బయటపడరు.. అలా కాకుండా ఫ్రెండ్స్ అంతా ఒక ప్లాన్ ప్రకారం ..బయటకు వెళ్లినప్పుడు ఖర్చు విషయంలో అంతా శ్రద్ధ తీసుకుంటే ఎటువంటి పొరపొచ్చాలు రాకుండా ఉంటుంది.



- స్నేహితులంతా ఎప్పుడైనా ఒకసారి కలవడానికి ఒక వేదిక కావాలి. కాఫీ షాపులూ, రెస్టారెంట్లూ, సినిమా థియేటర్లలాంటివన్నమాట. అలా అందరూ కలిసినప్పుడు డబ్బులు గురించి ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. ఎవరో ఒకరు ఇచ్చేస్తారే అనుకుంటారు. ఇలా ఒకట్రెండుసార్లయితే ఫర్వాలేదుగానీ అస్తమాటూ ఒక్కరి మీదే భారం మోపుతుంటే తప్పించుకోవడం ఎలాగో తెలీక పాపం ఖర్చుపెట్టేవారు అయోమయంలో పడతారు. అందుకనే సాధ్యమైనంత వరకు ఒక్కోసారి ఒకరుగా ఖర్చు పెట్టేందుకు ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదు.
- ఎవరైనా షాపింగ్ తోడుకోసం మిమ్మల్ని తీసుకెళ్తే, మీ ఖర్చంతా వాళ్లే పెట్టుకోవాలన్న నియమ నిబంధనలు పెట్టుకోవద్దు. ఎప్పుడైనా అయితే ఒకే గానీ, అస్తమాటూ బాగోదు.
- విహారానికి ఎక్కడికైనా వెళ్లాలని ప్లాన్ చేసుకుంటే, ముందుగా మీరు మీ స్నేహితులు ఎంతెంత ఖర్చుపెట్టగలరో బడ్జెట్ వేసుకోండి. దాని ప్రకారం టూర్ ప్లాన్ చేయాలి. అంతేకానీ వెళ్లాక ఇబ్బంది పడటం మంచిదికాదు.
- ఫ్రెండ్స్‌తో హోటల్‌కి వెళ్లి తిన్నాక బిల్లు కట్టాల్సి వచ్చినప్పుడు వచ్చిన దాంట్లో ఎవరెవరు ఎంత అని లెక్కలు వేసుకోవడం సభ్యత కాదు. ముందు ఎవరో ఒకరు బిల్ కట్టేలా చొరవ చూపాలి. తర్వాత లెక్కలు చూసుకోవచ్చు.

సానుకూల దృక్పథంతో విజయం



ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండటం ఆరోగ్యానికి మంచిది. ఒక్కసారి నెగిటివ్ ఆలోచనలు మదిలోకి వచ్చాయంటే తప్పించుకోవడం చాలా కష్టం అంటున్నారు మానసిక నిపుణలు. నెగిటివ్‌గా ఆలోచించేవారికి ఏది చూసినా తప్పుగానే అనిపిస్తుంది. ఇలాంటప్పుడే సానుకూలంగా ఆలోచించడం అవసరం. అనుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదని గుర్తుంచుకోవాలి. ఒక్కసారి విజయాన్ని చవి చూసారంటే చాలు అనుకూల దృక్పథానికి అలవాటుపడటం ఖాయం. అలా కాకుండా నేనిలాగే ఉంటాను అనుకుంటే నష్టపడతారు.

- ప్రతికూల ఆలోచనలతో ఉన్నప్పుడు ఆఫీసులోనో, ఇంట్లోనో ఎవరైనా మన మీద కోప్పడితే, వెంటనే తిరిగి కోప్పడటం వల్ల నష్టమే కదా. అలాంటప్పుడు నిదానంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. నెగిటివ్‌గా కాకుండా వాళ్లెందుకలా ప్రవర్తించారో తెలుసుకునే ప్రయత్నం చేయండి.
- మీలో మీకు నచ్చే విషయాలు కొన్నుంటాయి. అవేంటో ఒకసారి గుర్తుకుతెచ్చుకోండి. మీలో ఉన్న మంచి గుణాలు మీకు ఎంతో ధైర్యాన్నిస్తాయి. మీ స్నేహితులు, బంధువుల కష్టాలను గుర్తుకు తెచ్చుకోండి. వెంటనే మీరే బెటరన్న స్ఫురణకు వచ్చి సానుకూలంగా ఆలోచించడం మొదలుపెడతారు.అందిపుచ్చుకుంటే అవకాశాలకు కొదవుండదు. ఒకసారి ఓటమిపాలైతే కొంపమునిగిపోయిందేమీ లేదు. తిరిగి మరోసారి ప్రయత్నించండి.
- మీకిష్టమైన అభిరుచిని బయటకు తీయండి. పెయింటింగ్, పుస్తకాలు చదవడం, పాటలు వినడం, డాన్స్‌లాంటివి ప్రారంభించండి. ఖాళీగా మాత్రం కూర్చోవద్దు. మీలో వచ్చే మార్పుకు మీరే ఆశ్చర్యపోతారు.

ఎఎన్ఎంల వేతనాల పెంపు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 710 మంది ఏఎన్ఎమ్ (ఆగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫరీ)ల వేతనాలు రూ. 10 వేల నుంచి రూ. 21 వేల వరకు పెరిగాయి. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం రాత్రి సంతకం చేశారు. 'యూరోపియన్ కమిషన్' ప్రకారం 2003లో నియమితులైన 710 ఏఎన్ఎమ్‌లకు ఈ వేతనాల పెంపు వర్తించనుంది. 'రెండవ' ఏఎన్ఎమ్‌ల వేతనాలను కూడా పెంచాల్సిందిగా వైద్యారోగ్య శాఖ మంత్రి, కార్యదర్శి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే వీరి వేతనాల పెంపుకు సంబంధించి కూడా నిర్ణయం తీసుకుంటామని సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వేతనాలను పెంచాల్సిందిగా దీర్ఘకాలంగా ఏఎన్ఎమ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు ఉధృతంగా ఉద్యమాలు కూడా చేశారు. ప్రభుత్వాలను తూర్పారబట్టారు. గతేడాది నవంబరు చివర్లో ప్రగతి భవన్ ముందు నిరసన చేశారు. దానికంటే ముందు ఆగస్టు చివరి వారంలో వైద్యారోగ్య కమిషనర్ కార్యాలయం ముందు నిరసన చేశారు. చివరికి 'యూరోపియన్ కమిషన్' ఏఎన్ఎమ్‌ల వేతనాలను పెంచుతూ సిఎం నిర్ణయం తీసుకోగా, త్వరలోనే రెండవ ఏఎన్ఎమ్‌ల వేతనాలను పెంచడానికి కూడా సానుకూలంగా స్పందించారు.

ముందస్తు లేనట్టే!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకురావాల్సిన వత్తిడిని శనివారం రాత్రి ఎంపీలతో చర్చించిన సందర్భంగా సిఎం కెసిఆర్ పలు అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. అసెంబ్లీ సీట్లు పెరగని పక్షంలో వలస వచ్చినవారిని, రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు ఆశిస్తున్న కొద్దిమందిని ఈ ఏడాది ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాలతో సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతానికైతే ముందస్తు ఎన్నికలు ఉండవనే అభిప్రాయంతోనే ఉండాలని, అందుకు తగినట్లుగానే పార్టీ కార్యాచరణ ఉంటుందని ఎంపీలకు స్పష్టం చేసినట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ముందస్తు ఎన్నికలు ఉండవని తాజాగా చేసిన వ్యాఖ్యలను, తెలుగు రాష్ట్రాల బిజెపి నేతలతో అమిత్‌షా మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన సమావేశాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు విషయమై చేసిన వ్యాఖ్యలను ఎంపీలతో ఈ సందర్భంగా కెసిఆర్ ప్రస్తావించినట్లు తెలిసింది. ఫిబ్రవరి చివరికల్లా జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తికావాలని భావిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పథకాలను పూర్తిచేయడంపైనా, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలుచేయడంపైనా బడ్జెట్ సమావేశాల తర్వాత దృష్టి పెట్టనున్నారు.

సర్వే ఆధారంగా అభ్యర్థుల ఎంపిక :

ఎన్నికల మూడ్‌లోకి వెళ్ళిపోయిన కెసిఆర్ సర్వే వివరాలను విశ్లేషిస్తున్నారు. ఇంటెలిజెన్స్ విభాగంతో పాటు రెండు ప్రైవేటు సంస్థలు సర్వే చేస్తూ ఉన్నాయి. అధికార పార్టీ బలం మాత్రమే కాకుండా విపక్ష పార్టీల బలాలు, బలహీనతల్ని కూడా సర్వేల ద్వారా విశ్లేషిస్తున్నారు. ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తాజాగా జరిగిన రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో లోక్‌సభ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను సిఎం లోతుగా విశ్లేషిస్తున్నారు. జాతీయ స్థాయిలో మోడీ పలుకుబడి పడిపోవడం, కాంగ్రెస్ ఊపందుకోడానికి దారితీసిన పరిస్థితులు తదితర క్షేత్రస్థాయి వివరాలు తెప్పించుకుని అధ్యయనం చేస్తున్నారు. అక్కడి కాంగ్రెస్ విజయాలు తెలంగాణలో చూపే ప్రభావంపై దృష్టి పెట్టారు.

నేర వివరాలు చెప్పాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటారు. కొత్త నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులను, పత్రాల నమూనాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఇఎలు, జిల్లాపరిషత్ సిఇఓలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు పంపించింది. కొత్త నిబంధనల ప్రకారం అభ్యర్థులు నేరచరిత్ర వివరాలను తప్పనిసరిగా సమర్పించాల్సిన అవసరం లేకపోయినా సంబంధిత కేసులలో తీర్పులు, విచారణలో ఉన్న కేసులు తదితరాలను తప్పనిసరిగా సమర్పించాలి. జైలు శిక్ష పడితే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హత, నిషేదం లాంటి నిబంధనలు ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకూ వర్తించనున్నాయి. విద్యార్హతలు, స్థిర, చరాస్థుల వివరాలను నిర్దిష్ట ఫార్మాట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. పోటీచేసే అభ్యర్థుల సంపూర్ణ సమాచారం అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఈ నిబంధనలు రూపొందాయి. పూర్తి సమాచారం తెలియడం వల్ల సరైన నాయకుడిని ఎన్నుకునే వీలు కల్పించడానికి, ప్రజాప్రతినిధులు ఎన్నికలో పారదర్శకత ఉండడానికే ఈ పద్ధతిని తీసుకువస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పేర్కొంది. ప్రతీ అభ్యర్థి సమాచారాన్ని (నేరచరిత్ర, స్థిరచరాస్థుల వివరాలు, విద్యార్హతలు తదితరలు) ఇకపైన నోటీస్ బోర్డులపై పెడతారు. ఇప్పటి వరకు ఈ విధానం లేదు.

హరిత హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

హరితవనం చేయడానికి వీలుగా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ మంత్రి, అటవీ మంత్రి, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ప్రధాన సలహాదారు, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాలను సందర్శించాలని, అభివృద్ధి చేయడానికి ఏం చేయాలో అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. నగరంలోనూ, చుట్టూతా పచ్చదనం పరిఢవిల్లేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 'సేవ్ హైదరాబాద్'లో భాగంగా ఈ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాల సంరక్షణ పనులు జరగాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కెటిఆర్, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సీతారాం నాయక్, ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, రెవిన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరజ్ కార్యదర్శి వికాస్‌రాజ్, పంచాయతీరాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్, భూ రికార్డుల ప్రత్యేకాధికారి వాకాటి కరుణ పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ చట్టం :

బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సిఎం ఆదేశించారు. చట్ట సవరణ ముసాయిదా బిల్లు పురోగతిపైనా, కొత్త పంచాయతీల ఏర్పాటుకు జరుగుతున్న కసరత్తుపైనా, కొత్తగా నగర పంచాయతీల ఏర్పాటుపైనా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికగా ఐదు లక్షల రూపాయల నుంచి గరిష్టంగా రూ. 30 లక్షల వరకు ప్రతీ ఏటా నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ఏర్పాట్లు చేయాలని ఆర్థికశాఖ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం నిధులు, ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, ఆస్తి పన్ను వసూళ్ళ ద్వారా వచ్చే ఆదాయం తదితరాలను సమకూర్చడంపై విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటయ్యే పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి నిధుల్ని ఏ విధంగా పొందవచ్చునో అధ్యయనం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సూచించారు.

సకాలంలో పనులు పూర్తికావాలి :

రాష్ట్రవ్యాప్తంగా మార్చి 11న పట్టాదారు పాసు పుస్తకాలను ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటి ముద్రణ పురోగతిపైనా, భూ రికార్డులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు ఉద్దేశించిన 'ధరణి' వెబ్‌సైట్ ఏర్పాటు పురగోతిపైనా రెవిన్యూ శాఖ, ఐటి శాఖ అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. అనుకున్న సమయంలోపల త్వరితగతిన ఈ పనులు పూర్తయ్యేటట్లు చూడాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ గ్రామాన నేత్ర శిబిరాలను నిర్వహించిఉచితంగా వైద్య పరీక్షలతోపాటు కళ్ళజోళ్ళను సరఫరా చేయడంపై శనివారం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా విధివిధానాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమం సక్రమంగా అమలు కావడానికి ప్రభుత్వేతర సంస్థలను, స్వచ్ఛంద సంస్థలను, ఆసక్తి కలిగిన ఇతర వ్యవస్థలను భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అవలంబించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయాలని ప్రధాన కార్యదర్శిని, వైద్యారోగ్య శాఖ మంత్రిని, కార్యదర్శిని, కమిషనర్‌ను ఆదేశించారు. మూడు నెలల్లోనే ఈ కార్యక్రమం పూర్తికావాలని స్పష్టం చేశారు.

మావోయిస్టుల ఏజెన్సీ బంద్

(మొదటిపేజీ తరువాయి)

బలగాలు చెట్టు పుట్టనుసైతం వదలకుండా గాలింపు చర్యలు చేపట్టారు. ల్యాండ్మైన్లు అమర్చే అవకాశం ఉండటంతో వాటిని కనుగునే ప్రత్యేక యంత్రాల సహాయంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో భారీ భద్రతా ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రభుత్వ భవాలను సైతం కట్టు దిట్టమైన భద్రత కల్పించే పనిలో పోలీసులున్నారు. అడవుల్లో రోడ్డు పనులు నిర్వహిస్తున్న వాహనాలను ఇప్పటికే మావోయిస్టులు ధ్వంసం చేస్తుండటంతో బంద్‌లో భాగంగా మరింత పెట్రేగిపోయే ప్రమాదం ఉందనే నిఘా వర్గాల హెచ్చరికలతో రోడ్డు పనులు నిర్వహించే పలు రకాల యంత్రాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. మావోయిస్టుల టార్గెట్లో ఉన్న రానాయకులు, గ్రామస్తులను అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పోలీసులు సూచించినట్లు తెలిసింది. ప్రధాన రోడ్ల ద్వారా అటవీ గ్రామాల్లోనికి ప్రవేశించే మార్గాలు, గోదావరి ఫెర్రీ పాయింట్లు, సమస్యాత్మక అటవీ గ్రామాలపై దృష్టి సారించి మావోల కదలికలపై నిఘా పెట్టారు.

త్వరలో కొత్త రాజకీయ పార్టీ

స్పష్టం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్



మన తెలంగాణ/హైదరాబాద్: త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ప్రకటించారు. అనేక పోరాటాలు చేసిన తమకు రాజకీయం చేయడం కూడా తెలుసనేది నిరూపిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదివరకే ప్రభుత్వానికి అనేక వినతులు సమర్పించామని, నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేదని, అందుకే ఇక తేల్చుకోవల్సిన సమయం ఆసన్నమైందని, ఇందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటాలతో తమకు సింహాసనాలు, కిరీటాలు పోయేదేమీలేదని, ఉద్యమ ఆకాంక్షలను అమలు చేయాలనే లక్ష్యాన్ని సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతంలోని తుర్కయాంజల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యమ ఆకాంక్షల అమలు, సమస్యల పరిష్కారంపై ప్రజలను చైతన్యవంతులను చేసి కదిలించాలన్నారు. తెలంగాణ జెఎసి, రాజకీయ పార్టీ రెండూ సమాంతరంగా ముందుకు సాగుతాయని అన్నారు. ప్రజా సమస్యలపై జెఎసి పోరాటంచేస్తే, వాటి పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ పార్టీ ముందుకుసాగుతుందన్నారు. తెలంగాణ వస్తే మనోడే కుర్చీలో కూర్చుంటారని, సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని, ఉద్యమకారులకు గౌరవం దక్కుతుందని, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుతాయని ఎంతోమంది ఆశించారని, అయితే అవి దక్కలేదని అన్నారు.

పార్టీ పెట్టాల్సి వస్తుందనుకోలేదు..

తెలంగాణ రాష్ట్రంలో జెఎసి ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే పరిస్థితులు వస్తాయని తాము భావించలేదని, ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన జరుగుతున్న నేపథ్యంలోనే పార్టీ పెట్టాల్సి వస్తోందని కోదండరామ్ సష్టంచేశారు. డబ్బున్న వాళ్లే రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులను కూడగట్టుకుంటున్నారని, కాంట్రాక్టులను దక్కించుకుంటున్నారని, తమ రాజకీయం మాత్రం ప్రజల కేంద్రంగా ఉంటుందన్నారు. రాజకీయ పార్టీ లేకపోతే ప్రజా పోరాటాలకు ఫలితమే ఉండదన్నారు. రాజకీయ పార్టీ అంటే కేవలం ఎన్నికలే కాదని, ఎన్నికలు ఒక కీలక ఘట్టం మాత్రమేనని స్పష్టం చేశారు.

రైతు సమస్యలపై పెద్ద పోరాటమే ...

రైతు సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటం చేయాలని కోదండరామ్ అన్నారు. రైతు, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయి నుంచి ప్రదర్శనలు, వంటావార్పుల లాంటి పోరాటాలకు సిద్ధపడాలన్నారు. గద్వాలలో ఉన్న విత్తన కంపెనీలు కోట్లకు పడగలెత్తుతే, విత్తనాలు పండించే రైతులు మాత్రం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. మార్కెట్‌లో రైతులు అవమానానికి గురవుతున్నారని, రైతుకు సమాధానమిచ్చి సంతృప్తి పరిచేవారే లేకుండా పోయారన్నారు. నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవడం, మధ్యవర్తిత్వం లేకుండా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఈ సమావేశంలో రైతు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను జెఎసి ప్రకటించింది.

నా పాట మీతోటే : గద్దర్

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించి రానున్న 2019 ఎన్నికల్లో మౌఖా చూసి దెబ్బకొట్టాలని, ఇందులో తానూ ఒక పాటగా ఉంటానని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటంచేస్తున్న జెఎసిని అందరూ దీవించాలన్నారు. రాష్ట్రంలో అందరినీ కలిపే బాధ్యతను కోదండరామ్ తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 3432 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే, ప్రభుత్వం కేవలం 786 మందిని గుర్తిస్తే ఇక తెలంగాణ ఎక్కడుందని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పట్టించుకోకపోతే ఆ రైతులే పాలకులను దున్నుతారన్నారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కె.రఘు, జి.వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, జి.రవీందర్, రచనారెడ్డి పాల్గొన్నారు.

మెజార్టీ ఉన్నా మహిళా బిల్లు ఎందుకు పెట్టరు?

మోడీకి సుష్మితా దేవ్ సూటి ప్రశ్న

మన తెలంగాణ / హైదరాబాద్ : పార్లమెంటులో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఎందుకు ప్రవేశ పెట్టడం లేదని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు సుష్మితా దేవ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు యూపిఏ ప్రభుత్వం బిల్లును పెట్టిందని, రాజ్యసభ ఆమోదం కూడా పొందిందని, కానీ కొన్ని పార్టీల్లోని పురుష ఎంపీల కారణంగా అది లోక్‌సభకు రాలేకపోయిందని సుష్మితా దేవ్ వ్యాఖ్యానించారు. సంపూర్ణ మెజారిటీ ఉన్న బిజెపికి మహిళా బిల్లును లోక్‌సభలో ఆమోదించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని, లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని కోరారు. మోడీ ఈ విషయంలో చొరవ తీసుకోక పోతే 2019లో అధికారంలోకి వచ్చేది తామేనని, అప్పుడు ఈ బిల్లును ఆమోదించుకుని తమ పార్టీ చిత్తశుద్ధిని నిరూపించుకుని తీరుతామన్నారు. గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల లలితతో పాటు వివిధ జిల్లాల మహిళా కాంగ్రెస్ నాయకులు హాజరైనారు. ఈ సందర్భంగా వీరందరినీ ఉద్దేశించి సుష్మితా దేవ్ పై వ్యాఖ్యలు చేశారు.

త్వరలో రాహుల్ 'బూత్ లెవల్' మీటింగ్స్ !

పార్టీ అధినేత రాహుల్ గాంధీ త్వరలో బూత్ స్థాయి నాయకులతో భేటీ కానున్నారన్నారు. 2019లో పార్టీని అధికారంలోకి తేవడమే అజెండాగా ఆయన అందరికీ అందుబాటులో ఉండేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన జరుగుతోందన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలు కూడా ఉంటాయన్నారు. బతుకమ్మ చీరలు పేరుతో కెసిఆర్ ప్రభుత్వం పేదలకు తక్కువ నాణ్యత చీరలను పంపిణీ చేసిందని, ఎంపి కవిత మాత్రం పార్లమెంటుకు లక్షల విలువ చేసే చీరలు కట్టుకుని వస్తుందన్నారు. సిఎం కెసిఆర్ తన కూతురును చూసుకున్నట్లే పేద మహిళలను చూడాలని హితవు పలికారు.

చిన్నారి తల, గర్భిణీ హత్య...

వీడని మిస్టరీలు

మనతెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : అన్వేషణలో పోలీసులు... పరారీలో హంతకులు.. ఇదీ సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకున్న రెండు దారుణ హత్యల పరిస్థితి. కొండాపూర్‌లో హత్యకుగురైన గర్భిణీ మహిళ వివరాలు ఇంకా లభించలేదు. చిలుకానగర్‌లో లభించిన చిన్నారి తలకు సంబంధించిన శరీర భాగం ఆచూకి దొరకలేదు. ఈ రెండు కేసుల మిస్టరీని చేధించేందుకు పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాన్ని ఏమేరకు రాబడుతాయనేది నగరంలో ఆసక్తికరంగా మారింది. ఈ రెండు హత్యలకు దగ్గర పోలికలున్నాయి. తలలను శరీర భాగాల నుండి వేరు చేయబడ్డాయి. ఈ చర్యకు వాడిన లేదా వినియోగించి మారణాయుధాల ఆధారంగా కేసును ఛేదించవచ్చనేది పలువురి భావన. నగరం, శివారు ప్రాంతాలు సిసిటివిలు, బ్లూకోట్స్, పెట్రోలింగ్ వాహనాలు, శాంతిభద్రత పోలీసుల పర్యవేక్షణలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ, వీటన్నింటినీ తప్పించుకుని హంతకులు మరీ అతిదారుణమైన నేరాలు చేయడం పోలీసులకు చిక్కకుండా పారిపోవడం నగరవాసులను ఆశ్చర్యానికి లోను చేస్తున్నాయి. చిలుకానగర్‌లో చోటుచేసుకున్న చిన్నారి తల భాగం దొరికిన విషయంలో కనీసం కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కానీ, కొండాపూర్‌లో గర్భిణీ హత్య విషయంలో అనుమానితులు కూడా అభించకపోవడం గమనార్హం.

శరీరమేది...?

ఉప్పల్ పరిధిలోని చిలుకానగర్‌లోని ఓ ఇంటిపై మూడునెలల చిన్నారి తల దొరికినప్పటి నుండి దర్యాప్తు మొదలైంది. కానీ, అది ఎక్కడి నుండి వచ్చిందనేది, ఆ తలకు సంబంధించిన శరీర భాగం బయటపడలేదు. మొండెం నుండి తలను వేరు చేయడానికి వినియోగించిన పరికరాలు ఏమిటనేది స్పష్టత రాలేదు. ఒకరకంగా నరబలి అని ప్రచారం జరుగుతున్నప్పటికీ చిన్నారిని వాస్తవంగా కోసినారా..? లేదా నరికినారా..? అందుకు వాడిన పరికరాలేమిటి..? అనే ఆధారాలు వెలుగులోకి రాలేదు. మరి పోలీసులు ఏ సాంకేతిక వ్యవస్థను ఆధారంగా చేసుకుని కేసులను ఛేధిస్తారో.. ఎంతకాలం పడుతుందో వేచి చూడాలి.

బాలుడు ఇరిగేషన్ సమాచార ఖని

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం జలసౌధకు ఆహ్వానించారు. నెహాల్ నోటి వెంట వస్తున్న ప్రాజెక్టుల సమాచారాన్ని విని ఆశ్చర్యపోయారు. ప్రశ్నలకు సమాధానాలు కూడా చెబుతున్న తీరుతో నివ్వెరపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారో, మహారాష్ట్ర ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేసిందో, కెసిఆర్ దూరదృష్టిని సైతం నిహాల్ బెరుకు లేకుండా చెప్పాడు. హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఖమ్మం జిల్లా, చినకాకాని మండలం, పందిళ్లపల్లికి చెందిన హనుమంతరావు కొడుకైన నిహాల్ ఇంజనీర్లను, మంత్రిని ఆశ్చర్యచకితులను చేశారు.

నెహాల్ (5)ను రాష్ట్ర ఇరిగేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా హరీశ్‌రావు ప్రకటించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రీడిజైనింగ్ చేసిన తీరు గురించి 20 నిముషాల పాటు అలవోకగా, అనర్గళంగా మాట్లాడి నిహాల్ తన ప్రతిభను ప్రదర్శించారు. నిహాల్ చదువు కయ్యే ఖర్చు మొత్తం ఇరిగేషన్ శాఖ భరిస్తుందని మంత్రి ప్రకటించారు. తనకు తాత, సిఎం కెసిఆర్‌ను కలవాలన్న కోరికను నిహాల్ మంత్రితో చెప్పారు. తప్పకుండా ఆ కోరికను నెరవేరుస్తానని హరీశ్‌రావు హామీనిచ్చారు. అలాగే నెహాల్‌తో పాటు అతని కుటుంబ సభ్యులకు కాళేశ్వరం ప్రాజెక్టుకు తీసుకువెళ్లి చూపాలని చీఫ్ ఇంజనీర్ హరిరాంను మంత్రి ఆదేశించారు.

నెహాల్‌కు రెండేళ్ల రెండు నెలల వయసున్నప్పుడే ప్రపంచపటంలోని దేశాల పేర్లు, వాటి జాతీయ జెండాలు చెప్పి రికార్డు సృష్టించాడని తండ్రి హనుమంతరావు తెలిపారు. నిహాల్ పేరిట ఇప్పటికే 9 రికార్డులు ఉన్నాయని, ఐక్యు లెవల్స్ ఎక్కువని స్పష్టం చేశారు. బట్టీపట్టించిన జ్ఞానం కాదని, టివి న్యూస్ చూడడం, దినపత్రికల్లో వచ్చిన వార్తలను తాను బిగ్గరగా చదివితే వినడం ద్వారా నిహాల్ జ్ఞాపకం పెట్టుకున్నాడని పేర్కొన్నారు.

కెటిఆర్ అభయం

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్ మాధ్యమాల నుండి కూడా ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు కావాల్సిన చర్యలను ఎన్ఆర్ఐ శాఖ ద్వారా ఒకటి రెండు రోజుల్లోనే సిద్ధం చేస్తుందన్నారు. కువైట్ నుండి తిరిగి వస్తున్న వారికి అవసరం అయిన పూర్తి సహకారం అందించేందుకు ఎన్ఆర్ఐ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కువైట్‌లోని భారత ఎంబసిలో అధికారులతో తెలంగాణ ఎన్ఆర్ఐ శాఖ అధికారులు ఆదివారం మాట్లాడారని, తెలంగాణ కార్మికుల వివరాలను ఎప్పటికప్పుడు ఇక్కడి ఎన్ఆర్ఐ శాఖ అధికారులకు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అవసరం అయితే విదేశాంగ మంత్రి సుష్మ స్వరాజ్ సహకారం కోరతామని కెటిఆర్ పేర్కొన్నారు. కువైట్ క్షమాభిక్షలో భాగంగా దేశానికి రావాల్సిన వారు ఇప్పటికే అక్కడి ఎంబసిని కలుస్తున్నారన్నారు. ఉ

ఇలా కలుస్తున్న వారిలో కనీసం విమాన ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితిలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో బాధ్యత తీసుకుంటుందని, ఎంత మందికి విమాన టిక్కెట్లు అవసరం అవుతాయో, తిరిగి రావడానికి సిద్ధమవుతున్నవారి సంఖ్య ఎంతో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మోడీ భ్రమల పాలన



(మొదటిపేజీ తరువాయి)

సందేశాలిచ్చారు. ఈ సందర్భంగా సీతారామ్ ఏచూరి ప్రసంగిస్తూ నల్లగొండలోనే ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిందని, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న ఆర్థిక దోపిడీ, సామాజిక దౌర్జన్యాలకు వ్యతిరేక పోరాటంలో అదే స్ఫూర్తిగా నిలవాలన్నారు. ప్రస్తుతం బిజెపి చెబుతున్న ఏక కాల ఎన్నికలు గతంలో జరిగాయని, అప్పటి పాలకులు తమ స్వార్థప్రయోజనాల కోసం రాజ్యాంగంలోని 356 ఆర్టికల్‌ను ఉపయోగించి కేరళ, పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వాలను రద్దు చేశాయన్నారు. ఆర్టికల్ 356ను రద్దు చేస్తే తప్ప దేశంలో ఏక కాల ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ఆయన అన్నారు.

తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేదలకు కొత్తగా ఎలాంటి మేలు చేయకపోగా పరోక్షంగా పన్నుల రూపంలో భారం మోపిందన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర పెంచుతానని మోడీ నాలుగేళ్ల కిందటే వాగ్దానం చేశారని కానీ అమలు చేయలేదని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతోందని, వీటి నుంచి తప్పించుకునేందుకే వైద్య పథకాన్ని ముందుకు తెచ్చారని విమర్శించారు. రైతులకు రుణ విముక్తి కల్పించడంతో పాటు పంటల కొనుగోలుకు భరోసా కల్పించే కొత్త చట్టం తెస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. కార్పోరేట్ సంస్థలకు దాదాపు రూ.2 లక్షల కోట్ల అప్పులను రద్దు చేసిన ప్రభుత్వం రైతుల విషయంలో ముందుకు రాకపోవడం గర్హనీయమన్నారు.

దేశంలో ఆర్థిక, సామాజిక సంక్షోభం తీవ్రంగా ఉందని, అనేక రంగాల్లో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి కనబడుతోందన్నారు. కాంగ్రెస్ అనుసరించిన విధానాలనే బిజెపి పాలకులు తీవ్రంగా అమలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ ప్రసాదించిన హక్కులను బిజెపి కాలరాస్తోందన్నారు.

బి.వి.రాఘవులు మాట్లాడుతూ బిజెపి పాలన నుంచి విముక్తి కల్పిస్తే తప్ప దేశానికి భవిష్యత్ ఉండదని, ఆ బృహత్తర కర్తవ్యం వామపక్షాలపై ఉందన్నారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రజలకు సిఎం కెసిఆర్ చేసిన వాగ్ధానాల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు కాలేదని, ప్రజలను గారడీ చేయడంలో కెసిఆర్‌ను మించిన వ్యక్తి మరొకరు లేరన్నారు.

రైతుల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా వారి కష్టాలు తీరవన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్య, వైద్య రంగాలను విముక్తి చేసి ప్రజలకు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బహుజన తెలంగాణ సాధన దిశగా ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు.

వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల బలోపేతం అవశ్యం

దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు బలోపేతం కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ(ఎం) ప్రతినిధుల సభలో వక్తలు అన్నారు. సీతారాం ఏచూరి మాట్లాడుతూ వామపక్ష ప్రత్యమ్నాయమే దేశానికి మార్గమని, వామపక్ష పార్టీలు బలపడటం ద్వారా మతోన్మాద శక్తులను బలహీనపర్చాలన్నారు. ఆర్థిక దోపిడికి, సామాజిక దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని, ఇది వర్గ పోరాటానికి అనుకూల పరిస్థితి అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య శక్తులను కలుపుకొని ప్రత్యమ్నాయ ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వామపక్ష, అభ్యుధయ భావజాలం కలిగిన వారిపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య విలువలను మంటగలిపే చర్యలను, పార్టీ ఫిరాయింపులను ప్రతిఘటించాలన్నారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో వామపక్ష ఐక్యతను పెంపొందించుకుంటూ లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కలిసి విశాల వేదికను నిర్మించడం ద్వారా రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని ఆయన అన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడా సిఎం కెసిఆర్ లాంటి అప్రజాస్వామిక, ఏకపక్ష నియంతృత్వ పోకడలు కలిగిన సిఎం లేరన్నారు.

తాండ్ర కుమార్ మాట్లాడుతూ వామపక్షాల ఐక్యతను బలోపేతం చేయాల్సిన బాధ్యత, బడుగు, బలహీన వర్గాల ప్రజల దారిచూపే బాధ్యత సిపిఐ, సిపిఐ(ఎం)పైనే ఉందన్నారు. జె.జానకిరాములు మాట్లాడుతూ వామపక్షాల ఐక్యతకు ఇప్పుడు సానుకూల పరిస్థితి ఏర్పడిందన్నారు. బండా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత ద్వారానే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. రాజేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న టిఆర్ఎస్ ఫాసిస్టు నిరంకుశ పాలనను ఎండగట్టడంలో వామపక్ష, లౌకిక శక్తులు ముందుండాలన్నారు. సిహెచ్.మురహరి మాట్లాడుతూ నూతన సరళీకరణ ఆర్థిక విధానాలను కాంగ్రెస్ కంటే వేగంగా బిజెపి పాలకులు అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆయన విమర్శించారు.



అవినీతిపై కెసిఆర్‌తో చర్చకు సిద్ధం: నాగం

మనతెలంగాణ / నాగర్‌కర్నూల్ ప్రతినిధి : తన సవాల్ ముఖ్యమంత్రి కెసిఆర్‌తోనని కెసిఆర్ అవినీతిని బయట పెట్టేంతవరకు వదిలి పెట్టేది లేదని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డ్ స్థల వివాదంలో రూ.50లక్షలకు సెటిల్ మెంటు చేస్తానంటూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఈ మూడున్నర సంవత్సరాలలో దాని ధరను మూడున్నర కోట్లకు పెంచి సెటిల్‌మెంటు చేసి సంతకం చేసినన విషయంలో,వ్యాపారులు మార్కెట్ యార్డు స్థలంకోసం కొనుగోలు చేసి ఇచ్చిన స్థలాన్ని తన అనుయాయుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం దారి వదిలిన విషయంలో ఉన్న ఆధారాలతో సహా తాను ఆరోపణలు చేస్తే దానికి సమాధానం ఇవ్వకుండా ఆలయం వద్ద రాజకీయం చేద్దాం రమ్మంటూ సవాలు చేయడం సరికాదన్నారు. తాను చేసిన ఆరోపణలకు తన వద్ద ఆధారాలున్నాయని కూడా నాగం పునరుద్ఘాటించారు. తన సవాలు కెసిఆర్ ,ఆయన ప్రభుత్వం చేస్తున్న అవినీతిని బయట పెట్టడం పైనే నని దీనికి సంబందించిన అన్ని డాక్యుమెంట్లతో తాను వస్తానని స్థలం ఎక్కడో ముఖ్యమంత్రి నిర్ణయించి పిలిస్తే ఒక్కో డాక్యుమెంటు ముందు పెడతానన్నారు.

పథకాలకు ప్రజల ప్రశంసలు

- శాసనమండలి చైర్మన్ కె. స్వామిగౌడ్ వెల్లడి

మన తెలంగాణ/ చౌటుప్పల్ : తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ప్రశంసలందుకుంటున్నాయని శాసనమండలి చైర్మన్ కె. స్వామిగౌడ్ తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు మండలంలో ఆదివారం జరిగే ఒక శుభకార్యానికి వెళుతోన్న స్వామిగౌడ్ చౌటుప్పల్‌లో కొద్ది సేపు ఆగారు. శాసనమండలి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా చౌటుప్పల్‌కు వచ్చిన స్వామిగౌడ్‌ను టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనం గా స్వాగతించారు. ఈ సందర్భంగా టిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి సైదులుగౌడ్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం ఆయ న విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తెల ంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజాదరణ పొందుతున్నాయని తెలిపారు. అంతరించి పోతున్న కులవృత్తులకు తమ ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ఇందులో భాగంగానే గొల్ల కురుమలు, బ్రాహ్మణులు, చాకలి, మంగలి, గౌడ, పద్మశాలి కులస్థులకు చే యూతనిచ్చే



కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. ఇందు కోసం కెసిఆర్ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో ఒక అడుగు ముందుకు వేశారని తెలిపారు. తెలంగాణ ప్రజలకు తమ ప్రభుత్వం చేయాల్సిన మంచి ప నులు ఇంకా చాలా ఉన్నాయన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలతో తెలంగాణ మొత్తం సస్యశ్యామలం అవుతుందన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం ధైర్యం చేసి అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడం దేశానికే గర్వ కారణమన్నారు. తెలంగాణలోని యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉత్పాదక శక్తిగా ఎదగాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం అనేక వినూత్న పథకాలకు రూపకల్పన చేస్తోందని స్వామిగౌడ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని యువత ప్రభుత్వం నుంచి ఉద్యోగాలు కావాలని అడగడం మానేసి ప్రభుత్వానికి తామేమి ఇవ్వాలో చెప్పండి అనే రోజులు రాబోతున్నాయని జోస్యం చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ముప్పిడి సైదులుగౌడ్, ముత్యాల భూపాల్‌రెడ్డి, మహ్మద్ బాబాషరీఫ్, పబ్బు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జర్మనీలో కాళేశ్వరం బృందం

మన తెలంగాణ/ ధర్మారం : కాళేశ్వరం ప్రాజెక్టు అత్యాధునిక పరికరాల కొనుగోలు నిమిత్తం పరిశీలన కోసం సీనియర్ ఇంజినీర్ల బృందం జర్మనీ చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పెంటా రెడ్డి, సీనియర్ కాళేశ్వరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్, ఆరవ ప్యాకెజీ నవయుగ ఎజిఎం శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బృందం జర్మని చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పరికరాలను నాణ్యతా పరంగా పరిశీలించి సీనియర్ ఇంజనీర్ల బృందం అనుమతి ఇవ్వగానే కొనుగోలు చేసి మేడారానికి తరలిస్తారు. ఈ బృందం ఈ నెల 7వ తేదీన స్వదేశానికి చేరుకుంటుందని ఇఇ నూనె శ్రీధర్ తెలిపారు.

ఏడుపాయలకు పోటెత్తిన భక్తజనం

మన తెలంగాణ/ మెదక్/పాపన్నపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానిమాత ఆలయానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గా భవానిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు ఎ లాంటి ఇబ్బందులకు కలుగకుండా ఇఒ వెంకటకిషన్‌రావు తగిన ఏర్పాట్లు కల్పించారు. ఆలయ సిబ్బంది జెన్న రవికుమార్, సిద్దిపేట శ్రీనివాస్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, పాలక మండలి సభ్యులు ఆలయానికి వచ్చిన భక్తులకు సేవలందించారు.

వేగంగా బొడ్డుపల్లి హత్య కేసు దర్యాప్తు

మన తెలంగాణ/ నల్లగొండ టౌన్ : బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో వస్తున్న ఆరోపణలపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు నల్లగొండ ఎస్‌పి శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నింధితులను కోర్టు అనుమతితో పోలీసు కస్టడీకి తీసుకోవడంతో పాటు కాల్‌డేటాలోని అనుమానితుందరినీ విచారించడం జరుగుతుందని, శ్రీనివాస్ హత్య కేసు దర్యాప్తు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా జరుగుతుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

బెదిరించి బాలికపై అత్యాచారం

9 మంది నిందితుల్లో ఆరుగురు అరెస్టు

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో దారుణ ఘటన వెలుగు చూసింది. సంవత్సర కాలంగా ఫొటోలు, విడియోలతో బ్లాక్‌మెయిల్‌కు పా ల్పడుతూ ఓ మైనర్ బాలికపై 9 మంది వేర్వురుగా అత్యాచారం చేశారు. ముంబయిలోని సర్బన్ విలే పార్లేలో జరిగిన ఈ ఘటనల్లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సబర్బన్ రోడ్ ప్రాంతంలో నివసించే 15 ఏళ్ల మైనర్ బాలికపై పొరుగునే ఉండే 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సున్న 9 మంది నిందితులు అత్యాచారానికి పాల్పడినట్లు ఓ సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు. సంవత్సరం క్రితం నిందితుల్లో ఒకడు బాధితురాలను రేప్ చేసి ఆ చిత్రాలను, విడియోలను తీసాడన్నారు. వాటిని అడ్డం పెట్టుకొని మిగత నిందితులు ఆమెను సంవత్సర కాలంగా వివిధ సందర్భాల్లో రేప్ చేశారన్నారు. అయితే విషయాన్ని మైనర్ బాలిక తల్లికి చెప్పడంతో, ఆమె తల్లి విలే పార్లే స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విషయం బయటకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నిందితులపై ఐపిసి 376 సెక్షన్, పోస్కో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కేసుపై దర్యాప్తు చేపట్టి శనివారం రాత్రి ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అయితే రేప్‌కు సంబంధించిన ఫొటోలు, విడియోలను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకావాల్సి ఉందన్నారు.

ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం

మన తెలంగాణ/ శంషాబాద్(రంగారెడ్డి జిల్లా) : ఓ వ్యక్తి అక్రమంగా బుల్లెట్ కల్గి ఉన్న సంఘటన ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. ఆర్‌జిఐఏ ఎస్సై ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన వైభవ్ కుమార్ ఆదివారం ఉదయం 6గంటల 55నిమిషాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి గొవాకు గోఎయిర్‌లైన్ జి8661లో గొవాకు బయలుదేరాడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అధికారులు అయితే బ్యాగేజ్ చేకింగ్ చేస్తుండగా అతని లాగేజిలో లైవ్ 7.65ఎమ్ఎమ్ బూల్లెట్ ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. అక్కడే డ్యూటీ చేస్తున్న కిరాణ్‌కుమార్ అతని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద బుల్లెట్‌కు సంబంధించిన ఏలాంటి డాక్యుమెంట్లు లేవాన్నారు. దీంతో మధ్యహ్నం 2గంటల సమయంలో ఆర్‌జిఐఏ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై విద్యార్థిని ఆత్మహత్య



మన తెలంగాణ / షాపూర్‌నగర్ : ప్రేమించిన యువకుడు మోసగించాడని మనస్థాపానికి గురైన ఎంటెక్ విద్యార్థిని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కు త్బుల్లాపూర్ చెరుకుపల్లి కాలనీలో నివాసం ఉండే జయలక్ష్మికి ముగ్గు రు కుమార్తెలున్నారు. భర్త కొద్ది కాలం క్రితమే కాలం చేయడంతో తల్లి జయలక్ష్మి కాయా కష్టం చేసి కాపురాన్ని పోషిస్తూ పిల్లల్ని చదివిస్తుంది. జయలక్ష్మి పెద్ద కుమార్తె చైతన్య(27) తమిళనాడులో ఎంటెక్ చదువుతుండగా కిషోర్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో కొద్దినెలలుగా ప్రేమ విషయం తన చెల్లెళ్లకు తెలిసింది. ఈ క్రమంలో అక్క చైతన్యను ప్రేమిస్తున్నట్టు నటించిన కిషోర్ అదే సమయంలో చైతన్య చెల్లిని కూడా ప్రేమలోకి దించా డు. కొద్ది రోజులుగా రహస్యంగా సాగిన కిషోర్ చాటు ప్రేమాయణం ఎట్టకేలకు చైతన్యకు తెలిసింది. దీంతో నగరానికి వచ్చిన చైతన్య విషయాన్ని తల్లికి చెప్పలేక ఇటు చెల్లెను మందలించలేక తీవ్ర మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో వారు సినిమాకు వెల్లడంతో తాను చనిపోతున్నాని తను ప్రేమించిన కిషోర్ తనను మోసగించాడని తనకు తెలియకుండా తన చెల్లెలుతో ఫోన్లో మాట్లాడుతున్నట్లు గుర్తించి సూసైడ్ చేసుకుంటున్నట్లు రాసి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సినిమా నుంచి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు చైతన్య ఎంతకి తలుపులు తెరవకపోవడంతో కిటికిలో నుంచి చూశారు. దీంతో ఆమె ఫ్యాన్‌కు వేలాడడంతో విషయా న్ని స్థానికులకు తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్న సిఐ శంకర్ రెడ్డి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. సూసైడ్ ఆధారంగా కిషోర్‌పై కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేణుగోపాల స్వామి విగ్రహాల దొంగలు దొరికారు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : పంచలోహ విగ్రహాలనే లక్ష్యంగా చేసుకున్న అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులు ఇద్దరిని నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టుచేశారు. వారి నుండి రూ. 3 కోట్లు విలువ చేసే పంచలోహ విగ్రహాలు మూడింటిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బల్కి ప్రాంతానికి చెందిన షేక్ హైదర్, షేక్ అజీజ్ అనే ఇద్దరు నిందితులు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పంచలోహ విగ్రహాలను చోరీచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ క్రమంలోనే గత ఏడాది అక్టోబర్‌లో ఔరంగబాద్ జిల్లా హింగోలి పోలీసు స్టేషన్ పరిధిలో మహావీర్ జైన్ పంచలోహ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అనంతరం లాథూర్ జిల్లా కిల్లారి ప్రాంతంలోని కేథార్‌నాథ్ పంచలోహ విగ్రహాన్ని చోరీ చేశారు. పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తిరుగుతున్నారు. వీరిని బీదర్ బల్కి ముఠాగా పిలుస్తున్నారు. అయితే, గత నెల జనవరి 28న నగర పోలీసులకు కామారెడ్డి జిల్లా పోలీసులు ఒక సమాచారమిచ్చారు. కామారెడ్డిలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉత్సవ ఉగ్రహాలు చోరీ అయ్యాయి. వేణుగోపాల స్వామి, రుక్మిణి, సత్యభామలకు చెందిన మూడు పంచలోహ విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళినట్టు వెల్లడించడంతో పాటు కొంత సమాచారాన్ని వారు నగర పోలీసులకు అందించారు. దీంతో కామారెడ్డి, నగర పోలీసులు కలిసి సంయుక్తంగా పంచలోహ విగ్రహాల చోరీపై దర్యాప్తును ప్రారంభించారు.

రూ. 3 కోట్లు విలువ..

కామారెడ్డిలో చోరీకి గురైన 3 పంచలోహ విగ్రహాలు సుమారు రూ. 3 కోట్లు విలువచేస్తాయని కమిషనర్ శ్రీనివాస్ రావు వెల్లడించారు. ఇవి సుమారు 600– 700 ఏళ్ళనాటివి. వీటిల్లో బంగారం లేదా వెండి వంటి విలువైనవి ఉన్నాయి. కాగా నిందితులైన హైదర్, అజీజ్‌లు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పంచలోహ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని అన్వేషణ చేస్తారు. ముందుగా వీరు తమ వాహనాల్లో లేదా బస్సుల్లో ప్రయాణం చేస్తూ పంచలోహ విగ్రహాలున్న ప్రదేశాల్లో రెక్కీ నిర్వహిస్తారు. అనంతరం చిన్నచిన్న ఇనుప రాడ్లు లేదా కడ్డీలను తీసుకుని రాత్రివేళల్లో ఆ ప్రదేశాలకు చేరుకుని విగ్రహాలు ఉన్నగది తాళాలను పగులగొట్టి చోరీ చేస్తారు. అక్రమంలోనే ఔరంగాబాద్, లాథూర్ ప్రాంతంలో రెండు విగ్రహాలను చోరీచేసి హైదరాబాద్ నగరానికి వచ్చి విక్రయించినట్టు భావిస్తున్నామని కమిషనర్ తెలిపారు. దేశంలో ఎక్కడ పంచలోహ విగ్రహాలను చోరీ చేసినా వీరు నేరుగా నగరానికి చేరుకుని కొనుగోలుదారులను పిలిచి విక్రయాలు చేస్తున్నట్టు విచారణలో వెల్లడైందని కమిషనర్ తెలిపారు. తదుపరి విచారణలో వీరి నుండి ఎవరు విగ్రహాలను ఖరీదు చేస్తున్నారు. వారికి సమాచారమెలా ఇస్తున్నారు..? అనే కోణంలో దర్యాప్తు చేస్తామన్నారు.

బిజెపిలో ఇమడలేకపోతున్నా

మన తెలంగాణ/ హైదరాబాద్: తనకు పార్టీలో సముచిత స్థానం లేదని, న్యాయం జరగడంలేదని, బిజెపిలో తాను ఇమడలేకపోతున్నానని, అందుకే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్ ప్రకటించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలు గొప్పవేనని, అయితే కరీంనగర్ జిల్లా బిజెపి రాజకీయాలు తనను తీవ్రంగా బాధించాయని, అక్కడి పరిస్థితులను చెప్పుకునేందుకు తాను కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యాలయానికి వస్తే తనకు న్యాయం జరగకపోగా అవమానం జరిగిందని వాపోయారు. ఇక నుంచి తాను హిందూ ధర్మం కోసం పనిచేస్తానన్నారు. కాగా అంతకుముందు రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మ ణ్‌ను కలిశారు.

నేడు పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి 7వ తేదీన ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌కు రానున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్య నేతలతో కీలక సమావేశం జరుగనుంది. గత రెండేళ్లుగా ఎక్కువ కాలం చంద్రబాబునాయుడు అమరావతిలోనే ఉంటున్నారు. అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ పరిపాలన, రాజకీయాలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి సమయం ఇవ్వాలని ఎంతగా కోరినా, ఎప్పుడో ఒకసారి తప్పితే నేతలకు సమయం ఇవ్వడం లేదు. టిడిపి, బిజెపి పొత్తుపై వారితో చర్చించనున్నారు.

కీసర బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

- నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ ఎంవి రెడ్డి
- 20 కమిటీలతో ఏర్పాట్ల పర్యవేక్షణ

మనతెలంగాణ / కీసర : ప్రముఖ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలలో ప్రముఖులతో పాటు లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది. ముఖ్యమంత్రి కెసిఆర్ కీసరగుట్టకు విచ్చేసే అవకాశం ఉండటంతో జిల్లా కలెక్టర్ ఎంవి రెడ్డి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతరలో సమన్వయంతో పనిచేసేలా వివిధ శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పలు దఫాలుగా అధికారులతో సమన్వయ సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్‌ను బ్రహ్మోత్సవాల కన్వీనర్‌గా నియమించి, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు 20 కమిటీలను ఏర్పాటు చేశారు. కీసరగుట్టలో ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో సుమారు లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారనే అంచనాతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిడుగు పా టుతో దెబ్బ తిన్న ప్రధాన రాజగోపురానికి మరమ్మతులు చేప ట్టి రంగులతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లను సిద్ధం చేస్తున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు సేద తీరేందుకు ఎగువ కొండపై విశాలంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆర్



డబ్ల్యూఎస్, ఎచ్ఎండబ్ల్యూఎస్ సంయుక్తంగా మంచినీటి సరఫరా కోసం ట్యాంకులకు మరమ్మతులు చేపట్టారు. జాతర జరుగు ప్రాంతాలలో అదనంగా సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన మరుగు దొడ్లకు మరమ్మతులు చేపట్టి, మరిన్ని తాత్కాలిక మరుగు దొడ్లు, వంద వరకు స్నానపు గదులు సిద్ధం చేస్తున్నారు. కీసర ఓఆర్‌ఆర్ జంక్షన్ నుంచి కీసరగుట్ట వరకు ప్రధాన రహదారిలో పిచ్చి మొక్కలను తొలగించి చదును చేశారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



మనతెలంగాణ/ నర్సింహులపేట (వరంగల్ జిల్లా) : పౌర సరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని డివిస్‌పి రాజరాత్నం స్పష్టం చేశారు. ఆదివారం నర్సింహులపేట శివారు ఎర్రలచ్చయ్యగూడెం శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఉదయం 6 గంటల ప్రాంతంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు తొర్రూరు సిఐ చేరాలు, స్థానిక ఎస్ఐ సిహెచ్.నగేష్‌కు ఎర్ర లచ్చయ్యగూడెం శివారులోని గండి రఘుపతికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో సిబ్బందిలో కలసి పరిశీలించగా దాదా పు 400 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారని ఈ బియ్యం 200 క్వింటాల బియ్యం ఉన్నాయని, దీనికి సంబంధించిన గుర్తు తెలియని వ్యక్తులు ఎవరనేది దర్యాప్తు చేసి పూర్తి వివరాలు త్వరలోనే తెలుపుతామని ఆయన అన్నారు. ఈ బియ్యాన్ని రెవెన్యూశాఖకు అప్పగించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వారు పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ చేరాలు, ఎస్ఐ సిహెచ్.నగేష్, డిటి నారయణరెడ్డి, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు

- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

మన తెలంగాణ/ కమలాపూర్(మర్రిపెల్లిగూడెం)(వరంగల్ అర్బన్): గ్రామాల్లోని ఏ ఒక్క నిరుపేద కుటుంబం బిక్కుబిక్కుమంటూ గుడిసెల్లో ఉండకూడదనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని ప్రతి నిరుపేదకు డబుల్ బెడ్ రూం ఇళ్ళు అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు.ఆదివారం మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాలకు మంత్రి ఈటల శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఎస్‌సి కాలనీలో 30, బిసీ కాలనీలో 30 డబుల్ బెడ్ రూం ఇళ్ళు మొదటి దశలో మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ పేదల ఇళ్ళ స్థలాల కోసం పట్టాలు అందజేసే కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలంతా డబుల్ ఇళ్ళ నిర్మాణాలకు సహకరిస్తూ తోడ్పాటును అందించాలని కోరారు. కమలాపూర్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లాండిగే లక్ష్మ ణ్ రావు, జడ్పిటీసి మారపెల్లి నవీన్ కుమార్,సింగిల్‌విండో చైర్మన్ పేరాల సంపత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోటి వరాల పథకంలో భాగంగా ఇళ్ళ స్థలాల కొరకు భూములు అమ్మిన బాధితులకు ఇంకా డబ్బులు అందలేదని వెంటనే నిరుపేద కుటుంబాలకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేసారు. దీనికి మంత్రి ఈటల స్పందించి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత బలి

- కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన
- బంధువుల ఆందోళన

మన తెలంగాణ/ ధర్మారం : ప్రసవం కోసం వెళ్ళిన ఓ మహిళ సాక్షాత్తు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం ధర్మారం మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అనిత (30) ప్రసవం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో చేరింది. శనివారం రాత్రి ఆడ శిశువుకు జన్మనివ్వగా బాలింత అనిత మృతి చెందింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే అనిత మృతి చెందిందని భర్త కుమ్మరి బాపుతో పాటు కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. కేసు నమోదు చేసిన పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి అనితకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆదివారం శవ



పరీక్ష అనంతరం మల్లాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. భర్త, చిన్నారులు, కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సర్పంచ్ గందం మల్లయ్య, ఎంపిటిసి గందం మహేందర్ కోరారు. విషయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు.

పీడితుల పక్షాన కలమెత్తిన యోధుడు మఖ్దూం

మన తెలంగాణ / హైదరాబాద్/ముషీరాబాద్ : ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తిన యోధుడు మఖ్దూం మొహియుద్దీన్ అని, ఆయన జీవితాన్ని నేటి యువ కమ్యూనిస్టులు స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మిక నాయకుడు ప్రముఖ ఉర్దూ కవి మఖ్దూం మొహియుద్దీన్ 110వ జయంతి సందర్భంగా సిపిఐ హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి ఇటి.నరసింహా అధ్యక్షతన ట్యాంక్‌బండ్‌పై జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు విఎస్.బోస్, కందిమళ్ల ప్రతాపరెడ్డిలు మొహియుద్దీన్ విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద, సామాన్య కుటుంబంలో పుట్టిన మఖ్దూం మొహియుద్దీన్ హైదరాబాద్ సంస్థానంలో నిజాం నియంతృత్వ పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయడానికి అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టు నిర్మాతలలో ఒకరైన మఖ్దూం మొహియుద్దీన్ సిపిఐ నాయకుడే గాక, కవిగా, నాటక రచయితగా పేరు సంపాదించుకున్నారన్నారు. మఖ్దూం మొహియుద్దీన్ రచించిన గజల్‌లు, పా ట్యాంశాల్లో, సినిమాల్లో ఉపయోగించారన్నారు. తుది శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాడన్నారు.



ఎమినెంట్ 5 బ్యానర్ తొలి చిత్రంలో...



తొలి చిత్రం 'లాహిరి లాహిరి'తో మంచి హిట్‌ను అందుకున్న కథానాయకుడు ఆదిత్య ఓమ్. వైవిఎస్ చౌధరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అతను నందమూరి హరికృష్ణ, భానుప్రియలతో కలిసి పనిచేసి మంచి పేరుతెచ్చుకున్నాడు. ఇప్పటివరకు 25కి పైగా సినిమాలు చేసిన ఆదిత్య ఓం చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. తెలుగు, తమిళ్, హిందీ, ఇంగ్లీష్ చిత్రాల్లో నటించి విలక్షణ నటుడిగా రాణించాడు. ప్రస్తుతం ఎస్ఆర్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఎమినెంట్ 5 ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే నూతన నిర్మాణ సంస్థ హీరో ఆదిత్య ఓంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. ఎన్నో చిత్రాలకు రచయితగా, సహ దర్శకునిగా పనిచేసిన రాఘవ తిరువాయిపాటి ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయమవుతున్నాడు. ఎమినెంట్ 5 ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నం.1 చిత్రంగా ఇది తెరకెక్కనుంది. ఈ నెలాఖరు నుండి షూటింగ్ జరుపుకోబోయే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను రాకేష్ గోవర్ధన్ గిరి అందించగా మధుసూదన్ సినిమాటోగ్రాఫర్‌గా చేయనున్నాడు.

పంతం పట్టిన గోపీచంద్


గోపీచంద్

ఆంధ్రుడు, యజ్ఞం, లక్ష్యం, శౌర్యం, లౌక్యం వంటి సూపర్‌డూపర్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన గోపీచంద్ కథానాయకుడిగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది గోపీచంద్ 25వ చిత్రం కావడం విశేషం. దీనికి 'పంతం' అనే టైటిల్‌ను నిర్ణయించారు. 'ఫర్ ఎ కాస్' అనేది ఉపశీర్షిక. బలుపు, పవర్, జై లవ కుశ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించిన కె.చక్రవర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మే 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ ''మా సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌లో గోపీచంద్ 25వ సినిమా చేయడం హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు 'పంతం' అనే టైటిల్‌ను నిర్ణయించాం. అనుకున్న ప్రణాళిక ప్రకారం చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పటికే ఒక పాట, కొంత టాకీ పార్ట్ పూర్తయ్యింది. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలను హైదరాబాద్‌లోని అల్యూమినియమ్ ఫ్యాక్టరీలో చిత్రీకరించాం. మంచి సందేశంతో పాటు కమర్షియల్ హంగులతో దర్శకుడు చక్రి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. హీరో గోపీచంద్ క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన ఎందుకోసం పంతం పట్టాడు... ఆ కారణమేంటనేది తెలుసుకోవాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి సినిమాను మే 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. గోపీచంద్, మెహరీన్, పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు నటించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ప్రసాద్ మూరెళ్ల, మ్యూజిక్ః గోపీసుందర్, డైలాగ్స్ః రమేష్ రెడ్డి.



వెంకీ అట్లూరి, వరుణ్‌తేజ్, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, దిల్‌రాజు, రాశిఖన్నా

అదే ఫ్రెష్‌నెస్‌తో తొలిప్రేమ

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మితమైన చిత్రం 'తొలిప్రేమ'. రాశిఖన్నా హీరోయిన్‌గా నటించింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమాను ఈనెల 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎమ్మెల్యే రాధాకృష్ణ, వరుణ్‌తేజ్, రాశిఖన్నా, వెంకీ అట్లూరి, హైపర్ ఆది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''రిలీజ్ చేసేది దిల్‌రాజు అయితే... సినిమాను నిర్మించింది మాత్ర బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్. జీవితం ఓ సర్కిల్ అని వినే ఉంటాం. నా జీవితంలో అలాగే జరుగుతోంది. గతంలో తొలిప్రేమ సినిమాను చూసినప్పుడు ప్రేక్షకులకు ఓ ఫ్రెష్‌నెస్ ఎలా కలిగిందో... అలాంటి ఫ్రెష్‌నెస్‌తో ఈ సినిమాను మేం చేశాం. ప్రేక్షకులకు ఈ సినిమా బాగా నచ్చుతుంది''అని అన్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ''33 సంవత్సరాల క్రితం మెగాస్టార్ చిరంజీవితో సినిమా తీయాలని తణుకు నుండి మద్రాస్ వెళ్లాను. ఆతర్వాత బన్నీతో ఆర్య 2, రామ్‌చరణ్‌తో మగధీర, పవన్‌కళ్యాణ్‌తో అత్తారింటికి దారేది సినిమాలు చేసే అవకాశం దక్కింది. ఇప్పుడు వరుణ్‌తేజ్‌తో తొలిప్రేమ సినిమా చేశాం. గ్యారంటీగా సినిమా పెద్ద హిట్ అవుతుంది''అని చెప్పారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''అప్పుడు 1998లో తొలిప్రేమకు నేనే డిస్ట్రిబ్యూటర్‌ను... ఇప్పుడు 2018లో తొలిప్రేమకు కూడా నేనే డిస్ట్రిబ్యూటర్‌ని. ఆ తొలిప్రేమ యూత్ ఫిలిం ఎలా అయ్యిందో... ఈ సినిమా కూడా వంద శాతం అలాంటి యూత్ ఫిలిం అవుతుంది. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఇది. వరుణ్‌కు ఫిదా చిత్రం తర్వాత ఈ సినిమా రావడం ప్లస్ అవుతుంది. ఫిబ్రవరి 10న తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం''అని పేర్కొన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''దర్శకుడు వెంకీకి ఇది తొలి చిత్రమే అయినా ఎంతో చక్కగా తెరకెక్కించాడు. తను భవిష్యత్తులో పెద్ద దర్శకుడు అవుతాడు. ఈ సినిమాను అందరికంటే ఎక్కువగా నమ్మింది దిల్‌రాజే. ఇక బాపినీడు, ప్రసాద్ ఈ సినిమాను అద్భుతంగా నిర్మించారు. మా ఫ్యామిలీకి చెందిన తేజు సినిమా 'ఇంటిలిజెంట్' ఈనెల 9న, నా సినిమా ఈనెల 10న విడుదలవుతుంది. మా మధ్య పోటీ లేదు. నా సినిమా ఎంత పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నానో... తేజు సినిమా కూడా అంతే సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు.

రేపటి నుంచి 'ఛలో' సక్సెస్ టూర్



గౌతమ్, నాగశౌర్య, రష్మిక మండన్నా, ఉషా ముల్పూరి, శంకర్ ప్రసాద్, వెంకి కుడుముల

నాగశౌర్య హీరోగా రష్మిక మండన్నా హీరోయిన్‌గా ఐరా క్రియేషన్స్ పతాకంపై వెంకి కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఛలో'. శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం తాజాగా విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో థాంక్స్‌మీట్‌ను నిర్వహించింది చిత్ర బృందం. ఈ కార్యక్రమంలో దర్శకుడు వెంకి కుడుముల మాట్లాడుతూ ''నాగశౌర్య నన్ను నమ్మి ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశమిచ్చారు. తమ సొంత ప్రొడక్షన్‌లో ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం చేశారు. నిర్మాతలు శంకర్‌ప్రసాద్, ఉషా ముల్పూరి సహకారం మరువలేనిది. సినిమాలో నాగశౌర్య, రష్మిక అద్భుతంగా నటించారు. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది''అని అన్నారు. హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''సినిమా పెద్ద సక్సెస్ అయింది. ఈ చిత్రం నాకు ఓ ఎమోషనల్ జర్నీ. ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధిస్తుందని అనుకోలేదు. ఈ సినిమా కోసం నేను, హీరోయిన్ రష్మిక, దర్శకుడు వెంకి, మా అమ్మానాన్నలతో పాటు సినిమా టీమ్ అంతా బాగా కష్టపడింది. ఈ సినిమా ఇచ్చిన ధైర్యంతో మా బ్యానర్‌లో రెండు, మూడు సినిమాలు చేయగలమన్న నమ్మకం ఏర్పడింది. మంగళవారం నుండి సినిమా సక్సెస్ టూర్‌ను ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించనున్నాం. మా సినిమాను, మమ్మల్ని ప్రోత్సహించిన చిరంజీవికి ప్రత్యేక ధన్యవాదాలు''అని అన్నారు. ఈ కార్యక్రమంలో రష్మిక మండన్నా, శంకర్‌ప్రసాద్ ముల్పూరి, ఉషా ముల్పూరి, గౌతమ్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.

నయా సినిమా షురూ

శర్వానంద్, సాయి పల్లవి జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న చిత్రం కోల్‌కతాలో ప్రారంభమైంది. ఈ భారీ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి జయకృష్ణ ఛాయాగ్రాహకునిగా చేస్తున్నారు. సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి తమ ప్రొడక్షన్ నం.1గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''వరుస విజయాలతో దూసుకుపోతున్న శర్వానంద్, సాయి పల్లవి జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి టాలెంటెడ్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. కోల్‌కత్తాలో భారీ షెడ్యూల్ కొనసాగనుంది''అని చెప్పారు. ఈ సినిమాలో శర్వానంద్‌ను దర్శకుడు హను కొత్త లుక్‌లో చూపించబోతున్నారు.


శర్వానంద్

లక్కీ హీరోకు జోడీగా కాజల్


కాజల్

టాలీవుడ్‌లో మోస్ట్ లక్కీ యూత్ హీరో ఎవరంటే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అనే చెప్పాలి. చేసింది మూడు సినిమాలే అయినా భారీ బడ్జెట్ పెడుతున్న నిర్మాతలు, క్రేజీగా అనిపించే కాంబినేషన్లు వెరసి హిట్, ఫ్లాప్ అని సంబంధం లేకుండా ఛాన్సులు కొట్టేస్తున్నాడు శ్రీనివాస్. ప్రస్తుతం అతను శ్రీవాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సాక్ష్యం' సినిమా చేస్తున్నాడు. ఇందులో అతనికి జోడీగా హాట్ బ్యూటీ పూజాహెగ్డే నటిస్తోంది. ఈ చిత్రం వేసవిలో విడుదలకానుంది. దీని తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ మరో రెండు సినిమాలను లైన్‌లో పెట్టేశాడు. 'రాజుగారి గది 2'తో మంచి సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఓంకార్‌తో క్రీడల నేపథ్యంలో ఓ సినిమా దాదాపు ఓకే అయినట్టేనని తెలిసింది. దీంతో పాటు కొత్త దర్శకుడు నానీతో ఓ సినిమా చేయబోతున్నాడు సాయి శ్రీనివాస్. ఇందులో హీరోయిన్‌గా కాజల్ అగర్వాల్ నటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. కథ విన్న వెంటనే నచ్చిందని చెప్పిందట ఈ భామ. ప్రాధాన్యం ఉన్న హీరోయిన్ పాత్ర కావడంతో ఆమె ఈ సినిమాకు ఓకే చెప్పిందట. గత ఏడాది ఖైదీ నంబర్ 150, నేనే రాజు నేనే మంత్రి చిత్రాలతో ఘన విజయాలను అందుకున్న కాజల్ ప్రస్తుతం తనకు నచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది. ప్రస్తుతం కళ్యాణ్‌రామ్‌తో 'ఎంఎల్ఏ' చేస్తున్న ఈ భామ తమిళ్ 'క్వీన్' రీమేక్‌లో కూడా నటిస్తోంది.

ఏడుగురు అభాగ్యులకు ఆర్థిక సాయం

నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో 'మనం సైతం' స్వచ్ఛంద సేవా క్యార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. సంస్థ సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుంటున్న ఎంతో మంది నిస్సహాయులు 'మనం సైతం' చెంతకు చేరుతున్నారు. అలా వచ్చిన ఏడుగురు అభాగ్యులకు సంస్థ ఆర్థిక సహాయం అందించింది. హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జయసుధ, డా.బ్రహ్మానందం, హరీష్ శంకర్, సుధీర్‌బాబు, కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ అనారోగ్యం పాలై అండ కోసం ఎదురుచూస్తున్న ఏడుగురికి చెక్‌లను అందజేశారు. అనంతరం 'మనం సైతం' నిర్వాహకులు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ''ఒక్కరితో మొదలైన మా సంస్థ ఈరోజున లక్ష మందికి పైగా సభ్యులతో బలోపేతమవుతోంది. జీవితంలో మనల్ని భగవంతుడు అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నప్పుడు... మనం అభాగ్యులకు సాయమందిస్తే అంతకుమించిన ఆనందం మరొకటి ఉండదు. సంస్థ కార్యక్రమాలను చూసి చిరంజీవి, పవన్‌కళ్యాణ్, కొరటాల శివ, పూరి జగన్నాథ్ తదితరులు ఎందరో స్పందించి ఆర్థిక సహాయం అందించారు''అని అన్నారు. జయసుధ మాట్లాడుతూ ''సేవా కార్యక్రమాలు చేయడం అంత సులువైన విషయం కాదు. ఎంతో పట్టుదల, ఓపిక ఉండాలి. మనం సైతంకు ఓ మంచి బృందం ఉంది. వీళ్లంతా కలిసి కట్టుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు''అని చెప్పారు. డా.బ్రహ్మానందం మాట్లాడుతూ ''దేవుడు కొంతమందిని ఎన్నుకొని వాళ్ల ద్వారా సేవా కార్యక్రమాలను చేయిస్తాడు. అలా కాదంబరి కిరణ్‌ను ఎన్నుకొని 'మనం సైతం' సేవా కార్యక్రమాలను ప్రారంభించాడు. నింగీ నేలా ఉన్నంతకాలం ఈ సంస్థ వెంట నడుస్తాను''అని అన్నారు.


'మనం సైతం' కార్యక్రమంలో జయసుధ, బ్రహ్మానందం, హరీష్ శంకర్, సుధీర్‌బాబు, కాదంబరి కిరణ్.

ఓ ద్వీపంలో 'జిఎస్‌టి' సీక్వెల్!

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ రూపొందించిన 'జిఎస్‌టి'కి మంచి కలెక్షన్‌లే వస్తున్నాయి. పోర్న్‌స్టార్ మియా మల్కోవాతో తెరకెక్కించిన ఈ ఫిలింకు 9 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని తెలిసింది. దీంతో వర్మ ఎంతో సంతోషంగా ఉన్నాడట. ఇప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'జిఎస్‌టి' సీక్వెల్‌కు సిద్ధమైపోయాడు. సెకండ్ పార్టును తీయబోతున్నానని ట్విట్టర్‌లో ప్రకటించేశాడు. ఫస్ట్ పార్టు అంతా ఒక ఇండోర్ సెట్టింగ్‌లో జరిగింది. ఈసారి సెకండ్ పార్టు కోసం మియా మల్కోవాను ఒక ద్వీపానికి తీసుకువెళ్తున్నాడు వర్మ. లొకేషన్ అవుట్‌డోర్ కాబట్టి తన క్రియేటివిటీని ఇంకా బాగా చూపిస్తాడట. అయితే ఏ ద్వీపంలో ఈ ఫిలింను తెరకెక్కించనున్నాడనే విషయాన్ని మాత్రం వర్మ వెల్లడించలేదు.


రామ్‌గోపాల్‌వర్మ, మియా మల్కోవా

సత్తా చాటుతున్న అనుష్క

బ్లాక్‌బస్టర్ హిట్స్ అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి చిత్రాలతో లేడీ సూపర్ స్టార్‌గా తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్న కథానాయిక అనుష్క. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'భాగమతి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. ఈ చిత్రం రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. అమెరికాలో ఈ చిత్రానికి ఊహించని విధంగా స్పందన లభిస్తోంది. ఈ చిత్రం ఏకంగా మిలియన్ డాలర్ల మార్కు వైపు పరుగులు పెడుతోంది. తొలి వారాంతంలో అక్కడ 7 లక్షల డాలర్ల దాకా వసూలు చేసిన 'భాగమతి'.. ఆతర్వాత తన జోరును పెంచింది. ఇప్పటి దాకా ఈ చిత్రం 9.8 లక్షల డాలర్ల దాకా వసూళ్లు రాబట్టింది. ఈ వీకెండ్ ముగిసేసరికి మిలియన్ మార్కును అందుకోవడం ఖాయమైపోయింది. ఇది అనుష్క బాక్సాఫీస్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకోవాలి.


అనుష్క



ఫ్లిప్‌కార్ట్ బిలియన్ నుంచి మేడిన్ ఇండియా పవర్ బ్యాంక్‌లు

న్యూఢిల్లీ: ఇ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ బిలియన్ మేడిన్ ఇండియా పవర్ బ్యాంక్‌లను విడుదల చేసింది. ఇవి 10,000, 15,000 ఎంఎహెచ్ సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఈ రెండు పవర్ బ్యాంక్‌లను మేడిన్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఫ్లిప్‌కార్ట్ తయారు చేసింది. ఈ పవర్‌బ్యాంక్‌లు యూజర్లకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రూ.799, రూ.999 ధరలకు వీటిని కొనుగోలు చేయవచ్చు. 15000 ఎంఎహెచ్ సామర్థ్యం ఉన్న పవర్ బ్యాంక్‌తో 4000 ఎంఎహెచ్ సామర్థ్యం ఉన్న ఫోన్‌ను 2 సార్లు చార్జింగ్ చేయవచ్చు. వీటి ద్వారా వచ్చే పవర్ ఔట్‌పుట్ ఎక్కువగా ఉన్నందున ఫోన్లు వేగంగా చార్జింగ్ అవుతాయి. అలాగే వీటి ద్వారా రెండు డివైస్‌లకు ఏక కాలంలో చార్జింగ్ పెట్టుకోవచ్చు. అందుకు సరిపడా యూఎస్‌బీ పోర్టులను వీటికి ఇచ్చారు. ఇక ఈ పవర్ బ్యాంక్‌లలో ఎంత బ్యాటరీ మిగిలిఉంది, ఎంత చార్జింగ్ అవుతుంది అన్న వివరాలను తెలుసుకునేందుకు వీటిపై ఎల్ఇడి ఇండికేటర్లను ఏర్పాటు చేశారు. ఈ పవర్ బ్యాంక్‌లు చార్జింగ్ అయ్యేటప్పుడు ఓవర్ హీట్‌కు గురి కాకుండా సేఫ్టీ జాగ్రత్తలు ఏర్పాటు చేశారు. కాపర్, బ్లాక్, రోజ్ గోల్డ్ రంగుల్లో విడుదలైన ఈ పవర్ బ్యాంక్‌లను వినియోగదారులు ఫ్లిప్‌కార్ట్ సైట్‌లో కొనుగోలు చేయవచ్చు.

ఎల్‌టిసిజితో ఆదాయం రెట్టింపు

- 2020 ఏడాది నాటికి రూ.40 వేల కోట్ల పన్ను వసూళ్లు
- ఆర్థిక కార్యదర్శి హష్ముఖ్ అధియా



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం(2019–20)లో ఎల్‌టిసిజి(లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్) నుంచి ఆదాయం రెట్టింపు కానుందని ఆర్థిక కార్యదర్శి హష్ముఖ్ అదియా అంచనా వేశారు. ఎల్‌టిసిజి మినహాయింపు తొలగిపోడంతో 2020 సంవత్సరం నాటికి ఈ ఆదాయం రూ.40 వేల కోట్లు కానుందని అన్నారు. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఎల్‌టిసిజి పన్ను మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వేతన జీవులు 30 శాతం ఆదాయం పన్ను చెల్లిస్తే.. స్టాక్‌మార్కెట్‌లో ఎవరైతే భారీగా రాబడిని పొందుతారో వారు ఈ టాక్స్ పరిధిలోకి వస్తారు. 2017–18 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను వచ్చిన ఐటీ రిటర్న్‌లను దాఖలు రూ.3.67 లక్షల కోట్లు లిస్టెట్ షేర్ల నుంచి ఎల్‌టిసిజి కింద పన్ను పరిధి నుంచి మినహాయించారని అధియా తెలిపారు. పన్ను ఎగవేతను నియంత్రించేందుకు షేర్ మార్కెట్‌లో 10 శాతం ఎల్‌టిసిజి పన్నును బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఒక టీవీ చానెల్ ఇంటర్వ్యూలో అధియా మాట్లాడుతూ, 2018 జనవరి 31న స్టాక్ ధరల ఆధారంగా క్యాపిటల్ గెయిన్స్‌ను లెక్కిస్తారు. మినహాయింపు ఇవ్వడం వల్ల తొలి సంవత్సరం 2018–19లో ఎల్‌టిసిజి పన్ను నుంచి రూ.20 వేల కోట్లు పొందనున్నామని, ఆ తర్వాతి సంవత్సరం(2019–20)లో ఈ ఆదాయం రూ.40 వేల కోట్లకు పెరగనుందని ఆయన తెలిపారు.

ఎల్‌టిసిజి పన్ను పరిధిలోకి ఎవరు వస్తారు?

మార్చ్ 31 తర్వాత బుక్ చేసుకున్న లాభాలపై లాంగ్‌టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను చెల్లించాలని బడ్జెట్–2018లో ప్రతిపాదించారు. అంటే మార్చ్ 31 వరకు విక్రయించిన షేర్లకు పన్ను ఉండదని, అప్పటివరకూ ప్రస్తుత చట్టం అమల్లో ఉంటుందని ప్రైస్ వాటర్ కూపర్స్ చెబుతోంది. క్లుప్తంగా చెప్పాలంటే.. మీరు ఏడాది కంటే ఎక్కువగా హోల్డ్ చేసిన షేర్లను మార్చ్ 31లోగా విక్రయిస్తే, ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఫిబ్రవరి, మార్చ్‌లలో హోల్డింగే చసిన షేర్ల విక్రయం చేపట్టినా సరే పన్ను ఉండదు. అయితే ఏప్రిల్ 1నుంచి మాత్రం లాంగ్ టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ అమల్లోకి వస్తుంది. అలాగే, ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1 లక్ష వరకు దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఎలాంటి పన్ను ఉండదు. ఒక సంవత్సరంలో రూ. 1.5 లక్షల దీర్ఘకాలిక లాభం గడిస్తే, అపుడు రూ.1 లక్ష వరకు మినహాయించింది. మిగిలిన రూ. 50వేల లాభంపై రూ. 5వేల పన్నును ఎల్‌టిసిజి పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

ఎల్‌టిసిజి అంటే?



దీర్ఘకాలంలో పొందిన లాభాలపై ఎల్‌టిసిజి (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్) పన్ను విధిస్తారు. రియల్ ఎస్టేట్, షేర్లు, షేర్ వంటి వాటిపై నిర్ణీత కాలవ్యవధిలో పొందిన లాభాలపై వేసే సుంకాన్ని ఎల్‌టిసిజి పన్ను అంటారు. ఆయా ఉత్పత్తుల ఆధారంగా ఎల్‌టిసిజి విభిన్నమైన నిర్వచనాలు ఉన్నాయి. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో షేర్లపై ఎల్‌టిసిజి పన్నును కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. దీని ప్రకారం, ఈక్విటీ మ్యుచువల్ ఫండ్ స్కీమ్‌లను ఏడాదికి మించి కొనసాగించిన అనంతరం పొందే లాభాలు రూ. 1 లక్షకు మించితే అప్పుడు 10 శాతం పన్నును ఎల్‌టిసిజి రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 2004–05లో లాంగ్‌టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం తొలగించారు. మళ్లీ 14 ఏళ్ల తర్వాత దీనిని జైట్లీ ప్రవేశపెట్టారు. స్టాక్‌మార్కెట్‌లో కొనుగోలు చేసిన షేర్లను ఏడాదికి మించి హోల్డింగ్ చేస్తే అప్పుడు లాంగ్‌టెర్మ్‌గా పరిగణిస్తారు. ఎల్‌టిసిజి పన్ను అమలు కంటే ముందే షేర్లను విక్రయించడం ద్వారా లాభాలు ఆర్జించిన వారిని, పన్ను పరిధి నుంచి మినహాయించారు. షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను 2018 జనవరి 31లోపు విక్రయిస్తే, ఆ లాభాలపై ఎల్‌టిసిజి పూర్తిగా మినహాయించారు.

రెండంకెల వృద్ధి రేటు సాధ్యం కాదు

8 శాతం వృద్ధిని సాధిస్తాం: సుభాష్‌చంద్ర గార్గ్



న్యూఢిల్లీ: ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ రెండంకెల ఆర్థిక వృద్ధి రేటును సాధించడం కష్టమేనని ఆర్థిక వ్యవహారాల శాఖ అధికారి సుభాష్‌చంద్ర గార్గ్ పేర్కొన్నారు. అయితే 8 శాతం జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)ని సాధించగలదని అన్నారు. క్రిప్టో కరెన్సీ నిషేధంపై ఇప్పటికే ఏర్పాటు చేసిన కమిటీ చర్యలను ఖరారు చేయనుందని కూడా తెలిపారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ సమావేశంలో ఆర్థికమంత్రి జైట్లీ .. భారత్ 8 శాతం జిడిపి సాధించగలదని అన్నారు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో దేశీయ వృద్ధి రేటు 7.2 నుంచి 7.5 శాతం మధ్య ఉంటుందని అంచనా వేసినట్టు జైట్లీ ప్రకటించారు. తొలి మూడేళ్లలో ప్రభుత్వం సగటున 7.5 శాతంగా వృద్ధిని సాధించగా, దేశీయ ఆర్థిక వ్యవస్థ రూ.2.5 లక్షల కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో భాగంగా వృద్ధి రేటు 7.5 శాతంగా అంచనా వేశామని అన్నారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో ఐదో ఆర్థిక వ్యవస్థగా దేశంగా వృద్ధిని సాధించనుందని జైట్లీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్ఓ) అంచనా ప్రకారం, మార్చి 31 ముగింపునాటి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 6.5 శాతంగా ఉండనుందని అంచనా.. 2018–19 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7 నుంచి 7.5 శాతంగా ఉంటుందని మూడు రోజుల ముందు ఆర్థిక సర్వే పేర్కొంది. 2017–18 తొలి త్రైమాసికంలో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 5.7 శాతంగా.. అంటే మూడేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. రెండో త్రైమాసికంలో పుంజుకుని 6.3 శాతానికి చేరుకుంది.

ఈ ఏడాది చివరిలోపు క్రిప్టోకరెన్సీలపై నియంత్రణ

క్రిప్టో కరెన్సీల వినియోగంపై ఈ ఏడాది చివరి నాటికి కచ్చితంగా నియంత్రణ తీసుకొస్తామని సుభాష్ చంద్ర గార్గ్ అన్నారు. క్రిప్టో కరెన్సీ నిషేధంపై ఇప్పటికే ఏర్పాటు చేసిన కమిటీ చర్యలను ఖరారు చేయనుందని, ఈ ఏడాది చివరి నాటికి కచ్చితంగా నియంత్రణ తీసుకొస్తామని అన్నారు. ఇప్పటికే ఉన్న క్రిప్టో కరెన్సీల వ్యాపారం చట్టబద్ధమైన వ్యవస్థలో ఉంటే నేరుగా విచారించవచ్చని, ప్రస్తుతం ఉన్న బిట్‌కాయిన్ ఎక్స్చేంజీలకు ఎటువంటి అనుమతులు, చట్టబద్ధత లేవన్నారు. కిప్టో కరెన్సీలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అనుమతించదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో తెలిపారు. వీటి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన పేర్కొన్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29050	31069.52	–0.45%
ముంబై	29940	32021.39	–0.27%
ఢిల్లీ	29300	31336.90	0%
కోల్‌కతా	29900.99	31979.67	0.17%
కేరళ	28100	30053.48	–0.35%
బెంగళూరు	28500	30481.28	–0.18%
హైదరాబాద్	29050	31069.52	–0.68%
గల్ఫ్	1430.55	1530.00	0.66%

వెండి ధర (రూ./ కిలో)


నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42000.00	0.48
ముంబై	42200.00	42000.00	0.48
ఢిల్లీ	42200.00	42000.00	0.48
కోల్‌కతా	42200.00	42000.00	0.48
హైదరాబాద్	42200.00	42000.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	360	విశాఖపట్నం	365
వరంగల్	362	చిత్తూరు	383
విజయవాడ	360	చెన్నై	390
గోదావరి	360	బెంగళూరు	380

ఆర్‌బిఐ సమీక్ష, క్యూ3 ఫలితాలే కీలకం



ముంబై: గత వారం బడ్జెట్ అంశాలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ వారం మార్కెట్ పరిస్థితి ఎలా ఉండనుంది? ఏ అంశాలు మార్కెట్‌ను శాసిస్తాయి? అని ఇన్వెస్టర్లు చూస్తున్నారు. ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ద్రవ్యపరపతి విధాన సమీక్ష, మూడో త్రైమాసిక ఫలితాలు ఈ వారం మార్కెట్‌ను శాసిస్తాయని నిపుణులు అంటున్నారు. అలాగే అమెరికా కరెన్సీ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కదలికలు, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు, బడ్జెట్ అంశాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. అయితే మరికొందరు నిపుణులు.. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ మరో 2.5 శాతం పతనమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా టెక్నికల్ అనలిస్టులు ఈ విధంగా చెబుతున్నారు. స్వల్పకాలంలోనే ఈ సూచీ 10,500 స్టాయికి పడిపోయే అవకాశముందని అంటున్నారు. ఈ నెలలో ఆఖరి గురువారం అయిన ఫిబ్రవరి 22(డెరివేటివ్స్ గడువు తేదీ)న నిఫ్టీ ఆప్షన్స్ డేటాను ఒకసారి పరిశీలిస్తే 10,500 పుట్స్ 59.84 లక్షల షేర్లతో అత్యధికంగా ఓపెన్ ఇంట్రెస్ట్ కలిగి ఉంది. 10,700 పుట్స్ 41.2 లక్షల షేర్లతో ఓపెన్ ఇంట్రెస్ట్ కలిగి ఉన్నాయని, ఇది నిఫ్టీ త్వరలోనే 10,500 స్థాయిని పరీక్షిస్తుందనేందుకు సంకేతంగా భావిస్తున్నట్లు తెలియజేశారు. 10,700 స్థాయి దిగువన డీపర్ కరెక్షన్ పొంచి ఉందన్నారు.

మిడ్‌క్యాప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

గత వారం ఆఖరి రోజు నిఫ్టీ ఒకే రోజులో ఏకంగా 2.33 శాతం నష్టాన్ని చవిచూసింది. ఈక్విటీ లాభాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధింపు కారణంగా సూచీ భారీగా పతనమైంది. రెండువారాల ముందు నుంచే మిడ్‌క్యాప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి చోటుచేసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పలు షేర్లు ఇటీవలి రెండువారాల గరిష్టస్థాయి నుంచి చూస్తే 30–40 శాతం నష్టపోయాయని అన్నారు. ఇంతటి భారీ పతనం చూస్తుంటే నిఫ్టీ మరింత పడిపోయే అవకాశం కనబడుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మంచి సెల్ అవకాశమిస్తోందని.. పిఎస్‌యు బ్యాంకు షేర్లలో ఈ షేరు బలహీనంగా కనబడుతుందని అన్నారు.



ఆదివారం నాడు గువహటిలో అడ్వాంటేజ్ అసోం అంతర్జాతీయ సదస్సులో ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌కు శుంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

7న ఆర్‌బిఐ పాలసీ భేటీ



ముంబై: ఈ వారం ఆర్‌బిఐ సమీక్షపై ఇన్వెస్టర్ల దృష్టి నెలకొంది. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ(ఎంపిసి) మంగళవారం నుంచి రెండు రోజులపాటు సమీక్షా సమావేశాలను నిర్వహించనుంది. బుధవారం ఆర్‌బిఐ పరపతి నిర్ణయాలు ప్రకటించనుంది. ఈ నిర్ణయాలు వచ్చే వారం దేశీ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఇప్పటికే మార్కెట్‌పై బడ్జెట్ ఎఫెక్ట్ కొనసాగనుండగా.. ఇటు ఆర్‌బిఐ నిర్ణయాలూ కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.ఈక్విటీలలో దీర్ఘకాలిక పెట్టుబడులనూ పన్ను పరిధిలోకి తీసుకురావడంతో వారాంతం శుక్రవారం మార్కెట్లు బేర్మన్నాయి. సెన్సెక్స్ 840 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ 256 పాయింట్లు కుప్పకూలింది. ఈ వారం మరికొన్ని బ్లూచిప్ కంపెనీల పనితీరు వెల్లడికానుంది. నేడు(సోమవారం) టాటా మోటార్స్, బాష్ క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. 6వ తేదీనాడు హీరోమోటో, లుపిన్, 7వ తేదీనాడు సిప్లా, ఐషర్ మోటార్స్, 9వ తేదీనాడు బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఎం అండ్ ఎం, ఒఎన్‌జిసి, ఎస్‌బిఐ, టాటా స్టీల్ క్యూ3 ఫలితాలు ప్రకటించనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులతోపాటు ముడిచమురు ధరలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పిఐలు) పెట్టుబడులు, డాలరుతో రూపాయి మారకపు విలువ వంటి పలు అంశాలు దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించే వీలున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

వడ్డీ రేట్ల పెంపు ఆలోచన ఉండదు

వ్యవసాయానికి అనుకూలంగా బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకోవడంతో ఈసారి ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వడ్డీ రేట్ల పెంపు ఆలోచన చేయదని ఇండస్ట్రీ చాంబర్ అసోచామ్ పేర్కొంది. ద్రవ్యోల్బణం ఆందోళనలతో వడ్డీ రేట్లు పెంచాలని ఆర్‌బిఐ యోచించింది. అయితే ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి అనుకూలంగా నిర్ణయాలు చేయడం ఆర్‌బిఐకి సానుకూలంగా మారింది.

టాప్10లో ఏడు కంపెనీలకు నష్టాలు

- మొత్తం మార్కెట్ విలువ రూ.98,530 కోట్లు ఆవిరి



న్యూఢిల్లీ: గతవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజు స్టాక్‌మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో చాలా వరకు స్టాక్స్ భారీగా నష్టపోయాయి. టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో ఏడు సంస్థలు భారీగా రూ.98,530 కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను కోల్పోయాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్), ఒఎన్‌జిసి స్టాక్స్ అత్యంత ఎక్కువగా నష్టాలను చవిచూశాయి.

గత వారాంతంలో ఆర్ఐఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, మారుతీ సుజుకీ ఇండియా, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసిలు ఎం–క్యాప్‌ను కోల్పోగా.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.37,256.05 కోట్లు పడిపోయి రూ.5,73,682.16 కోట్లకు చేరింది. ఒఎన్‌జిసి మార్కెట్ విలువ రూ.20,276.51 కోట్లు క్షీణించి రూ.2,46,975.61 కోట్లకు చేరగా, ఎస్‌బిఐ విలువ రూ.14,027.08 కోట్లు తగ్గి రూ.2,56,286 కోట్లు అయింది. మారుతీ సుజుకీ ఎం–క్యాప్ రూ.8,364.59 కోట్లు పడిపోయి రూ.2,71,881 కోట్లకు చేరగా, ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసి దాదాపు రూ.6,691 కోట్ల మార్కెట్ విలువను నష్టపోయి రూ.3,35,678 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ విషయానికొస్తే రూ.6,355 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయి రూ.2,49,342 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కూడా రూ.5,560 కోట్ల విలువను కోల్పోయి రూ.5,05,142 కోట్లకు చేరింది. మరోవైపు వీటికి విరుద్ధంగా టిసిఎస్ ఎం–క్యాప్ మాత్రం రూ.5,991.72 కోట్ల మార్కెట్ విలువను పెంచుకుని రూ.6,02,838 కోట్లు అయింది. సోమవారం మార్కెట్ విలువలో ఆర్ఐఎల్‌ను అధిగమించి టిసిఎస్ అగ్రస్థానంలో నిలిచింది. హెచ్‌యుఎల్(హిందుస్తాన్ యునిలివర్ లిమిటెడ్) విలువ రూ.325 కోట్లు పెరిగి రూ.2,97,118 కోట్లకు చేరగా.. హెచ్‌డిఎఫ్‌సి ఎం–క్యాప్ రూ.119.82 కోట్లు పెరిగి రూ.3,04,070 కోట్లకు చేరింది. టాప్ 10 జాబితాలో మొదటి స్థానంలో టిసిఎస్ నిలిచింది. ఆ తర్వాత వరుసగా ఆర్ఐఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, మారుతీ సుజుకీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి ఉన్నాయి. గత వారం మొత్తంగా సెన్సెక్స్ 984 పాయింట్లు నష్టపోయింది. అంటే 2.72 శాతం నష్టపోయి రూ.35,067 పాయింట్ల వద్ద స్థిరపడింది.

రాహుల్ దేవాలయాల సందర్శనలో కొత్తేం లేదు : శశిథరూర్



జైపూర్: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దేవాలయాల సందర్శన రాజకీయ ప్రభావం కోసం కాదని ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపి శశిథరూర్ అన్నారు. ఇందులో కొత్తేం లేదని, రాహుల్ గతంలో కూడా పూజలు చేసేవారని, కాని ఇప్పుడు కాస్తంత బహిరంగంగా చేస్తున్నారని తెలిపారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ విస్తృతంగా దేవాలయాల్ని సందర్శించడంపై మీడియా ప్రశ్నించగా శశి థరూర్ పై విధంగా స్పందించారు. మతాన్ని ఎవరూ బయటికి చూపించుకోవాల్సిన అవసరం లేదని, అది కేవలం వ్యక్తిగత విషయమేనని శశి థరూర్ అన్నారు. మతంతో రాజకీయ ప్రభావం ముడిపడిలేదని, అది కేవలం ఊహేనని అన్నారు. మతాన్ని, హిందుత్వాన్ని బిజెపియే రాజకీయ చదరంగంలోకి తీసకువచ్చిందని అన్నారు. అంతేకాకుండా తాము మాత్రమే మంచి హిందువులమని మిగతా వారు చెడ్డవారని అనవసరపు ప్రచారం చేస్తున్నారని తప్పుపట్టారు. తనకు ఇది పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీన్ని బాహ్య ప్రపంచంలో ప్రదర్శించాల్సిన అవసరం లేదని అన్నారు.

10% కమీషన్ ప్రభుత్వం

కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్ డౌన్ ప్రారంభం

❑ ఇప్పుడది నిష్క్రమణ తలుపు వద్ద ఉంది ❑ బెంగళూరు సభలో మోడీ ధ్వజం

బెంగళూరు: కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రాష్ట్రంలో అవినీతిలో ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. బెంగళూరులో ఆదివారం జరిగిన పరివర్తన్ ర్యాలీ ముగింపు సభలో మోడీ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నిష్క్రమణ తలుపు వద్ద ఉందని అన్నారు. ఇది '10 శాతం కమీషన్ ప్రభుత్వం' అని, నేరస్తులు ప్రభుత్వాన్ని వెనుక నుంచి నడిపిస్తున్నారని విమర్శించారు. ఏ పని జరగాలన్నా 10 శాతం కమీషన్ లేకుండా జరగని పరిస్థితి ఇక్కడ నెలకొందని, ఈ విధమైన గుర్తింపు వచ్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలని అన్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు, హిందూ కార్యకర్తలను దారుణంగా చంపేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం సరళీకృతమైన వ్యాపారం గురించి మాట్లాడుతుంటే, కర్ణాటకలో మాత్రం



ఎంతో సులభంగా చేస్తున్న ఈ దారుణ హత్యల గురించి అంతా చర్చించుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం కర్ణాటక ప్రజలు రాష్ట్రాన్ని కాంగ్రెస్ రహితంగా చేయాలని నిర్ణయించుకున్నారని, కాంగ్రెస్ సంస్కృతి నుంచి విమోచనం కలిగించాలని కోరుకుంటున్నారని అన్నారు. కాగా, అండర్ 19 క్రికెట్ టీమ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. యువ భారత్ వరల్డ్ కప్ సాధించడంలో ద్రవిడ్ పాత్రను ప్రశంసించాల్సిందేనన్నారు. దేశం గర్వించేలా చేశారని వ్యాఖ్యానించారు. ద్రవిడ్ కన్నడ నేలలో పుట్టిన బిడ్డని గుర్తు చేశారు. నలుగురి కోసం కష్టపడే స్వభావం కన్నడిగులదని పొగడ్తలతో ముంచెత్తారు. నిజాయితీగా పని చేస్తూ.. పరోపకారిగా ఉండటం ద్రవిడ్ నేర్పించాడన్నారు. కర్నాటక సంస్కృతే అదన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంస్కృతిని నాశనం చేస్తుందని విమర్శించారు.

ఆ ఒప్పందాలు బయటపెట్టాలి



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ప్రతిపక్షాల గొంతు నొక్కడం,రాజకీయ హత్యలు, దళితులపైన దాడులు, ధర్నా చౌక్ ఎత్తివేయడం, నల్గొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తను చంపడం..... ఇవే టిఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర బడ్జెట్ పై మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... అరుణ్ జైట్లీ బడ్జెట్ ఒక ఎన్నికల బడ్జెట్‌గా అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభం తప్ప, రైతులకు ఒరిగింది ఏమీ లేదని ఆరోపించారు. ఎన్‌డిఎ హయాంలో రైతుల పరిస్థితి ఘోరంగా తయారయ్యిందని, వారికి రుణమాఫీ చెయ్యడానికి జైట్లీకి చేతులు రాలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. దేశంలో రైతు ఆత్మహత్యలు ఇంకా కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలలో, 80 శాతం హామీలు అమలు కాలేదని వివరించారు. తెలంగాణలో ఎయిమ్స్‌కి నిధులు రాలేదు ..బయ్యారం ఉసేలేదు ... హైకోర్ట్ విభజన లేదు ... నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన నిధులు కూడా ఇవ్వలేదంటూ దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్ విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విఫలమయ్యారని ఆరోపణలు సంధించారు. విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయలేదు కాబట్టి, తెలంగాణ ఎంపిలు రాజీనామా చేయాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు.బిజెపితో కెసిఆర్‌కు ఉన్న లోపాయకారి ఒప్పందాలు ఏంటి? వాటిని బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రో రైల్ ఉసేలేదు, చేవెళ్ల ప్రాణహిత, కాళేశ్వరనికి నిధులు లేవు, ఉద్యోగాల్లో కల్పనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శల బాణాలు సంధించారు. బంగారు తెలంగాణ అని మభ్యపెడుతున్న కెసిఆర్ మళ్ళీ అధికారంలోకి రావడంపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు.

ముందస్తు ఎన్నికలు నిర్వహిస్తా : అబ్దుల్లా యామీన్

సుప్రీంకోర్టుకు మాల్దీవ్ ప్రభుత్వం హెచ్చరిక

మాలే: తన పదవీ కాలం ముగిసే నవంబర్ కన్నా అనేక నెలల ముందే మాల్దీవ్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తానని మాల్దీవ్ అధ్యక్షుడు యామీన్ అబుల్లా గయూమ్ చెప్పారు. దేశం వదిలి ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ సహా ఆయనను వ్యతిరేకిస్తున్న రాజకీయవేత్తలను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ఈ విషయం చెప్పారు. కారాగారంలో ఉన్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలంటూ మాల్దీవులో అరాజకం కొనసాగుతోంది. కోర్టు రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ఉత్తర్వు జారీచేయడంతో పాటు ప్రతిపక్షంతో కలిసినందుకు తొలగించిన 12 మంది శాసనకర్తలను తిరిగి నియమించాలని కూడా కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు గురువారం ఆదేశించాక మొదటిసారి యామీన్ అబ్దుల్లా గయూమ్ బహిరంగంగా మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికలను ముందస్తుగానే నిర్వహించాలని అనుకొంటున్నట్లు తెలిపారు. నిరవధికంగా వాయిదా పడిన మాల్దీవ్ పార్లమెంటు ఫిబ్రవరి 5న తెరుచుకుంటోందని శాసనకర్త అహ్మద్ మహలూఫ్ చెప్పారు.

అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్‌పై అవిశ్వాసం ప్రకటించినా, అరెస్టు చేసే ప్రయత్నం చేసినా ఎదుర్కొనేందుకు పోలీసులు, దళాలు సిద్ధంగా ఉండాలని మాల్దీవ్ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హిందూ మహా సముద్రంలోని చిన్న ద్వీపకల్పమైన ఈ దేశంలో రాజకీయ సంక్షోభాన్ని నివారించేందుకు అక్కడి సుప్రీంకోర్టే కలుగజేసుకుంది. అసమ్మతి రాజకీయవేత్తలందరినీ కారాగారం నుంచి విడుదల చేయాలని, తొలగించిన 12 మంది శాసనకర్తలను తిరిగి తీసుకోవాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. అయితే యామీన్ ప్రభుత్వం మాత్రం సహకరించడానికి ఇంకా ఇచ్చగించడంలేదు. పార్లమెంటును మూసేసింది. న్యాయవ్యవస్థ ఉత్తర్వులను గౌరవించాలని, ప్రజాస్వామ్యాన్ని పునఃస్థాపించాలని వస్తున్న అంతర్జాతీయ కాల్స్‌ను వ్యతిరేకిస్తోంది. 'అధ్యక్షుడిని అరెస్టు చేయమని ఏ సుప్రీంకోర్టు ఉత్తర్వు అయినా అక్రమమే. అందుకనే పోలీసు, సైన్యం రాజ్యాంగ వ్యతిరేక ఉత్తర్వు ఏదీ



అమలు చేయకుండా చూడాలని కోరాను' అని అటార్నీ జనరల్ మహ్మద్ అనిల్ చెప్పారు. ప్రభుత్వాన్ని కూల్చేసే కుట్రగా చెబుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఆమోదించడంలేదని ప్రవాసంలో ఉన్న మాజీ అధ్యక్షుడు నషీద్ తెలిపారు. ఆయనపై వివాదాస్పద ఉగ్రవాద అభియోగాలున్నాయి. నషీద్ చికిత్స నెపంతో 2016లో దేశాన్ని వదిలి ప్రవాస జీవితం గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయన కొలంబోలో ఉన్నారు.

ఎన్‌డిఎకు రోగం ముదిరింది



● ఆర్థిక స్థితిపై వాస్తవాలు అంగీకరించేందుకు నిరాకరణ ● కేంద్రంపై చిదంబరం మండిపాటు

న్యూఢిల్లీ: ఆర్థిక స్థితిపై ఎన్‌డిఎ ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించడానికి నిరాకరిస్తోంది. తనకు తాను రోగని ర్ధారణ చేసుకుని స్వంతంగా ఔషధాలు తీసుకునే 'ముదురు వ్యాధిగ్రస్థుడి' మాదిరిగా వ్యవహరిస్తోంది అని మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం ట్వీట్ చేశారు. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ 'మంచి డాక్టర్' లా వ్యవహరిస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం ఆయన సలహాలను పాటించడం లేదని అన్నారు. అరవింద్ సుబ్రమణ్యన్ 2014 నుంచే ప్రధాన ఆర్థిక సలహాదారుగా మంచి పాత్ర పోషిస్తున్నారని, కానీ ప్రభుత్వమే ఆయన సలహాలు వినడం లేదని చిదంబర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆర్థిక సర్వే నాలుగు ఆర్‌ఎస్‌లపై (రికగ్నిషన్, రిజల్యూషన్, రీక్యాపిటలైజేషన్, రిఫార్మ్స్)పై దృష్టి పెట్టిందని, అయితే మొదటి మూడు చేయగలిగిందేగానీ, చివరిదైన బ్యాంకింగ్ సంస్కరణలను ఇంకా చేయలేకపోయిందని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్థిక విధానంపై, క్షీణిస్తున్న స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) వృద్ధిపై చిదంబరం తీవ్రంగా విమర్శలు సంధించారు.

మోడీకి రాహులే ప్రత్యామ్నాయం

ప్రధాని నరేంద్ర మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాత్రమే ప్రత్యామ్నాయం అని కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ఆదివారం అన్నారు. ప్రతిపక్షాలు కలసి కట్టుగా ఉంటే 2019 లోక్‌సభ ఎన్నికల్లో తుఫాను తరహాలో మార్పు సంభవమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం ముందు రెండే మోడల్స్ ఉన్నాయని , ఒకటి మోడీ మోడల్ కాగా , రెండోది రాహుల్ మోడల్ అని చెప్పారు. రాహుల్‌ది చాలా సరళమైన, స్పష్టమైన విధానం అని కూడా ఆయన వివరించారు. పిటిఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్ మీడియా అధినేత సూర్జేవాలా ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 'మోడీకి ప్రత్యామ్నాయం రాహుల్ గాంధీ మాత్రమేనని, దేశం తదుపరి ప్రధానిగా రాహుల్‌ను చూడాలనుకుంటోందని కూడా ఆయన వివరించారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో శివసేన ఒంటరిగా పోటీ చేస్తానని అన్నది, కేంద్ర బడ్జెట్ 2018–19ని తెలుగుదేశం పార్టీ(టిడిపి) విమర్శించింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలన్నీ ఒక్కటైతే పెను తుఫానులాంటి మార్పు సంభవమేనని ఆయన అన్నారు. కర్ణాటకలో తమ పార్టీ మళ్లీ గెలుస్తుందన్న ధీమాను సూర్జేవాలా వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్ లేకుండానే ఎలక్ట్రానిక్ రికార్డులను విశ్వసించొచ్చు



న్యూఢిల్లీ: డిజిలైజేషన్, కంప్యూటర్ రికార్డులను నమ్ముతున్న నేటి కాలంలో ఎలక్ట్రానిక్ సాక్ష్యానికి మళ్లీ సర్టిఫికేట్ తప్పనిసరి ఏమి కాదని సుప్రీం అభిప్రాయపడింది. భారత సాక్ష్యాధార చట్టం 65బి సెక్షన్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు స్పష్టీకరణ ఇచ్చింది. నేర విచారణలో కాల్ వివరాలు, సిసిటివి ఫుటేజిలు, మొబైల్ విడియో రికార్డింగులు, సిడిలు వంటి సాక్ష్యాలు పెరిగిపోతున్నాయి. న్యాయమూర్తులు ఎ.కె.గోయెల్, యు.యు. లలిత్ సాక్ష్యాధార చట్టం 65బి(4)పై వ్యాఖ్యానిస్తూ ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలు అందించిన వ్యక్తి సర్టిఫికేట్‌ను కూడా సమర్పించే పరిస్థితిలో లేనప్పుడు వాటిని అంగీకరించాల్సిందేనని అన్నారు. సర్టిఫికేట్‌ను సదరు వ్యక్తి సమర్పించుకునే స్థితిలో లేనప్పుడు 65బి సెక్షన్‌ను అన్వయించరాదు అని వ్యాఖ్యానించింది. 'సర్టిఫికేట్ మాత్రం సమర్పించలేని స్థితిలో ఒక వ్యక్తి ఇచ్చిన ఎలక్ట్రానిక్ రికార్డులను అంగీకరించని పక్షంలో అతడికి న్యాయాన్ని నిరాకరించినట్లే అవుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. 65బి సెక్షన్ అంశాన్ని విశదీకరించేందుకు కోర్టుకు సాయపడడానికి అమికస్ క్యూరియాగా ఏర్పాటు చేసిన నలుగురు సీనియర్ అడ్వకేట్లు... అరుణ్ మోహన్, జయంత్ భూషణ్, యశాంక్ అధ్యారు, మీనాక్షి అరోరాల అభిప్రాయాన్ని కోర్టు పరిగణలోకి తీసుకుంది. 'ప్రస్తుతం ఉన్న ప్రొవిజన్ ప్రకారం ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ సాక్ష్యాన్ని సమర్పించాక, సంబంధిత అధికారి నుంచి మళ్లీ సర్టిఫికేట్ అవసరం లేదు. ఎలక్ట్రానిక్ సాక్ష్యాలకు సర్టిఫికేట్ ఉండాలని తప్పనిసరి చేయడం సరికాదు' అని సీనియర్ న్యాయవాదులు వాదించారు.

ఆప్ ఎంఎల్‌ఎల వినతిని పరిగణనలోకి తీసుకోకండి : ఇసి

న్యూఢిల్లీ: లాభదాయక పదవులు నిర్వహించినందుకు ఢిల్లీ అసెంబ్లీ నుంచి అనర్హులుగా ప్రకటించిన దానికి వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంఎల్‌ఎలు పెట్టుకున్న వినతిని పరిగణనలోకి తీసుకోరాదని ఎన్నికల సంఘం, ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఎన్నికల సంఘం సిఫార్సులను సవాలు చేస్తూ ఆప్ ఎంఎల్‌ఎలు పిటిషన్ పెట్టుకున్నారని, కానీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం పొందాక ఆ సిఫార్సులు అమలులో లేవని ఎన్నికల సంఘం న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, చంద్ర శేఖర్‌లతో కూడిన ధర్మాసనంకు తెలిపింది. ఆప్ ఎంఎల్‌ఎలు రాష్ట్రపతి జనవరి 20న తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేయలేదు. అంటే వారు సిఫార్సులను ఆమోదించారనే అర్థమని కూడా ఎన్నికల సంఘం కోర్టుకు వివరించింది. ఢిల్లీ అసెంబ్లీ నుంచి తమను అనర్హులు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని ఆప్ 20 మంది ఎంఎల్‌ఎలు పెట్టుకున్న పిటిషన్‌కు ప్రతిస్పందిస్తూ ఎన్నికల సంఘం ఈ విజ్ఞప్తి చేసింది.

'జుగాడ్ రిక్షాలు' ఓ బెడద..



న్యూఢిల్లీ: స్కూటర్ ఇంజిన్ బిగించిన సైకిల్ రిక్షాలు లేక 'జుగాడ్ రిక్షాలను పూర్తిగా నిషేధించాలని, వాటిని ఢిల్లీ రోడ్లపై తిరగకుండా చేయాలని ఢిల్లీ కోర్టు పోలీసులను ఆదేశించింది. 32 జుగాడ్ రిక్షాలపై పోలీసులు ఇచ్చిన రిపోర్టును కోర్టు స్వీకరించింది. స్కూటర్ ఇంజిన్ బిగించిన మూడుచక్రాల ఈ వాహనాలు అక్రమంగా అనేకం ఢిల్లీలో తిరుగుతున్నాయని ఆ నివేదికలో పోలీసులు పేర్కొన్నారు. మోటార్ వాహనాల చట్టం కింద ఈ జుగాడ్ రిక్షాలు రావని, కనుక వాటిని ఢిల్లీ రోడ్లపై నడవనివ్వరాదని పోలీసులు కోరారు. ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనే యాక్షన్ టేకెన్ రిపోర్టును ఫిబ్రవరి 17కల్లా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. గత నెల జైత్‌పూర్‌లో జుగాడ్ రిక్షా డ్రైవర్ ర్యాష్‌గా తన వాహనాన్ని నడిపించి రోడ్డు ప్రమాదంలో ఓ మోటార్ సైకిలిస్ట్ కాలును నుజ్జు చేసిన కేసును విన్న కోర్టు ఈ ఉత్తర్వును జారీ చేసింది. రోడ్డుపై నడిచే పాదచారులకు, ఇతరులకు కూడా ఈ జుగాడ్ రిక్షాలు బెడదగా తయారయ్యాయని, పైగా రోడ్డుపై భద్రత కూడా కరువవుతోందని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్(ఎంఎసిటి) ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆర్.కె. చౌహాన్ అన్నారు. అలాంటి రిక్షాల బెడద గురించి ఢిల్లీ పోలీస్ కమిషనర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు ఢిల్లీ ప్రభుత్వం తెలుపాలని కూడా కోర్టు ఆదేశించింది.

కటక్‌లో భారీ అగ్ని ప్రమాదం

కటక్: ఒడిషాలోని కటక్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం ఉదయం పలమండప్ షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పలు దుకాణాలు దగ్ధమయ్యాయి. మాల్‌లోని గార్మెంట్ దుకాణంలో మొదట మంటలను గుర్తించారు. మంటలు వ్యాప్తి చెంది సమీపంలోని మరో నాలుగు దుకాణాలు దగ్ధమయ్యాయి. మంటలను ఆర్పేందుకు దాదాపు 150 మంది అగ్నిమాపక, పోలీస్, ఓడిఆర్,ఎఫ్ అగ్నిమాపక యంత్రాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు మాల్‌లో 50 మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని ఫైర్ సర్వీసెస్ డిజి బికె శర్మ తెలిపారు. బడంబడి నుంచి లింక్ రోడ్‌ల మధ్య ట్రాఫిక్‌కు కొన్ని గంటలపాటు అంతరాయం కలిగింది. రూ. కోటికి పైగా ఆస్తి కాలి బూడిదయినట్లు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా, నలుగురు మృతి


బదౌన్(యుపి): ఉత్తరప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి లోయలో పడిపోవడంతో నలుగురు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ శనివారం రాత్రి బోల్తా పడ్డట్లు రూరల్ ఎస్‌పి సురేంద్ర ప్రతాప్‌సింగ్ తెలిపారు. మృతులు అద్నాన్ (19),అజీం (24), హసిబుల్ (35), మాజిద్ (58)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని మెరుగైన వైద్య చికిత్స కోసం అలీఘర్ మెడికల్ కాలేజ్‌కు తరలించారు. మృతదేహాలను పంచనామాకు తరలించామని పోలీసులు తెలిపారు.

బడ్జెట్ సమావేశంలో ఖరారు కానున్న బోఫోర్స్ నివేదిక

న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశంలో దాదాపు 27 ఏళ్ల తర్వాత బోఫోర్స్ శతఘ్నుల ఒప్పందం పరిశీలించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పిఎసి) తన నివేదికను ఖరారు చేయనుందని సభ్యులు తెలిపారు. బోఫోర్స్‌పై పిఎసి ఎదుట చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కాగ్ నివేదిక ఇది. కాగ్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆడిట్ నివేదికను పరిశీలించడమే పిఎసి ముఖ్య పని. బోఫోర్స్ హొవిట్జర్ శతఘ్ని ఒప్పందంపై 1989 నుంచి 1990 వరకు జరిగిన కాగ్ నివేదికను ఆరుగురు సభ్యుల పిఎసి ఉపకమిటీ పరిశీలించింది. పార్లమెంట్ సంఘానికి చర్యలు తీసుకున్న గమనికలు(యాక్షన్ టేకెన్ నోట్స్) సంబంధిత మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ సంస్థలు సమర్పించనందున పిఎసి నివేదిక ఖరారులో జాప్యం ఏర్పడింది. పిఎసి సబ్‌కమిటీ తుది నివేదిక ఆమోదం కోసం ప్రధాన కమిటీ వద్దకు వెళుతుంది. అక్కడ ఆ నివేదికలోని అంశాలను కాంగ్రెస్ ఎంపిలు వ్యతిరేకిస్తారని ఓ సభ్యుడు చెప్పారు. ప్రధాన కమిటీకి మల్లికార్జున ఖర్గే నేతృత్వం వహిస్తున్నారు. బోఫోర్స్ కుంభకోణంలో కొందరికి ముడుపులు అందాయన్నది ఆరోపణ.

అల్లర్లు రెచ్చగొట్టినందుకు రూ.70 కోట్లు

జమ్మూకశ్మీర్ : పాక్ దురాగతం మరొకటి వెలుగులోకి వచ్చింది. కశ్మీర్ లోయలో అల్లర్లు, విధ్వంసాన్ని సృష్టించినందుకు అత్యంత క్రూరమైన వేర్పాటువాది బిట్టా కరాటేకు పాకిస్థాన్ నుంచి రూ.70 కోట్లు అందినట్లు తేలింది. కశ్మీర్‌లో ఉగ్రనిధుల కేసులో పలు కీలక విషయాలను ఎన్‌ఐఎ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఇటీవల పటియాల హౌస్‌కోర్టులో ఈ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2016 జులైలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వనీ మృతి అనంతరం పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ అల్లర్లను సృష్టిస్తున్నందుకు దాదాపు రూ.200 కోట్ల నగదు వేర్పాటు వాదులకు అందినట్లు తేలింది. భారత మోస్ట్ వాంటెడ్ జాబితాలోని హాఫీజ్ సయీద్ కూడా రూ.12 కోట్ల వరకు కశ్మీర్‌లోని హుర్రియత్ నేతలకు అందజేసిన విషయం కూడా బయటకు వచ్చింది. కాగా, కశ్మీర్‌లో అల్లర్లు సృష్టించేందుకు వేర్పాటు వాదులు ప్యాకేజీలు కూడా పెట్టారు. బిట్టా కరాటే అనే వేర్పాటు వాదిని విచారించినప్పుడు ఎన్‌ఐఎకు నిర్ఘాంతపోయే నిజాలు తెలిశాయి. కశ్మీర్‌లో అల్లర్లు సృష్టించేందుకు పాక్‌కు ఒక ఆఫర్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. రూ.70 కోట్లు ఇస్తే ఆరునెలల పాటు అల్లర్లు సృష్టిస్తామని అతను ప్రతిపాదించినట్లు ఎన్‌ఐఏ పేర్కొంది. బిట్టా కరాటేకు కశ్మీర్ వ్యాప్తంగా అనుచరులు ఉన్నారు. దీనిని అవకాశంగా తీసుకొని అతను ఈ ప్రతిపాదన చేసినట్లు సమాచారం. కశ్మీర్‌లో పాక్ పారించిన రూ.200 కోట్లలో ఇతనికే అత్యధికంగా నిధులు అందాయి. బిట్టా కరాటే అసలు పేరు ఫరూఖ్ అహ్మద్ దార్. జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఛైర్మన్. 1990లో కశ్మీరీ పండిట్లను తుడిచివేసిన వ్యక్తి ఇతనేనని ఆరోపణలు ఉన్నాయి. కశ్మీర్ లోయలో అత్యంత క్రూరుడిగా ఇతనికి పేరుంది. 1998లో 38 రోజులపాటు



పాకిస్థాన్‌లో శిక్షణ పొందాడు. 2016 జులై 8 బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ తర్వాత బిట్టా మళ్లీ రంగంలోకి దిగాడు. కశ్మీర్‌లోని ఉన్న తన అనుచరులు మొత్తాన్ని ఏకం చేశాడు. పాక్ , హుర్రియత్‌కు అనుసంధాన కర్తగా వ్యవహరించాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న అల్లర్ల ప్రణాళికను అమల్లో పెట్టాడని ఎన్‌ఐఏ తేల్చింది. బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌కు కొన్ని నెలల ముందే బిట్టా పాక్‌తో కలిసి భారీ ఎత్తున అల్లర్లకు ప్రణాళిక రచించాడు. దీనిలో ఉగ్రసంస్థ లష్కరే తోయిబా కూడా కీలక పాత్ర పోషించింది. బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌ను ఈ అల్లర్లకు సాకుగా వాడుకున్నాడు. అదే సమయంలో ఉగ్రనేత హాఫీజ్ సయీద్ రూ.12 కోట్ల నగదును దుబాయ్ నుంచి చాందినీ చౌక్‌కు పంపించాడు.

రెండేళ్లలో 2.53 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు

న్యూఢిల్లీ : గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు 2.53 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ 2018–19లో ఈ విషయాన్ని పేర్కొంది. గురువారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మార్చి 1, 2018 నాటికి మొత్తం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 35.05 లక్షలు కానుంది. మార్చి 2016 నాటికి ఈ సంఖ్య 35.52 లక్షలుగా ఉంది. కాగా, 201617 మధ్యకాలంలో 2.27లక్షలమంది కొత్తగా ఉగ్యోగాల్లో చేరారు. సింహభాగం పోలీసు డిపార్ట్‌మెంట్, హోం మంత్రిత్వశాఖల్లో చేరారు. అగ్రికల్చర్, కోఆపరేషన్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్‌లో 1,944 మంది, యానిమల్ హజ్బెండరీ, డైరీయింగ్, ఫిషరీస్‌లో 1,519మంది, అటామిక్ ఎనర్జీలో 6,279మంది, పౌరవిమానయాన మంత్రిత్వశాఖలో 1,197మంది, సాంస్కృతిక మంత్రిత్వశాఖలో 3,024మంది, హోం మంత్రిత్వశాఖలో కొత్తగా 5,836మంది, పోలీసుశాఖలో సుమారు లక్షమంది కొత్తగా చేరనున్నారు.

నౌక కోసం విస్తృత గాలింపు


న్యూఢిల్లీ : భారతీయ నావికులతో ఆఫ్రికా తీర జలాల్లో కనిపించకుండా పోయిన ఓ నౌకపై భారత విదేశాంగమంత్రిత్వ శాఖ స్పందించింది. దీనికి సంబంధించి నైజీరియా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నట్టు విదేశాంగశాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ తెలిపారు. 'అబుజా (నైజీరియా రాజధాని) అధికారులతో మాట్లాడుతున్నాం. అక్కడి పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. కనిపించకుండా పోయిన భారత నావికుల వివరాలను తెలుసుకునేందుకు అక్కడ భారత దౌత్యకార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ +2339070343860 ఏర్పాటు చేశాం' అని రవీశ్‌కుమార్ ట్విటర్ ద్వారా తెలిపారు. భారతీయ నావికులతో వెళ్తున్న ఎం.టి.మెరైన్ ఎక్స్‌ప్రెస్ ట్యాంకర్ ఆఫ్రికా తీర జలాల్లో అదృశ్యమైంది. ఈ నౌకలో 22 మంది భారతీయ నావికులు ఉన్నారు. నౌక కోసం అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

7వేల మంది సంపన్నుల వలసలు

చైనా తర్వాత రెండో స్థానంలో భారత్

న్యూఢిల్లీ : దాదాపు ఏడు వేల మంది సంపన్నులు గత ఏడాది భారత్ నుంచి వేరే దేశాలకు వలస వెళ్లిపోయారు. చైనా తర్వాత ఎక్కువ మంది సంపన్నులు ఇతర దేశాలకు వెళ్తున్న వారిలో మన దేశానిది రెండో స్థానం. అంతకముందు ఏడాదితో పోల్చుకుంటే భారత్ నుంచి విదేశాలకు వలసలుగా వెళ్లిపోయిన వారి సంఖ్య 16 శాతం పెరిగింది. దీనికి సంబంధించిన నివేదికను న్యూవరల్డ్ హెల్త్ ఇటీవల విడుదల చేసింది. 2017లో 7వేల మంది మిలియనీర్లు భారత్ నుంచి విదేశాలకు వెళ్లిపోగా 2016లో ఆ సంఖ్య 6వేలుగా ఉంది. 2015లో 4వేల మంది మిలియనీర్లు మాత్రమే వెళ్లారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే చైనా నుంచి అత్యధికంగా 10వేల మంది మిలియనీర్లు ఇతర దేశాలకు వెళ్లిపోయారు. తర్వాతి స్థానాల్లో టర్కీ(6000), బ్రిటన్(4000), ఫ్రాన్స్(4000), రష్యా ఫెడరేషన్ (3000) ఉన్నాయి. భారత్ నుంచి ఎక్కువగా అమెరికా, యూఎఇ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వెళ్తున్నారు. ఇక చైనీయులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు మొగ్గ చూపుతున్నారు.

'ఫేక్'బుక్..20 కోట్ల నకిలీ అకౌంట్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : ఫేస్‌బుక్‌లో కనిపించే ఖాతాల్లో ఎక్కువశాతం నకిలీవే. ఈ విషయాన్ని ఆ సంస్థే స్వయంగా వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం.. 2017 డిసెంబరు 31 వరకు ఫేస్‌బుక్‌లో ఉన్న ఖాతాల్లో 20 కోట్లమంది ఫేక్ అకౌంట్లు కలిగి ఉన్నారు. మొత్తం ఖాతాల్లో దాదాపు 10 శాతం ఖాతాలు దాదాపుప నకిలీవి ఉండే అవకాశముందని ఆ సంస్థ భావించినా.. అంతకు మించే ఉన్నట్లు గుర్తించామని చెప్పింది. భారత్ వంటి దేశాల్లో ఇటీవల ఫేక్ ఖాతాల సంఖ్య బాగా పెరిగిపోతోందని వార్షిక నివేదికలో పేర్కొంది. ఇండియాతో పాటు, ఇండోనేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయట. 2016తో పోలిస్తే నకిలీ ఖాతాల సంఖ్య 14 శాతం పెరిగిందట. వ్యాపారం, ఇలా నకిలీ ఖాతాలు సృష్టించి, వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపింది. తమ సంస్థ నియమనిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఖాతాలన్నింటినీ త్వరలోనే నిలిపివేస్తామని హెచ్చరించింది.



పాకిస్థాన్‌లో గాయని హత్య

ఇస్లామాబాద్ : పాట పాడనందుకుగానూ ఓ పాకిస్థానీ గాయనిని దారుణంగా కాల్చి చంపేశారు. పాకిస్థాన్‌లోని మర్దన్ ప్రాంతానికి చెందిన నయీమ్ ఖత్తక్ అనే వ్యక్తి శనివారం రాత్రి తన ఇంట్లో పార్టీ నిర్వహించాడు. ఈ పార్టీలో కచేరీ ప్రదర్శన ఇవ్వాల్సిందిగా గాయని సుంబుల్ ఖాన్(25)ను ఆహ్వానించాడు. కానీ ఇందుకు ఆమె ఒప్పుకోలేదు. సెలబ్రిటీల పార్టీల్లో పాడతాను కానీ సాధారణ ప్రజల ఇంటికి వచ్చి పాడలేనని చెప్పింది. దాంతో ఆగ్రహించిన నయీమ్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సుంబుల్ ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెను కిడ్నాప్ చేసి బలవంతంగా కచేరీలో పాల్గొనేలా చేయాలని పథకం రచించాడు. కానీ ఇందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో తుపాకీతో కాల్పులు జరిపాడు. దాంతో సుంబుల్ అక్కడికక్కడే చనిపోయింది. దాడి అనంతరం నిందితులు పారిపోయారు. ప్రధాన నిందితుడైన నయీమ్ మాజీ పోలీసు అధికారిగా గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేశా రు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నో పాకిస్థానీ టీవీ షోలలో సుంబుల్ పాల్గొందని.. ఆమెకు మంచి పేరుందని పోలీసులు పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో కళాకారులపై గతంలోనూ ఇలాంటి దాడులు చాలానే జరిగాయి. గతేడాది లాహోర్‌కు చెందిన ప్రముఖ నటి, డ్యాన్సర్ కిస్మత్ బైగ్‌ను కూడా కొందరు దుండగులు తుపాకీతో కాల్చి హత్య చేశారు.



అమెరికాలో రెండు రైళ్లు ఢీకొని ఇద్దరి మృతి

న్యూయార్క్ : అమెరికాలో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 50 మందికిపైగా గాయపడ్డారు. ప్రయాణికుల రైలు న్యూయార్క్ నుంచి మియామికి వెళుతుండగా దక్షిణ కరోలీన వద్ద ఒక సరుకు రవాణా రైలును ఢీకొంది. అమెరికా కాలమానం ప్రకారం ఈ ఘటన తెల్లవారు జామున 2.35సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.05) జరిగింది. ఈ ప్రమాదంలో ప్రయాణికుల రైలు ఇంజిన్ ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలును ఢీకొని వెనుక బోగీలపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఈ రైల్లో 8మంది సిబ్బంది 139 మంది ప్రయాణికులు ఉన్నారు. దక్షిణ కరోలినాలోని కొలంబియా పట్టణ శివార్లలో ఈ ఘటన చోటు చేసుకుంది. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

ట్రంప్‌కు క్లీన్‌చిట్ ఇచ్చిన జిఒపి మెమో!



వాషింగ్టన్: 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందని ఎఫ్‌బిఐ చేసిన దర్యాప్తు నుంచి డీక్లాసిఫైడ్ రిపబ్లికన్ మెమో తనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. శుక్రవారం విడుదలైనా నాలుగు పేజీల ఆ డాక్యుమెంట్ సీనియర్ చట్టాధికారులు కోర్టును తప్పుదారి పట్టించిందని పేర్కొంది. అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై ట్రంప్ మాజీ ప్రచార సలహాదారుపై నిఘా ఉంచాలని కోర్టును తప్పుదారిపట్టించారని పేర్కొంది. 'ఈ మెమో దర్యాప్తు నుంచి 'ట్రంప్'కు పూర్తి క్లీన్‌చిట్ ఇచ్చింది. కానీ రష్యా అంశం మాత్రం వెంటాడుతూనే ఉంటుంది' అని ట్రంప్ శనివారం ట్వీట్ చేశారు. రష్యాతో కుమ్మకయ్యామనేది అమెరికాకే అపప్రద అని ఆయన వ్యాఖ్యానించారు. హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీ శుక్రవారం విడుదల చేసిన ఆ జిఒపి మెమోను కమిటీ ఛైర్మన్ డెవిన్ నన్స్ రూపొందించారు. అందులో ఎఫ్‌బిఐ తన నిఘా అధికారాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ట్రంప్, రష్యా బంధంపై ప్రతిపక్షం వివాదాస్పద పరిశోధన పత్రం ఏదీ లేకుండానే ట్రంప్ ప్రచారంపై నిఘా వారంట్ ఏదీ కోరలేదని నాటి ఎఫ్‌బిఐ డిప్యూటీ డైరెక్టర్ ఆండ్ర్యూ మకేబ్ హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీకి చెప్పారని ఆ మెమో ఆరోపించింది. ట్రంప్, రష్యా విషయంలో ఎఫ్‌బిఐ దర్యాప్తును ఆ మెమో స్పష్టంగా అప్రతిష్టపాలు చేసింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉద్దేశ్యపూర్వకంగా చేపట్టిన దర్యాప్తు అదని పేర్కొంది.

ట్రంప్ నిర్ణయానికి మద్దతుగా భారతీయుల ప్రదర్శన

వాషింగ్టన్: గ్రీన్ కార్డుల జారీకీ లాటరీ వీసా పద్ధతిని తొలగించి ప్రతిభ ఆధారిత వీసా పద్ధతిని ప్రవేశ పెట్టాలని అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనకు మద్దతుగా వేలాది మంది భారతీయులు శ్వేతసౌధం ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగం కోసం అమెరికాలోని కాలిఫోర్నియా, టెక్సాస్, చికాగో, ఫ్లోరిడా వంటి రాష్ట్రాల్లో గత కొన్ని సంవత్సరాల్లో స్థిరపడిన భారతీయ నైపుణ్య ఉద్యోగులు వాషింగ్టన్ వచ్చి శ్వేతసౌధం ఎదుట ప్రదర్శనలో పాల్గొన్నారు. గ్రీన్ కార్డుల బ్యాక్‌లాగ్ విధానాన్ని,దేశాల కోటాను రద్దు చేయాలని,ప్రతిభ ఆధారిత పాయింట్ల విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

తైవాన్‌లో భూకంపం

తైపీ: తైవాన్‌లో ఆదివారం భూమి కంపించింది. భూకంప లేఖినిపై 6.1 తీవ్రతగా నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఒక్కసారిగా భూమి కంపించడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటి వరకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు నమోదు కాలేదు. నార్తఈస్ట్ హౌలీన్ కౌంట్ హోల్‌కు 24 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తైవాన్‌లోని పలు ప్రాంతాల్లో ఒక్కో విధంగా తీవ్రత నమోదైంది. హౌలిన్ సిటీలో రిక్టర్ స్కేల్‌పై 4తీవ్రత నమోదు కాగా.. ఇలాన్ కౌంటీలో 3తీవ్రత నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లోని మిద్నాపూర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వేగంగా వచ్చిన లారీ కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుల వివరాలు తెలియరాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎంపి జెసికి అస్వస్థత

అమరావతి : అనంతపురం టిడిపి ఎంపి జెసి దివాకర్‌రెడ్డి ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. టిడిపి ఎంపిల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయారు. దీంతో వైద్యులు ఆయనకు పరీక్షలు చేశారు. బిపి, షుగర్ లెవల్స్ పడిపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని వైద్యులు తెలిపారు. జెసి ఆరోగ్యంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు.

కుమారుడిని చంపి తల్లి ఆత్మహత్య

కాన్పూర్ : ఓ తల్లి తన ఐదేళ్ల కుమారుడిని భవనం 11వ అంతస్తు నుంచి తోసేసి తానూ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌పి కథనం ప్రకారం...స్థానికంగా నివాసం ఉంటున్న పవన్ అగర్వాల్ (37), జయ అగర్వాల్(33)ఇద్దరూ భార్యభర్తలు. వీరికి పార్థ్(7), ఉత్కర్ష్ (5) అనే ఇద్దరు కుమారులున్నారు. జయ అగర్వాల్ కొంతకాలంగా తీవ్రమైన స్కిజోఫ్రోనిక్ వ్యాధితో బాధపడుతున్నారు.అయితే ఆదివారం తీవ్ర ఒత్తిడికి లోనైన జయ అగర్వాల్ మొదట తన చిన్నకుమారుడిని కొత్తగా నిర్మించిన భవనం పై నుంచి తోసేసింది. వెంటనే తేరుకున్న జయ భర్త కిందికి వెళ్లి చూడగా కుమారుడు రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు. కాసేపటికే భార్య కూడా పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనతో ఆప్రాంతమంతా విషాదం నెలకొంది. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండున్నర దశాబ్దాల తర్వాత ..

మళ్లీ అమెరికా అణుపరీక్షలు!

న్యూయార్క్ : దాదాపు 26 సంవత్సరాల అనంతరం అగ్రరాజ్యం అమెరికా మళ్లీ అణుపరీక్షలకు సిద్ధపడుతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిశ్శబ్దంగా చేసుకుంటున్నది. ఓ పక్క ఉత్తరకొరియాతో ఉద్రిక్త పరిస్థితులు.. మరోపక్క చైనా కవ్వింపు చర్యల నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పెంటగాన్ పర్యవేక్షణలోని నెవాడా నేషనల్ సెక్యూరిటీ టెస్ట్ సైట్‌ను ఆరునెలల్లో అణుపరీక్షలు నిర్వహించేవిధంగా సిద్ధం చేయాలని ట్రంప్ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అమెరికా అణుసంపత్తిని సిద్ధం చేసుకోవాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి 1,20,000 కోట్ల డాలర్లతో బడ్జెట్ కూడా సిద్ధం చేసింది. తాజా అణుపరీక్షలకు లాస్‌వేగాస్‌కు 90మైళ్ల దూరంలోని పరీక్షాకేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఆలోచనకు జులై 2017లోనే ట్రంప్ ప్రాణం పోశారని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ట్రంప్ సర్కారు మాత్రం ఇది చాలా చిన్న పరీక్ష అని కొట్టిపారేస్తోంది. టైమ్స్ పత్రిక మాత్రం రాజకీయ అవసరాల కోసం అణుపరీక్షను వాడుకుంటున్నారని విమర్శించింది. "అమెరికా ఆయుధ ఆధునీకీకరణ అత్యంత వేగవంతంగా చేస్తోందని ఇరాన్, చైనా, రష్యా, ఉ.కొరియాలకు తెలియడం ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయి కనుక పూర్తి వివరాలను బయటపెట్టకపోవచ్చు" అని పేర్కొంది.



అమెరికాపై చైనా ఆగ్రహం ! : బీజింగ్ : అణ్వాయుధాల ప్రయోగ పరీక్షల విషయంలో అమెరికా చేసిన హెచ్చరికలను చైనా తప్పుబట్టింది. ప్రచ్ఛన్న యుద్ధం అనే ఆలోచనా విధానాన్ని అమెరికా విడిచి పెట్టాలని హితవు పలికింది. యుఎస్ అణ్వాస్త్ర వ్యూహ సమీక్ష (ఎన్‌పిఆర్)పై చైనా రక్షణశాఖ మంత్రిత్వశాఖ ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. భద్రతా పరమైన అంశాల కోసం మాత్రమే కొద్దిస్థాయిలో అణ్వాస్త్రాలు అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధమనే ఆలోచనా విధానం నుంచి యుఎస్ బయటకు రావాలని పేర్కొంది. అణ్వాయుధ ప్రయోగాల విషయంలో బీజింగ్ పరిమితులు పాటించాలని, ఆసియా ప్రాంతంలో ప్రయోజనాలను పొందేందుకు అణ్వాయుధాలను ప్రయోగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా రష్యా, చైనా దేశాలకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. అమెరికా, దాని మిత్ర దేశాలపై ఎటువంటి అణ్వప్రయోగాలు జరిపినా, అణ్వాస్త్రాలు ఉగ్రవాదులకు దక్కేలా చేసినా సహించబోమని అందుకు ఆయా దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని శనివారం యూఎస్ హెచ్చరించింది.

పాక్ సైనికులను హతమార్చిన తాలిబన్

పెషావర్: స్వాత్ వ్యాలీలోని పాక్ సైనిక శిబిరం ఆవరణలో సైనికులు వాలీబాల్ ఆడుతుండగా తాలిబన్‌కు చెందిన ఓ ఉగ్రవాది తనని తాను పేల్చేసుకున్నాడు. దాంతో 11 మంది సైనికులు మృతిచెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2013 తరువాత స్వాత్ వ్యాలీలో జరిగిన అతి పెద్ద దాడి ఇదే. మృతుల్లో పాక్ ఆర్మీ కెప్టెన్ కూడా ఉన్నట్లు పాక్ ఆర్మీ మీడియా వర్గాలు వెల్లడించాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. శనివారం సాయంత్రం కబాల్ ప్రాంతంలోని సైనిక శిబిరం ఆవరణలో సైనికులు వాలీబాల్ ఆడుతుండగా ముష్కరుడు వారి వద్దకు వెళ్లి తనని తాను పేల్చేసుకున్నట్లు మీడియా పేర్కొంది. ఈ దాడికి పాల్పడింది తామేనని అఫ్గానిస్థాన్‌కు చెందిన పాకిస్థాన్ తాలిబన్ ప్రకటించింది. సిద్దిఖుల్లా అనే 20 ఏళ్ల సూసైడ్ బాంబర్‌ను పంపించి ఈ దాడి చేయించినట్లు తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ ప్రతినిధి మహమ్మద్ ఖురాసని వెల్లడించాడు. ముమ్మందు ఇలాంటి మరిన్ని దాడులకు పాల్పడతామని హెచ్చరించాడు. 2013 జనవరిలో ఇదే స్వాత్ వ్యాలీలో తాలిబన్లు దాడి చేశారు. స్థానిక మసీదులో ఉగ్రవాదులు దాడులకు పాల్పడటంతో 21 మంది మృత్యువాతపడ్డారు. మరో 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆ స్థాయిలో మళ్లీ ఇక్కడ దాడి జరగడం ఇదే తొలిసారి. పాక్ ఆర్మీపై జరిగిన దాడిని పాకిస్థాన్ ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ ఖండించారు. ఉగ్రవాదాన్ని అణచివేస్తున్నందు పాక్ చేస్తున్న పోరాటాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టంచేశారు.



పాక్ చెరలో 47మంది భారత మత్స్యకారులు



ఇస్లామాబాద్ : భారత్‌కు చెందిన 47 మంది మత్స్యకారులను పాక్ అరెస్ట్ చేసింది. అరేబియా సముద్రంలో తమ ప్రాదేశిక జలాల్లో అక్రమంగా ప్రవేశించారని వారికి చెందిన 9 పడవలను స్వాధీనం చేసుకొంది. విచారణ నిమిత్తం డాస్ పోలీసులకు అప్పగించింది. ఇదే విధంగా గత నెల 19న కూడా 17 మంది భారత మత్స్యకారులను పాక్ అరెస్ట్ చేసింది. ఇప్పటికే పాక్ జైళ్లలో మగ్గుతున్న 292 మందిని గత రెండు నెలల్లో విడుదల చేసింది. వారి వద్ద సరైన సాంకేతిక పరికరాలు లేకపోవడంతో ఎక్కడ చేపలు పడుతున్నాయో తెలియక పాక్ జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. పాక్ మత్స్యకారులు కూడా ఇలాగే భారత్‌లోకి ప్రవేశించి బందీలుగా మారుతున్నారు.

చంద్రబాబుకు రాజ్‌నాథ్ ఫోన్

అమరావతి : బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, దీనిపై కేంద్రంతో పోరాటానికి సిద్ధపడిన టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనక్కి తగ్గారు. కేంద్రం నుంచి బుజ్జగింపులు మొదలవడంతో ఆయన తన పంథాను మార్చుకున్నట్టు తెలుస్తోంది ఆదివారం జరిగిన టిడిపి పార్లమెంటరీ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో పోరాడాలని ఎంపిలకు దిశానిర్దేశం చేశారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశం చివరి నిమిషంలో చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు.

రాజ్‌నాథ్ ఫోన్‌తో మారిన వ్యూహం


పార్టీ ఎంపితో సమావేశంలో ఉన్న చంద్రబాబుకు రాజ్‌నాథ్ సింగ్ నుంచి ఫోన్ రావడంతో వ్యూహం అనూహ్యంగా మారిపోయింది. ముందు పార్లమెంటులో ఆందోళన చేయాలని పార్టీ ఎంపిలకు చంద్రబాబు సూచించగా, కేంద్రం నుంచి ఫోన్ రావడంతో వ్యూహాన్ని మార్చారు. కేటాయింపులపై ముందు కేంద్రంతో చర్చించాలని, పరిస్థితిని బట్టి ఆందోళన చేయాలా? వద్దా? అన్నది నిర్ణయించుకుందా మని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. అయితే, అంతకుముందు ఇదే సమావేశంలో చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంపిలంతా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని ఆదేశించారు. 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. ప్రతిపక్ష నేత జగన్ మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కేంద్రంతో తాడో పేడో తేల్చుకుందాం. ప్రయోజనాలు దక్కేంతవరకు పోరాటాన్ని ఆపేది లేదు' అని చంద్రబాబు ఎంపిలతో అన్నట్లు సమాచారం. ఈ సమావేశానికి తెదేపా ఎంపీ తో పాటు కేంద్రమంత్రి సుజనాచౌదరి హాజరయ్యారు. పౌరవిమానయాన శాఖ మంత్రి అశోకగజపతిరాజు ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడతాం: సుజనా

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంతో టిడిపి మిత్ర బంధాన్ని తెంచుకోదల్చుకోలేదని కేంద్రమంత్రి సుజనా చౌదరి అన్నారు. అయితే, బిజెపితో మిత్ర బంధం కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తెలిపారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని, వాటి సాధనకు కేంద్రంలో పోరాడతామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, అమరావతి నిర్మాణం, రైల్వేజోన్ డిమాండ్లను కేంద్రం నెరవేర్చాలన్నారు. రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలను బిజెపి ఇవ్వని పక్షంలో తదుపరి కార్యాచరణపై పార్టీ చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

ఆంధ్రకు అన్యాయం జరగలేదు: హరిబాబు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి అన్యాయం జరగలేదని విశాఖ ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అన్నారు. ఎపి ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం పరిరక్షిస్తున్నదని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారని, దాని ద్వారా అన్ని విధాలా సాయం చేస్తున్నారని చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన్న అనేక సంస్థలను కేంద్రం ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. కాగా, పోలవరం విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని హరిబాబు అన్నారు. పోలవరం ఆంధప్రదేశ్ ప్రజల జీవనాడి అని బిజెపి భావించిందని వివరించారు. నాగార్జున సాగర్‌కు 50 ఏళ్ల పట్టిందని, పోలవరం ప్రాజెక్టుకు 1981లో పునాదిరాయి వేసినా 2014 వరకు ముందుకు కదల్లేదని చెప్పారు.



బిసి బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : పార్లమెంట్‌లో బిసిలకు చట్టసభలలో రిజర్వేషన్లు పెట్టాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలలో రిజర్వేషన్లు కల్పించాలని, బిసిల విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్లు జనాభా ప్రకారం 50 శాతంకు పెంచాలని వైఎస్‌ఆర్ పార్టీ పార్లమెంట్ సభ్యులు విజయసాయి రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రైవేటు బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ నెల 6వ తేదీన అన్ని కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ప్రత్యేకంగా మన తెలుగు రాష్ట్రాలలో టిఆర్ఎస్ పార్టీ, టిడిపి పార్టీ, కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీలు రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యంగా సమాజ్ వాది పార్టీ, బిఎస్‌పి, బిజెపి, ఆర్‌జెడి, బిజెడి, జనతాదళ్ పార్టీలు ఈ బిసి బిల్లు పై తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడే బిసిలకు చట్టసభలలో రిజర్వేషన్లు పెట్టవలసిన ఆవశ్యకతను రాజ్యాంగ రచయితలు గుర్తించ వలసియుందన్నారు. కానీ బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. గత 26 సంవత్సరాలుగా చట్టసభలలో రిజర్వేషన్లు పెట్టాలని బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 32 సార్లు ప్రధాన మంత్రులను కలిసి చర్చలు జరిపామన్నారు. ఢిల్లీలో వేలాది మందితో 36 సార్లు పార్లమెంట్ వద్ద ప్రదర్శనలు జరపడం జరిగిందన్నారు. ఇక తెలుగు రాష్ట్రాలలో 320 సార్లు ప్రదర్శనలు, ధర్నాలు, కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఉద్యమాలకు స్పందించిన ప్రభుత్వాలు 1996 నుంచి ఇప్పటి వరకు 5 సార్లు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రం ప్రభుత్వానికి పంపిన స్పందన లేదని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు పెట్టవలసిన అవశ్యకతను కృష్ణయ్య గట్టిగ సమర్ధించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు సామూహిక వర్గాలకు జనాభా ప్రకారం రిజర్వేసన్లు కల్పించవలసిన ఆవశ్యకత యుందని కృష్ణయ్య సమర్ధించారు ఇది రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. పార్లమెంటులో ప్రవేశ పెట్టిన ఈ బిల్లుపై చర్చ జరగాలన్నారు. పార్లమెంట్‌లో ప్రాతినాధ్యం వహిస్తున్న 36 రాజకీయ పార్టీలు ఈ బిల్లు పై తమ వైఖరి చేయాలి, లేని పక్షంలో జాతీయ స్థాయిలో పెద్ద యెత్తున ఆందోళనచేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఉన్న96 మంది బీసీ ఎమ్‌పీలు పార్టీలకతీతంగా ఈ బిల్లుకు మద్దతుగా ఉండాలని కోరారు.

సిబిఎస్ఇ ఏకరూప పరీక్షల యోచనకు స్వస్తి

న్యూఢిల్లీ : ఆరు నుంచి 8వ తరగతి వరకు ఏకరూప పరీక్షల విధానాన్ని ప్రవేశపెట్టాలనుకున్న సిబిఎస్ఈ తన నిర్ణయాన్ని మార్చుకుంది. కొత్తవిధానం విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించేలా ఉందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) అభ్యంతరం తెలిపింది. దీంతో ఆలోచనను విరమించుకున్నట్లు సిబిఎస్ఈతెలిపింది.

ఎద్దుల బండిని ఢీకొట్టిన లారీ

ఆంధ్రప్రదేశ్: కర్నూలు జిల్లా పాణ్యం మండలం బలపనూను మెట్ట వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎద్దుల బండిని లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మురో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి రద్దీకి ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : వేసవిలో పలు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వీటిని నడపనున్నట్లు తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సునీల్ కుమార్ తెలిపారు. కాచిగూడ–**విశాఖపట్నం (07016)** :మార్చి 6 నుంచి జూన్ 26 వరకూ ప్రతి మంగళవారం సాయంత్రం 6.45 గంటలకు కాచిగూడలో బయల్దేరి మర్నాడు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరు కుంటుంది. మల్కాజ్‌గిరి, చెరియాపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగు రాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ,ఏలూరు,తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ మీదుగా ప్రయాణం సాగిస్తుంది.

విశాఖపట్నం––తిరుపతి (07479) : మార్చి 7 నుంచి జూన్ 27 వరకూ ప్రతి బుధవారం సాయంత్రం 7.05 గంటలకు విశాఖలో బయల్దేరి మర్నాడుదయం 9.25 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. దువ్వాడ, అనకాపల్లి, తుని,అన్నవరం,సామర్లకోట,రాజమహేంద్రవరం, తాడేపల్లి గూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణం సాగిస్తుంది..

తిరుపతి–విశాఖపట్నం(07487) :ఈ ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలు మార్చి 4 నుంచి జూన్ 24 వరకూ ప్రతి ఆదివారం రాత్రి 10.30 గ.లకు తిరుపతిలో బయల్దేరి మర్నాడుదయం 10.45గ.లకు విశాఖపట్నం చేరుకుంటుంది.

విశాఖపట్నం––తిరుపతి (07488) : మార్చి 5 నుంచి జూన్ 25 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 7.20 గంటలకు విశాఖలో బయల్దేరి మర్నాడుదయం 8.10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. రేణిగుంట, నెల్లూరు,ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోట, దువ్వాడ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

సికింద్రాబాద్––గువాహటి (07149) :మార్చి 2 నుంచి జూన్ 29 వరకూ ప్రతి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 8.35 గంటలకు విశాఖ వస్తుంది. తిరిగి 8.55 గంటలకు బయల్దేరి ఆదివారం ఉదయం8.45గ.లకు గువాహటి వెళ్తుంది.

గువాహటి-సికింద్రాబాద్ (07150) : మార్చి 5 నుంచి జూన్ 25 వరకూ ప్రతి సోమవారం ఉదయం 5.25 గంటలకు బయలుదేరుతుంది.

ఫ్రెంచ్ ఓపెన్‌కు సానియా మీర్జా దూరం!



గ్రేటర్ నోయిడా: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ప్రతిష్టాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్‌కు దూరం కానుంది. గాయం నుంచి పూర్తిగా కోలుకోక పోవడంతో తాను మరో రెండు నెలల పాటు ఆటకు దూరంగా ఉండక తప్పడం లేదని సానియా పేర్కొంది. ఇప్పటికే సానియా ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమెకు మరో రెండు నెలల పాటు విశ్రాంతి అవసరమని వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో ఫ్రెంచ్ ఓపెన్ టోర్నమెంట్‌లో సానియా బరిలోకి దిగడం దాదాపు అసాధ్యంగా మారింది. ఇదే విషయాన్ని ఆదివారం సానియా సూచన ప్రయంగా వెల్లడించింది. గాయం తనను వెంటాడుతోందని, శస్త్ర చికిత్స చేసుకున్న ఈ బాధ నుంచి ఇంకా బయట పడలేక పోతున్నానని వాపోయింది. 2016లో సానియా వరుస గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలుచుకుని ప్రపంచ టెన్నిస్‌లో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. అయితే కిందటి ఏడాది గాయాలు సానియాను వెంటాడాయి. దీంతో ఆమె చాలా టోర్నీలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఈ ఏడాది మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని భావించిన హైదరాబాదీ స్టార్‌కు గాయాలు వీడడం లేదు. దీంతో మరి కొన్ని నెలల పాటు ఆటకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, ఆదివారం ఇక్కడ ఓ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించేందుకు వచ్చింది.



కోహ్లి సేన అరుదైన రికార్డు

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా అరుదైన రికార్డును నమోదు చేసింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్ మరో అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. దక్షిణాఫ్రికా గడ్డపై అత్యధిక బంతులు మిగిలివుండగానే విజయం సాధించిన తొలి జట్టుగా భారత్ నిలిచింది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఆస్ట్రేలియా పేరిట ఉన్న 153 బంతుల రికార్డును భారత్ తిరగరాసింది. రెండో వన్డేలో భారత్ 177 బంతులు మిగిలివుండగానే విజయాన్ని అందుకుని కొత్త రికార్డును నెలకొల్పింది. 2000లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 153 బంతులు మిగిలివుండగానే విజయం అందుకొని చరిత్ర సృష్టించింది. ఆదివారం భారత్ ఈ రికార్డును బద్దలు కొట్టింది.



డ్రాతో గట్టెక్కిన బంగ్లాదేశ్

చిట్టగాంగ్: శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. యువ ఆటగాడు మోమినుల్ హక్ వీరోచిత సెంచరీతో కదం తొక్కడంతో ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు ఈ మ్యాచ్‌లో ఓటమిని తప్పించుకొని డ్రాతో బయట పడింది. ఆదివారం చివరి రోజు ఆటముగిసే సమయానికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. ఒక దశలో 81 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన బంగ్లాను మోమినుల్ హక్, వికెట్ కీపర్ లిటన్ దాస్ ఆదుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో (176) పరుగులు సాధించిన హక్ రెండో ఇన్నింగ్స్‌లోనూ జట్టుకు అండగా నిలిచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన హక్ 105 పరుగులు చేశాడు. మరోవైపు వికెట్ కీపర్ దాస్ 94 పరుగులు చేసి ఔటయ్యాడు. అతను ఆరు పరుగుల తేడాతో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. కెప్టెన్ మహ్మదుల్లా 28 (నాటౌట్), ముసద్దెక్ హుస్సేన్ 8(నాటౌట్) సమన్వయంతో బ్యాటింగ్ చేసి జట్టును ఓటమి నుంచి రక్షించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 513 పరుగులు చేసింది. శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 713 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది.



సఫారీ చిత్తు

- చెలరేగిన చాహల్, కుల్దీప్ మ్యాజిక్
- రాణించిన ధావన్, కోహ్లి
- రెండో వన్డేలో భారత్ ఘన విజయం, దక్షిణాఫ్రికా ఘోర పరాజయం



సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 32.2 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. యజువేంద్ర చాహల్ (5/22), కుల్దీప్ యాదవ్ (3/20) చెలరేగి పోవడంతో దక్షిణాఫ్రికా తక్కువ స్కోరుకే ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20.3 ఓవర్లలోనే కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన టీమిండియా రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. బౌలింగ్‌లో రాణించిన చాహల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే బుధవారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

ప్రారంభం నుంచే...

టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. అనుకున్నట్టే భారత బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి జట్టు బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెంచారు. భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా అద్భుత బంతులతో సౌతాఫ్రికా ఓపెనర్లను హడలెత్తించారు. దీంతో సఫారీల స్కోరు నత్తనడకన సాగింది. ఇక స్కోరును పెంచే క్రమంలో ఓపెనర్ హాషిం ఆమ్లా తన వికెట్‌ను కోల్పోయాడు. 32 బంతుల్లో 4 ఫోర్లతో 23 పరుగులు చేసిన ఆమ్లాను భువనేశ్వర్ వెనక్కి పంపాడు. దీంతో 39 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

చాహల్, కుల్దీప్ జోరు...

ఆమ్లా ఔటైన వెంటనే దక్షిణాఫ్రికా కష్టాలు మొదలయ్యాయి. కుదురుగా ఆడుతున్న డికాక్‌ను చాహల్ ఔట్ చేశాడు. డికాక్ రెండు ఫోర్లతో 20 పరుగులు చేశాడు. మరోవైపు కెప్టెన్ మార్‌క్రామ్ (8)ను కుల్దీప్ పెవిలియన్ బాట పట్టించాడు. తర్వాత వచ్చిన స్టార్ ఆటగాడు డేవిడ్ మిల్లర్‌ను కూడా కుల్దీప్ వెనక్కి పంపాడు. అతను ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. దీంతో దక్షిణాఫ్రికా 51 పరుగుల వద్దే నాలుగో వికెట్‌ను కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను సీనియర్ బ్యాట్స్‌మన్ డుమిని, యువ ఆటగాడు ఖయా జొండో తమపై వేసుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఈ క్రమంలో కొద్దిసేపు వికెట్ల పతనాన్ని సైతం అడ్డుకున్నారు. అయితే వీరి పోరాటం కూడా ఎక్కువ సేపు సాగలేదు. సమన్వయంతో బ్యాటింగ్ చేస్తున్న జొండోను చాహల్ ఔట్ చేశాడు. జొండో 45 బంతుల్లో రెండు ఫోర్లతో 25 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. ఆ వెంటనే డుమిని కూడా వెనుదిరిగాడు. రెండు బౌండరీలతో 25 పరుగులు చేసిన డుమిను చాహల్ పెవిలియన్ పంపాడు. కొద్ది సేపటికే రబడా (1) కుల్దీప్ బలిగొన్నాడు. దీంతో సౌతాఫ్రికా మళ్లీ కోలుకోలేక పోయింది. చివర్లో క్రిస్ మోరిస్ (14) మాత్రమే డబుల్ డిజిట్ మార్క్ ను అందుకున్నాడు. భారత బౌలర్లలో చాహల్ ఐదు, కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టారు. బుమ్రా, భువనేశ్వర్‌లకు ఒక్కో వికెట్ లభించింది. కాగా, దక్షిణాఫ్రికా చివరి ఆరు వికెట్లను 19 పరుగుల తేడాతో చేజార్చుకోవడం విశేషం. భారత స్పిన్నర్ల జోరు ముందు సఫారీ బ్యాట్స్‌మెన్ ఎదురు నిలువలేక పోయారు. ఈ క్రమంలో చాహ ల్ కొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. దక్షిణాఫ్రికా గడ్డపై ఐదు వికెట్లు పడగొట్టిన తొలి స్పిన్నర్‌గా చాహల్ రికార్డు సృష్టించాడు. చాహల్ కెరీర్‌లో కూడా ఇదే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన కావడం విశేషం.

అలవోకగా...

స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ మెరుగైన ఆరంభాన్ని ఇచ్చారు. రోహిత్ దూకుడుగా ఆడుతూ సౌతాఫ్రికా బౌలర్లను హడలెత్తించాడు. అయితే 17 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 15 పరుగులు చేసిన రోహిత్‌ను రబడా వెనక్కి పంపాడు. అనవసర షాట్‌కు ప్రయత్నించి రోహిత్ వికెట్‌ను చేజేతులా చేజార్చుకున్నాడు. ఈ దశలో క్రీజులో వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి అండతో మరో ఓపెనర్ శిఖర్ ధావన్ స్కోరును పరిగెత్తించాడు. తొలి మ్యాచ్‌లో నిర్లక్ష్యంగా ఆడి వికెట్‌ను పారేసుకున్న ధావన్ ఈసారి అటువంటి పొరపాట్లకు తావులేకుండా ఆడాడు. ఇద్దరు పోటీ పడి ఆడడంతో భారత్ వేగంగా లక్ష్యం దిశగా అడుగులు వేసింది. అయితే భారత్ లక్ష్యానికి రెండు పరుగుల దూరంలో ఉన్నప్పుడూ అంపైర్లు లంచ్ బ్రేక్‌ను ప్రకటించారు. అయితే తర్వాత మళ్లీ బ్యాటింగ్ చేపట్టిన టీమిండియా మూడు బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన ధావన్ 9 ఫోర్లతో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి 50 బంతుల్లో 4ఫోర్లు, ఒక సిక్సర్‌తో 46 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. దీంతో భారత్ 29.3 ఓవర్లు మిగిలివుండగానే లక్ష్యాన్ని అందుకుంది.

స్కోరు బోర్డు:

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హాషిం ఆమ్లా (సి) ధోని (బి) భువనేశ్వర్ కుమార్ 22, డికాక్ (సి) హార్దిక్ (బి) చాహల్ 20, ఐడెన్ మార్‌క్రామ్ (సి) భువనేశ్వర్ కుమార్ (బి) కుల్దీప్ యాదవ్ 8, జీన్ పాల్ డుమిని ఎల్బీ (బి) చాహల్ 25, డేవిడ్ మిల్లర్ (సి) రహానె (బి) కుల్దీప్ యాదవ్ 0, ఖయా జొండో (సి) హార్దిక్ (బి) చాహల్ 25, క్రిస్ మోరిస్ (సి) భువనేశ్వర్ (బి) చాహల్ 14, రబడా ఎల్బీ (బి) కుల్దీప్ యాదవ్ 1, మోర్నీ మోర్కెల్ ఎల్బీ (బి) చా హల్ 1, ఇమ్రాన్ తాహిర్ (బి) బుమ్రా 0, తబ్రేస్ షంసి నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 1, 32.2 ఓవర్లలో 118 ఆలౌట్.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 5–1–19–1, జస్‌ప్రిత్ బుమ్రా 5–1–12–1, హార్దిక్ పాండ్య 5–0–34–0, చాహల్ 8.2–1–22–5, కుల్దీప్ యాదవ్ 6–0–20–3, కేదార్ జాదవ్ 3–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మోర్కెల్ (బి) రబడా 15, ధావన్ నాటౌట్ 51, కోహ్లి నాటౌట్ 46, ఎక్స్‌ట్రాలు 7, మొత్తం 20.3 ఓవర్లలో 119/1.
బౌలింగ్: మోర్నీ మోర్కెల్ 4–0–30–0, రబడా 5–0–24–1, క్రిస్ మోరిస్ 3–0–16–0, ఇమ్రాన్ తాహిర్ 5.3–0–30–0, తబ్రేజ్ షంసి 3–1–18–0.

సింధుకు రన్నరప్

బివెన్‌కు టైటిల్, ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పివి.సింధు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో సింధు అమెరికా క్రీకారిణి బివెన్ జంగ్ చేతిలో కంగుతింది. పురుషుల సింగిల్స్‌లో చైనా ఆటగాడు యుకి షి టైటిల్ గెలుచుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో సింధు, బివెన్‌ల మధ్య హోరాహోరీ సమరం జరిగింది. ఈ మ్యాచ్‌లో బివెన్ 21–18, 11–21, 22–20 తేడాతో సింధును ఓడించింది. ఫైనల్లో గెలవ లేని తన బలహీనతను మరోసారి నిరూపించిన సింధు రన్నరప్‌తో సంతృప్తి పడక తప్పలేదు. ప్రారంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీంతో పోరు యుద్ధాన్ని మరిపించింది. కీలక సమయంలో సింధు ఒత్తిడిని తట్టుకోలేక పోయింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న బివెన్ తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధుకు ఎదురులేక పోయింది. అద్భుత షాట్లతో చెలరేగిన సింధు ఏదశలోనూ బివెన్‌ను కోలుకోనివ్వలేదు. సింధు చెలరేగడంతో బివెన్ చేతులెత్తేసింది. పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు సునాయాసంగా సెట్‌ను దక్కించుకుంది. కానీ, కీలకమైన మూడో సెట్‌లో మళ్లీ బివెన్ పుంజుకుంది. ఇద్దరు కూడా పట్టు విడవకుండా పోరాడారు. దీంతో పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఒక దశలో సింధు కాస్త వెనుకబడినట్టు కనిపించినా వేగంగా కోలుకుంది. అయితే బివెన్ అద్భుత షాట్లతో సింధును ఉక్కిరిబిక్కిరి చేసింది. అంతేగాక ఒత్తిడిని తట్టుకోవడంలో విఫలమైంది. కీలక సమయంలో తప్పిదాలకు పాల్పడడంతో బివెన్ చేతిలో కంగుతినక తప్పలేదు. ఒక దశలో 20–19తో ఆధిక్యంలో కనిపించిన సింధు తర్వాత చేజేతులా ఓటమిని కొని తెచ్చుకుంది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న బివెన్ సంచలన విజయాన్ని సాధించి చాంపియన్‌గా అవతరించింది. పురుషుల సింగిల్స్‌లో యుకి షి 21–18, 21–14 తేడాతో తైవాన్ ఆటగాడు టీన్ చెన్ చౌను చిత్తు చేశాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన యుకి సునాయాసంగా విజయం సాధించి ఇండియా ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.



బిగ్‌బాష్ విజేత ఆడిలైడ్ స్ట్రయికర్స్

ఆడిలైడ్: ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా దేశవాళి ట్వంటీ–20 క్రికెట్ లీగ్‌లో ఆడిలైడ్ స్ట్రయికర్స్ ట్రోఫీను గెలుచుకుంది. 2017–18 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో అసాధారణ ఆటను కనబరిచిన ఆడిలైడ్ జట్టు కొత్త చాంపియన్‌గా అవతరించింది. ఆడిలైడ్ బిగ్‌బాష్ ట్రోఫీని సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆడిలైడ్ 25 పరుగుల తేడాతో హోబర్ట్ హరికేన్స్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆడిలైడ్ స్ట్రయికర్స్ 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. ఓపెనర్ జాక్ వెదర్లాండ్ కళ్లు చెదిరే శతకంతో ఆడిలైడ్‌ను ఆదుకున్నాడు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన వెదర్లాండ్ 70 బంతుల్లోనే 8 భారీ సిక్సర్లు, మరో 9 ఫోర్లతో 115 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన ట్రావిస్ హెడ్ 44 పరుగులతో అజేయంగా ఉన్నాడు. తర్వత బ్యాటింగ్‌కు దిగిన హోబర్ట్ జట్టు 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 177 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఓపెనర్ షార్ట్ ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 68, కెప్టెన్ జార్జ్ బెయిలీ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 46 పరుగులు చేసినా జట్టును గెలిపించలేక పోయారు. కీలక సమయంలో ఆడిలైడ్ బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ జట్టుకు ట్రోఫీని సాధించి పెట్టారు.





ఐసిసి యువ జట్టులో భారత కుర్రాళ్ల హవా

దుబాయి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ప్రకటించిన తాజా అండర్–19 జట్టులో భారత ఆటగాళ్ల హవా నడిపించింది. శనివారం అండర్–19 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత యువ జట్టు జోరు ఐసిసి ప్రకటించిన టీమ్‌లోనూ నడిపించింది. ఐసిసి ప్రకటించిన జట్టులో దాదాపు సగం మంది ఆటగాళ్లు భారత్‌కు చెందిన వారే ఉండడం విశేషం. కెప్టెన్ పృథ్వీ షా, ఓపెనర్ మన్‌జోత్ కల్రా, శుభ్‌మన్ గిల్‌లు బ్యాటింగ్ విభాగంలో చోటు సంపాదించారు. మరోవైపు అనుకుల్ రాయ్, కమలేష్ నాగర్‌కోటి బౌలింగ్ విభాగంలో చోటు దక్కించుకున్నారు. ఐసిసి ప్రకటించిన 11 మంది ఆటగాళ్లలో ఐదుగురు భారత్‌కు చెందిన క్రికెటర్లే ఉండడం విశేషం. కాగా, దక్షిణాఫ్రికాకు చెందిన రాయ్‌నార్ట్ వాన్‌టోండర్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. దక్షిణాఫ్రికాకు చెందిన వాండైర్ మక్వేటును వికెట్ కీపర్‌గా ఎంపిక చేశారు.

గెరాల్డ్ కొట్టి (దక్షిణాఫ్రికా) కూడా జట్టులో ఎంపికయ్యాడు. అఫ్ఘాన్ క్రికెటర్ ఖాయిస్ అహ్మద్, పాకిస్థాన్ యువ సంచలనం షహీన్ అఫ్రిది కూడా తుది 11 మందిలో చోటు దక్కించుకున్నారు. న్యూజిలాండ్ ఆటగాడు ఫీల్ అలెన్ కూడా జట్టులో స్థానం పొందాడు. విండీస్‌కు చెందిన అలిక్ అథనాజే 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు. కాగా, ప్రపంచకప్ రన్నరప్ ఆస్ట్రేలియా నుంచి ఒక్క ఆటగాడు కూడా ఐసిసి జట్టులో ఎంపిక కాకపోవడం విశేషం. ఇంగ్లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ ఆటగాళ్లు కూడా ఐసిసి జట్టులో చోటు సంపాదించడంలో విఫలమయ్యారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.